PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

# ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 120 | విజయవాడ, శుక్రవారం 1 డిసెంబర్ 2023 | 8 + 8 పేజీలు వెల : 5. 50

Vol No | Vijayawada, Friday 1 December 2023 | Rs

'సర్వరాయ' గుర్తింపు సంఘం ఎన్నికల్లో సిఐటియు ఘన విజయం

లోపలి పేజీలో..



మూడు ఫార్మాట్లకు ముగ్గురు సారథులు

- దక్షిణాఫ్రికా పర్యటనకు జట్లను ప్రకటించిన బిసిసిఐ

లోపలి పేజీలో..

# బిజెపికి ఎదురుగాలి!

## ఎగ్జిట్ పోల్స్ వెల్లడి

- రాజస్థాన్ ఒక్కటే అవకాశం
- తెలంగాణలో కాంగ్రెస్
- మధ్య ప్రదేశ్‌లో హస్తానికే మొగ్గు
- చత్తీస్‌గఢ్‌లో పోటాపోటీ
- మిజోరాంలో హంగ్

**న్యూఢిల్లీ :** ఇడి, ఐటి, సిబిఐ దాడుల ద్వారా రాజకీయ ప్రత్యర్థులను దెబ్బ తీసి ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో అందలమెక్కాలని చూసిన బిజెపికి మరోసారి శృంగభంగం తప్పదని గురువారం విడుదలైన ఎగ్జిట్ పోల్స్ సంకేతాలిస్తున్నాయి. 2024 పార్లమెంటు ఎన్నికలకు అయిదు మాసాల ముందు జరిగిన రాజస్థాన్, చత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, తెలంగాణా, మిజోరాం అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్క రాజస్థాన్‌లో మినహా ఎక్కడా ఆ పార్టీ గెలిచే అవకాశాలు లేవని ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు తెలియజేస్తున్నాయి. ఛత్తీస్‌గడ్‌లో వరుసగా రెండోసారి బిజెపికి ఓటమి తప్పదని చెబుతున్నాయి. తెలంగాణలో బిఆర్‌ఎస్, బిజెపిలను వెనక్కి నెట్టి కాంగ్రెస్ అధికారం చేజిక్కించుకోనున్నట్లు ఎగ్జిట్ పోల్స్ వెల్లడిస్తున్నాయి. అసదుద్దీన్ ఒవైసీ నేతృత్వంలోని ఎంఐఎంకు గతం కంటే సీట్లు తగ్గుతాయని అంచనా వేశాయి.

తెలంగాణలో కాంగ్రెస్‌కు 63–79 సీట్లు, బిఆర్‌ఎస్‌కు 31–47, బిజెపికి 2–4, ఎఐఎంఐఎంకు 5–7 సీట్లు వస్తాయని ఇండియా టీవీ–సిఎన్‌ఎక్స్ అంచనా వేయగా, కాంగ్రెస్‌కు 48–64 సీట్లు వస్తాయని జన్ కీ బాత్ అంచనా వేసింది. బిఆర్‌ఎస్‌కు 40–55, బిజెపికి 7–13, ఎఐఎంఐఎంకు 4–7 సీట్లు వస్తాయి. తెలంగాణలో కాంగ్రెస్‌కు 58–68, బిఆర్‌ఎస్‌కు 46–56, బిజెపికి 4–9, ఎఐఎంఐఎంకు 5–9 సీట్లు వస్తాయని రిపబ్లిక్ మిగతా 2లో

ఫొటో : నరహరి



వికారాబాద్ జిల్లా కొడంగల్‌లో ఓటు వేసేందుకు క్యూ కట్టిన ఓటర్లు

తెలంగాణ -119

| సర్వేసంస్థ | కాంగ్రెస్ | బిఆర్ఎస్ | బిజెపి | ఇతరులు |
|---|---|---|---|---|
| జన్‌కిబాత్ | 48-64 | 40-55 | 7-13 | 4-7 |
| పీపుల్స్‌పల్స్ | 62-72 | 35-46 | 3-8 | 7-9 |
| సిఎన్ఎన్ | 56 | 48 | 10 | 5 |
| సిఓటర్ | 57 | 46 | 9 | 7 |
| టుడేస్ చాణక్య | 24-42 | 62-80 | 2-12 | 5-11 |

మిజోరం - 40

| | కాంగ్రెస్ | బిజెపి | ఎంఎన్ఎఫ్ | జెడ్‌పిఎం |
|---|---|---|---|---|
| ఎబిపి న్యూస్ -సి ఓటర్ | 2-8 | 0 | 15-21 | 12-18 |
| ఇండియా టివి సిఎన్ఎక్స్ | 8-10 | 2 | 14-18 | 12-16 |
| ఇండియా టుడే | 2-4 | 2 | 3-7 | 28-35 |
| టైమ్స్ నౌ | 9-13 | 2 | 14-18 | 19-14 |

మధ్యప్రదేశ్- 230

| సర్వేసంస్థ | కాంగ్రెస్ | బిజెపి |
|---|---|---|
| ఇండియా టుడే | 140-162 | 168-90 |
| న్యూస్24 టుడే | 151 | 74 |
| ఇండియా టివి | 140-159 | 70-89 |
| టివి9 భరత్‌వర్ష | 111-121 | 106-111 |

రాజస్థాన్ -199

| సర్వేసంస్థ | కాంగ్రెస్ | బిజెపి |
|---|---|---|
| ఇండియా టుడే | 86-106 | 80-100 |
| ఇండియా టీవి | 94-104 | 80-90 |
| టివి9 భరత్‌వర్ష | 101 | 89 |

ఛత్తీస్‌గఢ్ - 90

| సర్వేసంస్థ | కాంగ్రెస్ | బిజెపి |
|---|---|---|
| ఎబిపి న్యూస్-సి ఓటరు | 41-53 | 36-48 |
| ఇండియా టుడే | 45 | 41 |
| న్యూస్ 24 | 101 | 89 |

## తెలంగాణలో 75 శాతం పైగా పోలింగ్

- 3న కౌంటింగ్

**ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ అసెంబ్లీలోని మొత్తం 119 స్థానాలకు గురువారం నిర్వహించిన పోలింగ్‌లో 75 శాతం పైగా ఓట్లు పోలయ్యాయి. చెదురు మదురు ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. కొన్ని చోట్ల ఇవిఎంలు మొరాయించడంతో పోలింగ్ ఆలస్యంగా మొదలైంది. సాయంత్రం ఐదు గంటలకు పోలింగ్ సమయం ముగిసినా పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరి ఉండడంతో క్యూలో ఉన్నవారందరికీ ఓటు వేసేందుకు నిబంధనల మేరకు అనుమతించారు. ఖమ్మం, ఆదిలాబాద్, నిజామాబాద్, మహబూబ్ నగర్ జిల్లాల్లోని పలు పోలింగ్ కేంద్రాల్లో రాత్రి ఎనిమిది గంటల వరకు పోలింగ్ కొనసాగింది. హైదరాబాద్ పరిధిలోని 15 నియోజకవర్గాల్లో పోలింగ్ శాతం తగ్గింది. 2018 ఎన్నికల్లో 79.7 శాతం ఓట్లు పోలయ్యాయి. పోలింగ్ కేంద్రాల నుంచి ఇవిఎం యూనిట్లను పటిష్ట బందోబస్తు నడుమ స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించారు. డిసెంబర్ 3న కౌంటింగ్ జరగనుంది. పోలింగ్ ముగిసిన తర్వాత వెల్లడైన ఎగ్జిట్ పోల్స్ అన్నీ కాంగ్రెస్ వైపే మొగ్గుచూపాయి. పూర్తి మెజార్టీతో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని వెల్లడించాయి. అంతేకాకుండా కామారెడ్డిలో సిఎం కెసిఆర్ ఓడిపోతున్నారని విశ్లేషించాయి. ప్రధాని మోడీతో సహా బిజెపి అగ్ర నేతలందరూ తెలంగాణలో మకాం వేసి విస్తృతంగా ప్రచారం చేసినా ఆ పార్టీకి సింగిల్ డిజిట్‌కే పరిమితం అవుతుందని స్పష్టం చేశాయి.



నాగార్జున సాగర్ డ్యాంపై ముళ్లకంచెతో ఏర్పాటు చేసిన బారికేడ్లు (ఇన్‌సెట్‌లో కుడి కాల్వకు నీటి విడుదల)

## 'సాగర్ 'డ్యామ్‌పై ఉద్రిక్తత

- పోలీస్ బందోబస్తు మధ్య కుడి కాలువకు నీటి విడుదల

**ప్రజాశక్తి - యంత్రాంగం**

నాగార్జునసాగర్ ప్రాజెక్టు వద్ద గురువారం తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. రాష్ట్ర పోలీసులు ప్రాజెక్టు 13వ గేటు వరకు దూసుకువెళ్లి తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ముళ్లకంచెను ఏర్పాటు చేశారు. అనంతరం నీటిపారుదల శాఖ అధికారులు కుడికాలువకు నీటిని విడుదల చేశారు. బుధవారం అర్ధరాత్రి నుండి చోటుచేసుకున్న ఈ పరిణామాలు చర్చనీయాంశంగా మారాయి. అర్ధరాత్రి రెండు గంటల సమయంలో గుంటూరు, నర్సరావుపేట నుంచి పోలీసు బలగాలు నాగార్జునసాగర్ చేరుకున్నాయి. సాగర్ ప్రాజెక్టు తెలంగాణ ప్రభుత్వ ఆధీనంలోని రిజర్వు పోలీసు బందోబస్తులో ఉన్న విషయం తెలిసిందే. రహదారి గేటు వద్దకు చేరుకున్న రాష్ట్ర పోలీసులు 13వ గేటు వరకు దూసుకువెళ్ళారు. అక్కడ ముళ్లకంచెను ఏర్పాటుచేశారు. వాహనాలు తనిఖీ చేసి ఆంధ్ర ప్రాంతం వారికి మాత్రమే అనుమతిచ్చారు. గురువారం ఉదయం ఎనిమిది గంటల సమయంలో ఆంధ్ర ఇరిగేషన్ శాఖ అధికారులు కుడి కాలువకు నీటిని విడుదల చేసేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. కష్ణా నదికి వరద ప్రవాహం ఎక్కువగా ఉన్నప్పుడు నీటిని విడుదల చేసే క్రస్ట్ గేట్ల మెయింటెనెన్స్‌తో పాటు కుడికాలువ గేట్ల మెయింటెనెన్స్ కూడా తెలంగాణ వైపు భూభాగంలో ఉన్న ఇరిగేషన్ శాఖ అధికారుల ఆధీనంలోనే ఉంటాయి. తాజాగా ఆ వ్యవస్థను రాష్ట్ర అధికారులు మార్చివేసినట్లు చెబుతున్నారు. రాష్ట్ర హద్దుల్లోనే కుడి కాలువకు నీటి విడుదల చేసేందుకు అనువుగా సిస్టమ్‌ను ఏర్పాటు చేసి, గురువారం ఉదయం 10 గంటల సమయంలో నీటిని విడుదల చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లా, ప్రకాశం జిల్లాలోని చెరువులకు గ్రామాలకు తాగునీటి అవసరాల కోసం నీటిని విడుదల చేస్తున్నట్లు ఇరిగేషన్ శాఖ అధికారులు చెప్తున్నారు. మొదటగా 1500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. అనంతరం 3,000 క్యూసెక్కుల వరకు పెంచనున్నట్లు అధికారులు తెలిపారు. సుమారు అయిదు టిఎంసిల నీటిని తాగునీటి అవసరాల కోసం తీసుకోనున్నట్లు తెలిపారు.

### ఉద్రిక్తతలను నివారించండి : సిపిఎం

నాగార్జున సాగర్ వద్ద నీటి విడుదల విషయంలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులను నివారించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో పంటలు ఎండిపోతున్నందున రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వంతో చర్చలు జరిపి ఘర్షణలను నివారించి కరువు ప్రాంతాలకు నీరు విడుదల చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

# అవుకు రెండోటన్నెల్‌ప్రారంభం

- సిఎం జగన్‌మోహన్‌రెడ్డి

**ప్రజాశక్తి - బనగానపల్లె, కడప ప్రతినిథి**

నంద్యాల జిల్లా అవుకు మండలం మెట్టుపల్లె సమీపంలోని అవుకు రెండో టన్నెల్‌ను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గురువారం ప్రారంభించారు. తొలుత గన్నవరం విమానాశ్రయం నుంచి ఓర్వకల్లు విమానాశ్రయానికి చేరుకున్న ముఖ్య మంత్రి అక్కడి నుంచి హెలీకాప్టర్ ద్వారా అవుకు సమీపంలోని హెలీప్యాడ్ వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి అవుకు రెండో టన్నెల్ వద్దకు చేరుకుని పైలాన్‌ను ఆవిష్కరించారు. గోరకల్లు రిజర్వాయర్ నుంచి అదనంగా 10 వేల క్యూసెక్కులతో కలిపి మొత్తం 20 వేల క్యూసెక్కుల నీటిని అవుకు రిజర్వాయర్‌కు విడుదల చేశారు. రెండో సొరంగం పనుల ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలించారు. అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రెండు టన్నెళ్ల ద్వారా 20వేల క్యూసెక్కుల నీటిని అవుకు రిజర్వాయరుకు తరలించి అక్కడి నుండి గాలేరు నగరి వరద కాలువ ద్వారా కడప, చిత్తూరు జిల్లాలకు తరలించనున్నారు. ఆ జిల్లాలో 2.60 లక్షల ఎకరాలకు సాగునీరు, 1.31 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ, 640 గ్రామాల్లోని 20 లక్షల మందికి తాగునీటిని అందించనున్నారు. కార్యక్రమంలో జిల్లా ఇంచార్జ్ మంత్రి ఎస్.బి. అంజాద్ బాషా, జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం, జలవనరుల ప్రభుత్వ సలహాదారు గంగుల ప్రభాకర్‌రెడ్డి, జలవనరుల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషన్ కుమార్ ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



అవుకు రెండో సొరంగం ద్వారా వెళ్తున్న నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి

### పెద్దదర్గాలో ప్రార్థనలు

కడప అమీన్‌పీర్ దర్గాను గురువారం మధ్యాహ్నం సిఎం సందర్శించారు. ప్రభుత్వ లాంఛనాలతో పూల చాదర్ సమర్పించారు. అంతకుముందు అమీన్‌పీర్ దర్గా ప్రాంగణానికి చేరుకున్న ముఖ్యమంత్రికి దర్గా ప్రతినిధులు స్వాగతం పలికారు. అనంతరం దర్గా పీఠాధిపతుల వారిచే "సూఫీ సర్మాస్త్ సానీ షిలాక్" సంప్రదాయం ప్రకారం ముఖ్యమంత్రికి తలపాగా (పేటా) అలంకరణ చేసి, మెడలో షేలా (కండువా), ఇలాచి (దండ) ధరింపజేశారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ.. మత సామరస్యానికి ప్రతీక అయిన కడప అమీన్‌పీర్ దర్గాను సందర్శించడం నా అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. ప్రార్థనలు అనంతరం కడప విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో విజయవాడ చేరుకున్నారు.

## ఫైబర్ నెట్ కేసులో చంద్రబాబు ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా

**ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో**

ఫైబర్ నెట్ కేసులో టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. జస్టిస్ అనిరుద్ధ బోస్, జస్టిస్ బేలా ఎం. త్రివేదితో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై గురువారం విచారణ జరిపింది. తదుపరి విచారణను డిసెంబరు 12కు వాయిదా వేసింది. అక్టోబర్ 13, 17, 20, నవంబరు 9 తేదీల్లో ఇదే పిటిషన్ ధర్మాసనం ముందుకు వచ్చింది. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబు క్వాష్ పిటిషన్ దాఖలు చేయడంతో అందులో తీర్పు ఇచ్చిన తర్వాత దీన్ని పరిశీలిస్తామని న్యాయమూర్తులు గత విచారణ సమయంలో స్పష్టం చేశారు. 17ఎ అంశంపై తీర్పు వచ్చాకే ఫైబర్ నెట్ కేసులో ముందస్తు బెయిల్ పిటిషన్‌ను విచారిస్తామని ధర్మాసనం మరోసారి స్పష్టం చేసింది. అప్పటి వరకు అరెస్టు చేయొద్దన్న నిబంధన కొనసాగు తుందని తెలిపింది. 17ఎ అంశంపై తీర్పు ప్రాసెస్‌లో ఉందని జస్టిస్ అనిరుద్ధబోస్ తెలిపారు.

## ద్వితీయ త్రైమాసికంలో జిడిపి 7.6 శాతం పెరుగుదల

**న్యూఢిల్లీ :** ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జులై నుంచి సెప్టెంబర్‌తో ముగిసిన ద్వితీయ త్రైమాసికం (క్యూ2)లో భారత స్థూల దేశీయోత్పత్తి (జిడిపి) 7.6 శాతం పెరిగింది. తయారీ, నిర్మాణ రంగాలు మెరుగైన ప్రగతిని కనబర్చాయని కేంద్ర గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఒ) గురువారం వెల్లడించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో 6.2 శాతం వృద్ధి చోటు చేసుకోగా.. గడిచిన ఏప్రిల్ – జూన్ త్రైమాసికంలో 7.8 శాతం పెరుగుదల చోటు చేసుకుంది. దీంతో పోల్చితే జిడిపి తగ్గినట్లయ్యింది. 2011–12 స్థిర ధరల ప్రకారం.. గడిచిన క్యూ2లో స్థూల దేశీయోత్పత్తి రూ.41.74 లక్షల కోట్లుగా నమోదయ్యింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.38.78 లక్షల కోట్లుగా ఉంది. సెప్టెంబర్ త్రైమాసికంలో జిడిపి 6.5 శాతం నమోదుకావచ్చునని ఆర్‌బిఐ ఇదివరకు అంచనా వేసింది. గతేడాది ద్వితీయ త్రైమాసికంతో పోలిస్తే తయారీ రంగం 13.9 శాతం, నిర్మాణ రంగం 7.9 శాతం వృద్ధి నమోదు చేయడంతో ఆర్‌బిఐ అంచనా కంటే జిడిపి స్వల్పంగా పెరిగింది.



## సామాజిక న్యాయంపై ఆ పార్టీలది మొసలి కన్నీరు

- వైసిపి, టిడిపి, జనసేన తీరుపై రాఘవులు విమర్శ

**ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి**



సామాజిక న్యాయం విషయంలో వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు మొసలి కన్నీరు కారుస్తున్నాయని, సామాజిక న్యాయానికి తూట్లు పొడుస్తోన్న బిజెపికి ఎందుకు మద్దతు ఇస్తున్నారో ఈ పార్టీల నేతలు ప్రజలకు సమాధానం చెప్పాలని పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు డిమాండ్ చేశారు. నెల్లూరులోని సిపిఎం కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సిఎఎ విషయంలో వైసిపి, టిడిపి పార్లమెంట్‌లో బలపరిచాయన్నారు. ఎవరు అడ్డువచ్చినా యాక్టును అమలుచేస్తామని కలకత్తాలో అమిత్‌షా చెప్పారని గుర్తు చేశారు. సిఎఎ అమలు జరిగితే మైనార్టీల హక్కులు పూర్తిగా దెబ్బతింటాయన్నారు. దీనిని దేశంలోని అన్ని విపక్షాలు వ్యతిరేకించాయని, వైసిపి, టిడిపి మద్దతు తెలపడం దురదృష్టమన్నారు. ఇప్పటికైనా చట్టసవరణను వ్యతిరేకిస్తారో? లేదో? చెప్పాలని డిమాండ్ చేశారు. లేకుంటే మైనార్టీలకు ద్రోహం చేయడానికి ఆ పార్టీలు సిద్ధమయ్యాయని భావించాల్సి వస్తుందన్నారు. బిజెపి అధికారంలోకి వచ్చాక ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ నిధులు రద్దు చేసిందని తెలిపారు. దీనిపై కేంద్రాన్ని ప్రశ్నించకుండా సామాజిక బస్సు యాత్ర చేసే హక్కు వైసిపికి లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కులగణనను నిర్వహిస్తుందని, దీనికి ఎలాంటి చట్టబద్ధత లేదని ఇది కేవలం సర్వే మాత్రమేనని చెప్పారు. రానున్న ఎన్నికల్లో సిపిఎం స్వతంత్రంగా వ్యవహరిస్తుందని, బిజెపికి వ్యతిరేకంగా ఎవరైతే పనిచేస్తారో వారితో ముందుకుపోతామని తెలిపారు. నాగార్జున సాగర్ నీటి విషయంలో ఇప్పుడు ఘర్షణ వాతావరణ రావడం దురదృష్టకరమన్నారు. సమస్యను సామరస్యంగా పరిష్కారం చేసుకోవాలని సూచించారు. నెల్లూరు జిల్లా కార్యదర్శి మూలం రమేష్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు, ఎం.మోహన్‌రావు పాల్గొన్నారు.



కాప్ - 28 అధ్యక్షునిగా బాధ్యతలు స్వీకరిస్తున్న యుఎఇ మంత్రి జబర్

## నష్టపరిహార నిధికి ఆమోదం

- ప్రారంభమైన కాప్ 28 సదస్సు
- ధనిక దేశాల వాటాపై కొనసాగుతున్న సందిగ్ధం
- ఉదారంగా స్పందించాలని విజ్ఞప్తి

**దుబాయ్ :** వాతావరణ మార్పుల కారణంగా నష్టపోతున్న పేద దేశాలకు పరిహారం చెల్లించేందుకు నిధిని ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనకు ఎట్టకేలకు ఆమోదం లభించింది. ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో దుబాయ్‌లో గురువారం భాగస్వామ్య దేశాల సదస్సు (కాప్–28) ప్రారంభమైంది. ఈ సదస్సుకు 200 దేశాల నుండి ప్రతినిధులు హాజరయ్యారు. వీరు గాక పెద్ద సంఖ్యలో ఎన్‌జిఓలు, నిపుణులు పాల్గొంటున్నారు. రెండు వారాల పాటు జరగనున్న ఈ సదస్సు తొలిరోజే నష్టపరిహార నిధి ఏర్పాటుకు ఆమోదముద్ర పడటం గమనార్హం. అనంతరం ప్రతినిధుల నుద్దేశించి మాట్లాడిన కాప్ – 28 అధ్యక్షుడు, యుఎఇ మంత్రి సుల్తాన్ అహ్మద్ అల్ జబర్ 'ఈనాడు మనం చరిత్ర సృష్టించాం' అని ఆయన అన్నారు. ఈ నిధికి తమ దేశం వంద మిలియన్ల డాలర్లను అందజేస్తుందని ప్రకటించారు. జర్మనీ కూడా వంద మిలియన్ల డాలర్లను ఇస్తామని హామీ ఇచ్చింది. అయితే, ధనిక దేశాల వాటా గురించి ఇంకా సందిగ్ధత ఇంకా కొనసాగుతోంది. భూతాపం పెరగడానికి కారణమైన ధనిక దేశాలు, నష్టపరిహార నిధిలో కూడా తమ చారిత్రక వాటి ప్రకారం భాగస్వాములు కావాలని పేద దేశాలు మిగతా 2లో

## ఇసుక కేసు విచారణ 6కు వాయిదా

ప్రజాశక్తి-అమరావతి

గత ప్రభుత్వ ఉచిత ఇసుక విధానంలో అక్రమాలు జరిగాయంటూ సిఐడి నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ కోసం టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు విచారణ డిసెంబరు 6కు వాయిదా పడింది. సిఐడి తరపున అడ్వకేట్ జనరల్ ఎస్ శ్రీరామ్ గడువు కోరడంతో విచారణ వాయిదా వేస్తున్నట్లు జస్టిస్ టి మల్లికార్జునరావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. చంద్రబాబు తరపున వాదనలు గతంలోనే పూర్తయ్యాయి. తదుపరి ఉత్తర్వుల జారీ వరకు చంద్రబాబు విషయంలో తొందరపాటు చర్యలు తీసుకోవద్దని సిఐడిని హైకోర్టు గతంలోనే ఆదేశించింది.

## ఎస్ఐ అభ్యర్థుల పిటిషన్‌పై విచారణ వాయిదా

ప్రజాశక్తి-అమరావతి

ఎస్ఐ అభ్యర్థుల ఎత్తు కొలత వ్యవహారంపై దాఖలైన వ్యాజ్యాల విచారణ సోమవారానికి వాయిదా పడింది. ఈ మేరకు జస్టిస్ జి నరేందర్, జస్టిస్ న్యాపతి విజయ్‌తో కూడిన డివిజన్ బెంచ్ గురువారం ప్రకటించింది. 2018 నాటి నోటిఫికేషన్లో ఎత్తు పరీక్షలో అర్హత సాధించిన తాము 2023 నోటిఫికేషన్లో అనర్హులుగా ప్రకటించడాన్ని 24 మంది హైకోర్టులో సవాల్ చేశారు. ఆ పిటిషనర్లకు హైకోర్టు పర్యవేక్షణలో, హైకోర్టు ప్రాంగణంలో ఎత్తు కొలతలు కొలిపించాలని హైకోర్టు గతంలో నిర్ణయించింది. ఒక న్యాయమూర్తి గురువారం సెలవు పెట్టిన కారణంగా విచారణ సోమవారానికి వాయిదా పడింది.

**ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006**

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

**స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501**కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

## సెంటిమెంట్ కోసం ఉద్రిక్తతలు రెచ్చగొట్టడం తగదు

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తెలంగాణ ఎన్నికల్లో బిఆర్ఎస్‌కు లబ్ధిచేకూర్చేందుకు నాగార్జున సాగర్ వద్ద ఉద్రిక్తతలను సృష్టించడం ద్వారా సెంటిమెంట్‌ను రెచ్చగొట్టాలనుకోవడం జగన్‌మోహన్‌రెడ్డి, కెసిఆర్‌కు తగదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ విమర్శించారు. పట్టిసీమలో నీళ్ల అందుబాటులో వున్నా నీళ్లివ్వని జగన్.. కేవలం కెసిఆర్‌కు రాజకీయంగా లబ్ధి కలిగించేందుకు పోలీసులను పంపి ఉద్రిక్తతలను రెచ్చగొట్టడం సరైందికాదని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## ఐఆర్ఆర్ కేసు విచారణ 5కు వాయిదా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అమరావతి ఇన్నర్ రింగ్‌రోడ్డు కేసును విజయవాడ ఎసిబి కోర్టు డిసెంబరు 5కు వాయిదా వేసింది. టిడిపి అధినేత చంద్రబాబును కస్టడీకి కోరుతూ ఎసిబి కోర్టులో సిఐడి గతంలో దాఖలు చేసిన పిటి వారెంట్‌పై గురువారం విచారణ జరిగింది. చంద్రబాబు ముఖ్యమంత్రిగా వున్నప్పుడు రాజధాని ముసుగులో అమరావతిలో పెద్దయెత్తున అక్రమాలు చోటుచేసుకున్నాయని, ఇన్నర్ రింగ్‌రోడ్డులో తమకు, తమ అనుయులకు లబ్ధి చేకూర్చేలా మూడు పర్యాయాలు అలైన్‌మెంట్‌ను మార్చి అక్రమాలకు పాల్పడ్డారని సిఐడి తరఫున వాదించారు. విచారణ అనంతరం ఈ కేసును ఎసిబి కోర్టు డిసెంబరు 5కు వాయిదా వేసింది.

# 'చితి'కిపోతున్న చిన్న పరిశ్రమ!

- విశాఖ ఆటో నగర్‌లో మూడేళ్లలో 200 ఎంఎస్ఎంఇలు మూత
- అప్పారెల్ పార్కుల్లో 30 పరిశ్రమలకుగానూ పనిచేస్తున్నవి ఐదే
- రోడ్డున పడ్డ వేలాది మంది కార్మికులు



ఖాయిలా పడిన ఆటో నగర్‌లోని ఫ్లాష్ ఫోర్జ్ పరిశ్రమ

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న విధానాల కారణంగా చిన్న పరిశ్రమలు చితికిపోతున్నాయి. దేశ వ్యాప్తంగా ఎంఎస్ఎంఇల ఎగుమతులు ఏటికేడాది పడిపోతున్నాయి. మన రాష్ట్రంలో విశాఖపట్నంలో నెలకొన్న పరిస్థితులే దేశవ్యాప్తంగా ఎంఎస్ఎంఇల దుస్థితికి ఉదాహరణ. ఒకప్పుడు విశాఖకు ఖ్యాతి తెచ్చిన ఆటోనగర్ ఇప్పుడు వెలవెలలాడుతోంది. 30 ఏళ్ల క్రితం 1,200 ఎకరాల్లో 800 పరిశ్రమలతో స్థాపితమైన గాజువాక, పెదగంట్యాడ, ఆటో నగర్‌లో చిన్న పరిశ్రమలు క్రమంగా రెండు వేల యూనిట్ల వరకూ పెరిగాయి. తాజాగా వీటిలో 200 వరకూ మూతపడి సరుకు గొడౌన్లుగా మారిపోయాయి. దీంతో ఇండస్ట్రీపై ప్రత్యక్ష, పరోక్షంగా ఆధారపడిన సుమారు 40 వేల మంది కార్మికుల ఉపాధి ప్రశ్నార్థకంగా మారింది. ప్రతి నెలా రూ.800 కోట్లు టర్నోవర్ ఉండే ఆటో నగర్ ఇండస్ట్రీలో పరిశ్రమల మూతతో రూ.400 కోట్లకు పడిపోయింది. అప్పారెల్ (దుస్తుల తయారీ) పరిశ్రమలు 30కి 25 పూర్తిగా మూతపడడంతో దీంట్లో పనిచేసే మహిళా కార్మికులు ఆరు వేల మంది వేర్వేరు చోట్లకు తరలిపోయారు. ఆటో నగర్‌లోని డి, బి బ్లాక్‌లో 90 శాతం ఇలా మూతపడ్డాయి. దేశంలో చిన్న పరిశ్రమలకు ప్రోత్సాహం కరువవుతోంది. దేశంలో ఇందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే కారణం.

**శరాఘాతంగా విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ నిర్ణయం**

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీసుకున్న విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ నిర్ణయం శరాఘాతంగా మారింది. ఐరన్ ఓర్ ప్లాంట్‌కు అందకపోవడం, మూడు బ్లాస్ట్ ఫర్నేస్‌ల్లో ఒకదాన్ని పూర్తిగా, మరోదాన్ని పాక్షికంగా మూసేయడంతో ఆటో నగర్ ఇండస్ట్రీలో పరిశ్రమలకూ పనిలేకుండా పోయింది. వేల సంఖ్యలోకార్మికులకు ఉపాధి అనిశ్చితిలో పడింది. విశాఖ ఆర్థిక వ్యవస్థకు 30 శాతం ఆధారమైన స్టీల్‌ప్లాంట్‌పై నీలినీడలతో ఎంఎస్ఎంఇ పరికరాల సరఫరాతో జరగాల్సిన ఉత్పత్తుల ఎగుమతులు 15 శాతం పడిపోయాయని పారిశ్రామిక వర్గాలు చెబుతున్నాయి.

### దెబ్బమీద దెబ్బ



ఒకవైపు స్టీల్‌ప్లాంట్ ప్రవంవేటీకరణ నిర్ణయం, మరోవైపు ఆర్థిక మాంద్య పరిస్థితులు, గతంలో నోట్ల రద్దు, జిఎస్‌టి భారం, కోవిడ్-19 పరిస్థితుల దుష్ప్రభావాలు ఆటో నగర్ ఇండస్ట్రీస్‌పై పడ్డాయి. ప్రభుత్వాల సాయం లేకపోవడంతో కోలుకోలేని దెబ్బ తగిలింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఏటా రావాల్సిన రూ.15 కోట్ల మేర ఇన్సెంటివ్స్ మూడేళ్లుగా ఆగిపోయాయి.

**-ఎ.కృష్ణబాలాజీ, ఆలిండియా స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ ఎపి కో-ఆర్డినేటర్ (నేషనల్ వర్కింగ్ కమిటీ మెంబర్, లఘు ఉద్యోగ్ భారతి)**

### నెలలో 15 రోజులే పని దొరుకుతోంది



నెలలో 15 రోజులు మాత్రమే ఆటో నగర్‌లో పని లభిస్తోంది. నడుస్తున్న పరిశ్రమల చుట్టూ పనికోసం తిరగాల్సి వస్తోంది. పరిశ్రమలన్నీ వరస కట్టి మూతపడుతుండడంతో పనుల కోసం నాలాంటి కార్మికులంతా వెతుక్కోవాల్సి వస్తోంది. పాలకులు పట్టించుకోవడం లేదు.

**-ఎం.అప్పలనాయుడు, ఎలక్ట్రికల్ పేనల్ బోర్డు స్కిల్ వర్కర్, ఆటో నగర్**

### సిక్ ఇండస్ట్రీస్ జాబితా వచ్చింది



ఆటో నగర్ ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో సుమారు 35 పరిశ్రమల వరకూ సిక్ అయి మూతపడ్డాయన్న వివరాలు మా దృష్టికి వచ్చాయి. టెక్నాలజీకి తగ్గట్టుగా అప్‌గ్రేడ్ కావాలి. అవసరాలు, డిమాండ్‌కు తగ్గట్టుగా ఉత్పత్తులను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలి. నిలదొక్కుకోవడానికి ప్యాకేజీలు ఇచ్చినా ఏం లాభమూ ఉండదు.

**-సిహెచ్.గణపతి, జిల్లా పరిశ్రమల జనరల్ మేనేజర్**

## 2024లో 41 రోజుల సెలవులు

- 24 రోజుల సాధారణ, 17 ఐచ్ఛిక

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

2024 సంవత్సరానికి సంబంధించిన సెలవులను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డి సెలవులకు సంబంధించి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. పండగలు, జాతీయ సెలవులను కలిపి ప్రభుత్వ కార్యాలయాలకు మొత్తం 24 రోజులను సాధారణ సెలవులు, మరో 17 రోజులు ఐచ్ఛిక సెలవులను ప్రకటించింది. జనవరి 15, 16ను సాధారణ సెలవుల జాబితాలో చేర్చింది. భోగి, అంబేద్కర్ జయంతి ఆదివారం, దుర్గాష్టమి రెండో శనివారం వచ్చాయని తెలిపారు. ఏప్రిల్ 9న ఉగాది సెలవుగా ప్రకటించారు.

**సాధారణ సెలవులు**

| | | | |
|---|---|---|---|
| 1 | భోగి | 14.01.24 | ఆదివారం |
| 2 | మకర సంక్రాంతి | 15.01.24 | సోమవారం |
| 3 | కనుమ | 16.01.24 | మంగళవారం |
| 4 | రిపబ్లిక్ డే | 26.01.24 | శుక్రవారం |
| 5 | మహాశివరాత్రి | 08.03.24 | శుక్రవారం |
| 6 | హోళి | 25.03.24 | సోమవారం |
| 7 | గుడ్‌ఫ్రైడే | 29.03.24 | శుక్రవారం |
| 8 | అన్యువల్ క్లోజింగ్ డే | 01.04.24 | సోమవారం |
| 9 | ఉగాది | 09.04.24 | మంగళవారం |
| 10 | ఈద్ ఉల్ ఫితర్( రంజాన్) | 11.04.24 | గురువారం |
| 11 | అంబేద్కర్ జయంతి | 14.04.24 | ఆదివారం |
| 12 | శ్రీరామ నవమి | 17.04.24 | బుధవారం |
| 13 | మేడే | 01.05.24 | బుధవారం |
| 14 | బక్రీద్ | 17.06.24 | సోమవారం |
| 15 | మొహర్రం | 17.07.24 | బుధవారం |
| 16 | స్వాతంత్ర్య దినోత్సవం | 15.08.24 | గురువారం |
| 17 | శ్రీకృష్ణాష్టమి | 26.08.24 | సోమవారం |
| 18 | వినాయక చవితి | 07.09.24 | శనివారం |
| 19 | మిలాడినబి | 16.09.24 | సోమవారం |
| 20 | మహాత్మాగాంధీ జయంతి | 02.10.24 | బుధవారం |
| 21 | దుర్గాష్టమి | 31.10.24 | శుక్రవారం |
| 22 | విజయదశమి | 12.10.24 | శనివారం |
| 23 | దీపావళి | 31.10.24 | గురువారం |
| 24 | క్రిస్మస్ | 25.12.24 | బుధవారం |

**ఐచ్ఛిక సెలవులు**

| | | | |
|---|---|---|---|
| 1 | నూతన సంవత్సరం | 01.01.24 | సోమవారం |
| 2 | హజరత్ అలీ జయంతి | 25.01.24 | గురువారం |
| 3 | షబ్ ఈ మిరజ్ | 07.02.24 | బుధవారం |
| 4 | షహదత్ హజరత్ అలీ | 01.04.24 | సోమవారం |
| 5 | జమతల్ వేద | 05.04.24 | శుక్రవారం |
| 6 | బసవజయంతి | 10.05.24 | శుక్రవారం |
| 7 | బుద్ధపూర్ణిమ | 23.05.24 | గురువారం |
| 8 | ఈద్ గా గదీర్ | 25.06.24 | మంగళవారం |
| 9 | మొహర్రం | 16.07.24 | మంగళవారం |
| 10 | పార్శీ సంవత్సరాది | 15.08.24 | గురువారం |
| 11 | వరలక్ష్మి వ్రతం | 16.08.24 | శుక్రవారం |
| 12 | మహాలయ అమావాస్య | 02.10.24 | బుధవారం |
| 13 | యాజ్ దమ్ షరీఫ్ | 15.10.24 | మంగళవారం |
| 14 | కార్తీక పౌర్ణమి, గురునానక్ జయంతి | 15.11.24 | శుక్రవారం |
| 15 | హజరత్ సయ్యద్ మొహ్మద్ | 16.11.24 | శనివారం |
| 16 | క్రిస్మస్ ఈవ్ | 24.12.24 | మంగళవారం |
| 17 | బాక్సింగ్ డే | 26.12.24 | గురువారం |

## ఉద్యోగుల బకాయిలు చెల్లించాలి

### ఎపిజెఎసి అమరావతి డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, పోలీసులకు చెల్లించాల్సిన డిఎ, సరెండర్ లీవ్స్, జిపిఎఫ్, ఎపిజిఎల్ఐ రిటైర్మెంట్ బకాయిలను ప్రభుత్వం తక్షణమే చెల్లించాలని ఎపిజెఎసి అమరావతి డిమాండ్ చేసింది. జెఎసి కార్యదర్శివర్గ సమావేశం విజయవాడలోని రెవెన్యూ భవన్‌లో గురువారం జరిగింది. ఈ సందర్భంగా జెఎసి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, సెక్రటరీ జనరల్ దామోదర్ మాట్లాడుతూ.. ఉద్యోగులకు చెల్లించాల్సిన వేల కోట్ల బకాయిలను 2022 ఏప్రిల్ నాటికి చెల్లిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని తెలిపారు. కనీస ప్రభుత్వం నుంచి సమాధానం చెప్పే పరిస్థితి కూడా లేకపోవడం దారుణమని పేర్కొన్నారు. మంత్రివర్గ ఉపసంఘం చర్చల్లో లిఖిత పూర్వకంగా ఇచ్చిన మాట ప్రకారం బకాయిలను తక్షణమే చెల్లించాలని కోరారు. ఉద్యోగుల ఆరోగ్య పథకానికి నెలవారీ చందా చెల్లిస్తున్నప్పటికీ సరైన వైద్యం పూర్తిస్థాయిలో అందడం లేదని అన్నారు. మృతిచెందిన జిల్లా పరిషత్ ఉపాధ్యాయుల కుటుంబ సభ్యులకు అర్హతను బట్టి కారుణ్య నియామకాలు చేపడతామని ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు.

## ఇంటర్ పరీక్ష ఫీజు గడువు పొడిగింపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జూనియర్ కళాశాలల విద్యార్థుల పబ్లిక్ పరీక్ష-2024 ఫీజు చెల్లింపు గడువు తేదీని ఇంటర్మీడియట్ బోర్డు పొడిగించింది. నవంబరు 30వ తేదీ చెల్లించాల్సిన గడువును డిసెంబరు 5 వరకు పొడిగిస్తున్నట్లు బోర్డు కార్యదర్శి సౌరబ్ గౌర్ గురువారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. రూ.1000 అపరాధ రుసుంతో ఈ నెల 15 వరకు చెల్లించవచ్చునని వెల్లడించారు. మార్చిలో జరిగే పబ్లిక్ పరీక్షకు హాజరయ్యే ప్రథమ, ద్వితీయ సంవత్సరం జనరల్, వొకేషనల్ రెగ్యులర్, ప్రైవేట్ విద్యార్థులు ఈ ఫీజులు చెల్లించాలని తెలిపారు.

**అనంతపురం-తాడిపత్రి రోడ్డుకు ఉన్నత విద్య నిధులు**

అనంతపురం-తాడిపత్రి రెండు లైన్ల రోడ్డు నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత విద్య నిధులు రూ.4.40 కోట్లు కేటాయించింది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను ఉన్నత విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి జె శ్యామలరావు విడుదల చేశారు. బుక్కరాయసముద్రం మండలం జంతలూరులో ఉన్న సెంట్రల్ యూనివర్సిటీ కోసం ఈ నిధులు కేటాయిస్తున్నట్లు పేర్కొన్నారు.

# నకిలీ పిజి సీట్ల కుంభకోణంలో దోషులపై చర్యలేవీ?

- లేఖ రాసి చేతులు దులుపుకున్న హెల్త్ యూనివర్సిటీ
- మెడికల్ అడ్మిషన్లలో అక్రమాలపై చర్యలు నిల్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నకిలీ పర్మిషన్ లెటర్లతో పిజి అడ్మిషన్లు నిర్వహించి వైద్య విద్యార్థుల భవిష్యత్‌తో చెలగాటమాడిన వైద్య కళాశాలలపై చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. రాష్ట్రంలో 2023-24 విద్యా సంవత్సరానికి మెడికల్ పిజి సీట్ల కేటాయింపులో మూడు మెడికల్ కాలేజీలు అక్రమాలకు పాల్పడ్డట్లు అధికారులు తేల్చారు. వైఎస్ఆర్ హెల్త్ యూనివర్సిటీ కూడా నేషనల్ మెడికల్ కమిషన్ వెబ్‌సైట్‌ను సరిచూసుకోకుండా అడ్మిషన్లు నిర్వహించి 152 సీట్లను భర్తీ చేసింది. విచారణలో రాజమండ్రి జిఎస్ఎల్ వైద్య కళాశాల, నంద్యాల శాంతిరామ్ వైద్యకళాశాల, విజయనగరంలో మహారాజ వైద్యకళాశాలలు అనుమతి లేకుండా పిజి కౌన్సెలింగ్ నిర్వహించినట్లు తేలింది. దీంతో విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకమైంది. వాటిపై చర్యలు తీసుకోవడంలో వైద్య విశ్వవిద్యాలయం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. కోట్లు కొల్లగొట్టినా చర్యలు తీసుకోవడంలో మీనమేషాలు లెక్కిస్తోంది. ఈ వ్యవహారంలో సుమారు రూ.300 కోట్లు చేతులు మారినట్లు అప్పట్లో వార్తలు కూడా వచ్చాయి.

**అక్రమానికి పాల్పడింది ఇలా..**

తమ కళాశాలలో అన్ని అనుమతులూ ఉన్నాయని హెల్త్ యూనివర్సిటీ ఇచ్చినట్లు ఒక నకిలీ లేఖను తయారుచేసి ఆయా కళాశాలలు జాతీయ వైద్య కమిషన్‌కు లేఖ రాశాయి.




దాని ఆధారంగా అనుమతి లేఖ తెచ్చుకున్నారు. వాటిని యూనివర్సిటీకి సమర్పించి కౌన్సెలింగ్ అనుమతి పొందారు. అయితే అనుమతి లేఖను తనిఖీ చేయాల్సిన యూనివర్సిటీ అధికారులు అదేమీ చూడకుండా నేరుగా కౌన్సెలింగ్ నిర్వహించేశారు. దీని ఆధారంగా నంద్యాల శాంతిరామ్ వైద్య కళాశాలలో 21 పిజి సీట్లను 71కి పెంచారు. రాజమండ్రిలో జిఎస్ఎల్ వైద్య కళాశాలలో 50 సీట్లను 140 సీట్లకు, విజయనగరం మహారాజా వైద్య కళాశాలలో అదనంగా 12 పిజి సీట్లకు కౌన్సెలింగ్ నిర్వహించి సీట్లను భర్తీ చేశారు. దీనికోసం ఒక్కో విద్యార్థి నుంచి రూ.1.50 కోట్ల నుంచి రూ.3.50 కోట్ల వరకూ వసూలు చేశారు. అనంతరం ఎన్ఎంసి వెబ్‌సైట్లో పిజి సీట్ల పెంపు విషయాన్ని పొందుపరచకపోవడాన్ని గుర్తించిన హెల్త్ యూనివర్సిటీ అనుమతి లేఖను పరిశీలించింది.

వారు సమర్పించిన లేఖలు ఎంఎన్‌సికి పంపించి వాటిని నకిలీవని ధ్రువీకరించుకుంది. జరిగిన తప్పిదాన్ని గుర్తించిన అధికారులు మొదటి విడత కౌన్సెలింగ్‌ను రద్దుచేశారు. అదే సమయంలో తమ కళాశాలల్లో అన్ని సదుపాయాలూ ఉన్నాయని తప్పుడు నివేదిక ఇచ్చిన వైద్య కళాశాలలపై పోలీసులకు ఎటువంటి ఫిర్యాదులూ ఇవ్వలేదు. ప్రభుత్వమూ చర్యలు తీసుకోలేదు.

**నకిలీ పత్రాలపై లేఖ రాశాం వైస్ ఛాన్సలర్ బాబ్జి**

పిజి మెడికల్ కోంభకోణంపై వైఎస్ఆర్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ బాబ్జిని వివరణ కోరగా.. నకిలీ అనుమతి పత్రాలపై ఎన్ఎంసి, రాష్ట్ర ప్రభుత్వానికి లేఖలు రాశామని తెలిపారు. ఎన్ఎంసి ఢిల్లీ పోలీసులకు ఫిర్యాదు చేసిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేస్తే వాటికి అనుగుణంగా చర్యలు తీసుకుంటామని బాబ్జి పేర్కొన్నారు.

## పోరాటాలతో స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుందాం

ప్రజాశక్తి-ఉక్కునగరం (విశాఖ)

పోరాటాలతోనే విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోగలమని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. విశాఖ ఉక్కు ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే దీక్షలు గురువారం నాటికి 1022 నాటికి చేరుకున్నాయి. ఈ దీక్షలో ప్లాంట్ బ్లాస్ట్ ఫర్నేస్ విభాగ కార్మికులు కూర్చున్నారు. ఈ దీక్షలనుద్దేశించి పోరాట కమిటీ చైర్మన్ డి ఆదినారాయణ, నాయకులు జె రామకృష్ణ, కారు రమణ, వరసాల శ్రీనివాసరావు మాట్లాడారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొమ్మిదిన్నరేళ్లలో అన్ని రంగాల్లో పూర్తిగా విఫలమైందన్నారు. దేశంలోని ప్రభుత్వ రంగాన్ని ఏకపక్షంగా కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడం దుర్మార్గమన్నారు. దీన్ని పోరాట కమిటీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని పేర్కొన్నారు. ప్రయివేటీకరణ విధానాలు, వైజాగ్ స్టీల్ ప్లాంట్ అమ్మకం ప్రయత్నాలను మానుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం స్టీల్ ప్లాంట్ సామర్థ్యానికి తగ్గ ఉత్పత్తిని తీయనీయకుండా బిఎఫ్-3ని ఆపేయడమే కాకుండా, రా మెటీరియల్ ఇవ్వకుండా అనేక ఇబ్బందులను సృష్టించి, నష్టాల సాకుతో అమ్మేయడానికి కుట్ర పన్నుతోందని తెలిపారు. రానున్న ఎన్నికల్లో కేంద్రానికి బుద్ధి చెప్పాలని కోరారు. శిబిరంలో గుమ్మడి నరేంద్ర, బి శ్రీనివాస్ బిఎఫ్ విభాగం నాయకులు వి రామకోటేశ్వరరావు, కె బాబా, కారు రమణ, కె మధుసూదన్, వేణు, సి హెచ్ సాయిరాం, రవికిరణ్, కొణతాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ఎపిఇఆర్‌సికి ఎఆర్ఆర్ సమర్పణ

- వివరాలు వెల్లడించని అధికారులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఎపిఇఆర్‌సి)కి 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆదాయ వార్షిక నివేదిక (ఎఆర్ఆర్)ను మూడు విద్యుత్ పంపిణీ సంస్థలు (ఎపిఇపిడిసిఎల్, ఎపిఎస్‌పిడిసిఎల్, ఎపిసిపిడిసిఎల్) సమర్పించాయి. బహుళ వార్షిక కాలవ్యవధి 2024-2029 నియంత్రణ కాలానికి సంబంధించిన నెట్‌వర్క్ ఆదాయ అవసరాల నివేదికలను డిస్కంలతోపాటు ట్రాన్స్‌కో కూడా ఇఆర్‌సికి సమర్పించాయి. ప్రతియేటా ఇఆర్‌సికి సమర్పించిన నివేదికల వివరాలను క్లుప్తంగా బయటకు వెల్లడించడం ఆనవాయితీగా వస్తుంది. ఈసారి ఇందుకు భిన్నంగా ఇఆర్‌సి, డిస్కంలు వ్యవహరించి వివరాలను బయటకు చెప్పలేదు. గుంటూరులోని ఓ ప్రైవేట్ హోటల్‌లో ఎపిఇఆర్‌సి ఛైర్మన్ జస్టిస్ సివి నాగార్జునరెడ్డి, సభ్యులు ఠాకూర్ రామసింగ్‌కు ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ సమక్షంలో అధికారులు గురువారం సమర్పించారు. జెన్‌కో ఎమ్‌డి, ట్రాన్స్‌కో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు, ఎపిఇపిడిసిఎల్, సిపిడిసిఎల్, ఎస్‌పిడిసిఎల్ సిఎమ్‌డిలు ఐ పృథ్వీతేజ్, జె పద్మ జనార్ధనరెడ్డి, కె సంతోషరావు ఎఆర్ఆర్ నివేదికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో గ్రిడ్ డైరెక్టర్ ఎవికె భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## విశాఖను ఫైనాన్షియల్ హబ్‌గా మార్చండి

- ముఖ్యమంత్రికి మంత్రి ధర్మాన లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉత్తరాంధ్ర జిల్లాల అభివృద్ధికి విశాఖపట్నాన్ని ఫైనాన్షియల్ హబ్‌గా మార్చాలని రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి గురువారం ఆయన లేఖ రాశారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వ శాఖలకు చెందిన క్యాంపు కార్యాలయాలను విశాఖపట్నంలో ఏర్పాటు చేసేందుకు ఉత్తర్వులు ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. విశాఖ పరిసర ప్రాంతాల్లో ఏర్పాటైన కంపెనీల ద్వారా ప్రభుత్వానికి కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ అథారిటీకి దాదాపు రూ.వెయ్యి కోట్లు రెవెన్యూ సమకూరుతోందని తెలిపారు. ఈ నేపథ్యంలో విశాఖను ఫైనాన్షియల్ హబ్‌గా మార్చి మరింత అభివృద్ధి చేయాలని కోరారు.

## నష్టపరిహార నిధికి ఆమోదం

(మొదటిపేజీ తరువాయి)

కోరుతున్నాయి. దీనిని ధనిక దేశాలు తిరస్కరిస్తుండటంతో ఏళ్ల తరబడి ప్రతిష్టంభన కొనసాగుతోంది. గత ఏడాది ఈజిప్టులో జరిగిన కాప్27లో వాటాల విషయం తేల్చకుండానే నష్టపరిహారం కోసం నిధిని ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. నవంబర్ నెల ప్రారంభంలో ఆ ప్రతిపాదనలో కొన్ని సవరణలు చేశారు. ఈ సవరణల ప్రకారం ధనిక దేశాలతో పాటు ఇతర దేశాలు, ప్రైవేటు పార్టీలు కూడా నిధికి విరాళాలు ఇయ్యవచ్చు. ఈ మేరకు రూపొందించిన తీర్మానాన్ని గురువారం సమావేశం ప్రారంభమైన కొద్ది సేపటికే ప్రవేశట్టగా, ప్రతినిధులు ఆమోదముద్ర వేశారు. ధనిక దేశాలు ఈ నిధికి ఉదారంగా సహకరించాలని కోరారు. 'ఉదారంగా విరాళాలు ఇవ్వడానికి ధనిక దేశాలకు ఆహ్వానం పలుకుతున్నాము' అని తీర్మాన ముసాయిదాలో పేర్కొన్నారు. సంవత్సరానికి సుమారుగా 400 బిలియన్ల అమెరికన్ డాలర్లు ఈ నిధికి అవసరమౌతాయని అభివృద్ధి చెందుతున్న దేశాలు అంచనా వేశాయి.

**ఏకాభిప్రాయం కోసం చూస్తున్నాం :మోడీ**

వాతావరణ మార్పులపై కార్యాచరణ, సుస్థిర అభివృద్ధిపై తీసుకోవాల్సిన చర్యలపై ఏకాభిప్రాయం కోసం ఎదురుచూస్తున్నట్లు ప్రధాన మంత్రి నరేంద్రమోడీ చెప్పారు. కాప్ 28 సదస్సులో పాల్గొనేందుకు గురువారం ఆయన దుబాయ్‌కు బయలుదేరారు. శుక్రవారం ఆయన ప్రతినిధులనుద్దేశించి ప్రసంగించనున్నారు. దుబాయ్‌కు బయలుదేరే ముందు ఆయన మాట్లాడుతూ భారత్ ఏర్పాటు చేసిన గ్లోబల్ సౌత్ సమ్మిట్‌లో సమానత్వం, వాతావరణ న్యాయం, ఉమ్మడి బాధ్యతలు వంటి సూత్రాల ప్రాతిపదికన కార్యాచరణను రూపొందించాల్సిన అవసరం గురించి చర్చించినట్లు చెప్పారు. వాతావరణ మార్పులను ఎదుర్కొనేందుకు వర్ధమాన దేశాలు చేసే కృషికి తగిన తోడ్పాటు అందడం ముఖ్యమని, ఆర్థిక వనరులను కల్పించడం, సాంకేతికత బదిలీ వంటి అంశాల్లో చేయూతనివ్వాల్సి వుందని తెలిపారు.

## బిజెపికి ఎదురుగాలి!

(మొదటిపేజీ తరువాయి)

టీవీ-మ్యాట్రిజ్ అంచనా వేసింది. కాంగ్రెస్‌కు 49-59 సీట్లు వస్తాయని, బిఆర్ఎస్‌కు 48-58 సీట్లు వస్తాయని టీవీ9 భరతవర్ష్ పోల్‌స్ట్రాట్ పేర్కొంది.

యుపి తరువాత హిందీ రాష్ట్రాల్లో కీలకమైనదిగా భావించే మధ్య ప్రదేశ్‌లో హోరాహోరీ పోరులో కాంగ్రెస్‌కే మొగ్గు ఉండొచ్చని కొన్ని పోల్స్ చూపిస్తున్నాయి. మధ్యప్రదేశ్‌లో బిజెపికి 100-123 సీట్లు, కాంగ్రెస్‌కు 102-125 సీట్లు వస్తాయని జన్ కీ బాత్ ఎగ్జిట్ పోల్ అంచనా వేయగా, రిపబ్లిక్ టీవీ-మ్యాట్రిజ్ బిజెపికి 118-130 సీట్లు, కాంగ్రెస్‌కు 97-107 సీట్లు వస్తాయని అంచనా వేసింది. బిజెపికి 106-116, కాంగ్రెస్‌కు 111-121 వస్తాయని టివి9 భరత్‌వర్ష్ పోల్‌స్ట్రాట్ పేర్కొంది. టుడేస్ చాణక్య మధ్యప్రదేశ్‌లో బిజెపికి 151 (ప్లస్, మైనస్ 12 సీట్లు), కాంగ్రెస్‌కు 74 (ప్లస్, మైనస్ 12 సీట్లు) వస్తాయని అంచనా వేసింది. జీస్ట్- టిఐఎఫ్ - ఎన్ఎఐ అంచనా ప్రకారం మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్‌కి 2018 లాంటి పరిస్థితి ఉందని, బిజెపికి 102-119 వస్తాయని, కాంగ్రెస్‌కు 107-124 సీట్లు వస్తాయి.

రాజస్థాన్‌లో అశోక్ గెహ్లాట్ నేతృత్వంలోని కాంగ్రెస్ స్వల్ప మెజారిటీతో బిజెపి కన్నా ముందంజలో వుంటుందని యాక్సిస్ మై ఇండియా - ఇండియా టుడే అంచనా వేసింది. కాంగ్రెస్‌కు 86-106 సీట్లు, బిజెపికి 80-100 సీట్లు, ఇతరులకు 9-18 సీట్లు వస్తాయని అంచనా వేసింది. జన్ కీ బాత్ పోల్‌స్టర్లు బిజెపికి 100-122, కాంగ్రెస్‌కు 62-85, టివి 9 - భరత్‌వర్ష్ పోల్‌స్ట్రాట్ బిజెపికి 100-110, కాంగ్రెస్‌కు 90-100 వస్తాయని అంచనా వేశాయి. టైమ్స్ నౌ


చింతమడక పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కును వినియోగించుకున్న సిఎం కెసిఆర్


కొడంగల్‌లో ఓటు హక్కును వినియోగించుకున్న రేవంత్‌రెడ్డి

ఇటిజి పోల్ బిజెపికి 108-128 సీట్లు, కాంగ్రెస్‌కు 56-72 సీట్లు వస్తాయని అంచనా వేసింది. రాజస్థాన్‌లో ప్రతి ఐదేళ్లకు అధికారంలో ఉన్న పార్టీని ఓడించే సంప్రదాయం కొనసాగుతుందని, బిజెపికి 110, కాంగ్రెస్‌కు 70 సీట్లు వస్తాయని జీస్ట్-టిఐఎఫ్-ఎన్ఎఐ అంచనా వేసింది.

ఇంతకుముందు వెలువడిన ఒపీనియన్ పోల్స్‌లోనూ రాష్ట్ర ప్రజలు తమ చారిత్రక సాంప్రదాయాన్ని అనుసరించి, ప్రస్తుతం అధికారంలో వున్న కాంగ్రెస్ పార్టీని పక్కనబెట్టి బిజెపిని గెలిపిస్తారని పేర్కొన్నాయి.

ఛత్తీస్‌గఢ్‌లో, ఎబిపి న్యూస్-సి ఓటర్ బిజెపికి 36-48, కాంగ్రెస్‌కు 41-53 సీట్లు వస్తాయని అంచనా వేయగా, ఇండియా టుడే-యాక్సిస్ మై ఇండియా బిజెపికి 36-46 సీట్లు, కాంగ్రెస్‌కు 40-50 సీట్లు వస్తాయని అంచనా వేసింది. ఇండియా టీవీ-సిఎన్ఎక్స్ బిజెపికి 30-40 సీట్లు, కాంగ్రెస్‌కు 46-56 సీట్లు వస్తాయని అంచనా వేసింది. జన్‌కీ బాత్ ప్రకారం బిజెపికి 34-45, కాంగ్రెస్‌కు 42-53 వస్తాయి. బిజెపికి 33 సీట్లు (ప్లస్-మైనస్ 8 సీట్లు) వస్తాయని, కాంగ్రెస్ స్పష్టమైన మెజారిటీ 57 సీట్లు (ప్లస్-మైనస్ 8) సాధిస్తుందని టుడేస్ చాణక్య అంచనా వేసింది.

మిజోరాంలో, ముఖ్యమంత్రి జొరమ్‌తంగా నేతృత్వంలోని మిజో నేషనల్ ఫ్రంట్ (ఎంఎన్ఎఫ్), మరో ప్రాంతీయ పార్టీ అయిన జొరామ్ నేషనలిస్ట్ పార్టీ (జెడ్ఎన్ఎఫ్) నేతృత్వంలోని జొరామ్ పీపుల్స్ మూవ్‌మెంట్ (జెడ్‌పిఎం)కి మధ్య గట్టి పోటీ వుందని వెల్లడైంది. ఒకవేళ హంగ్ అసెంబ్లీ ఏర్పడితే ప్రభుత్వ ఏర్పాటులో కాంగ్రెస్ పాత్ర వుంటుందని భావిస్తున్నారు. బిజెపి ఎలాంటి ప్రభావాన్ని చూపకపోవచ్చు. మిజోరంలో, ఇండియా టివి - సిఎన్ఎక్స్ ప్రకారం ఎంఎన్ఎఫ్‌కు 14-18, జెడ్‌పిఎంకు 12-16, కాంగ్రెస్‌కి 8-10, బిజెపికి 0-2 వస్తాయని పేర్కొంది.

ఎబిపి న్యూస్ - సి ఓటర్ ప్రకారం ఎంఎన్ఎఫ్‌కు 15-21, జెడ్‌పిఎంకు 12-18, కాంగ్రెస్‌కు 2-8, పి మార్క్ ప్రకారం ఎంఎన్ఎఫ్‌కు 14-20, జెడ్‌పిఎంకు 9-15, కాంగ్రెస్‌కు 7-13 వస్తాయి.

ఇండియా టుడే-యాక్సిస్ మై ఇండియా ప్రకారం ఎంఎన్‌కు 3-7, జెడ్‌పిఎంకు 28-35, కాంగ్రెస్‌కు 2-4 సీట్లు వస్తాయి. ఎంఎన్ఎఫ్‌కు 10-14 సీట్లు, జెడ్‌పిఎంకు 15-25 సీట్లు, కాంగ్రెస్‌కు 5-9, బిజెపికి 0-2 సీట్లు వస్తాయని జన్ కీ బాత్ తెలిపింది.

ప్రస్తుతం ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్‌లో కాంగ్రెస్ ప్రభుత్వాలు ఉండగా, మధ్యప్రదేశ్‌లో బిజెపి ప్రభుత్వం వుంది. తెలంగాణాలో భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) అధికారంలో వుండగా, మిజోరాంలో ప్రాంతీయ మిజో నేషనల్ ఫ్రంట్ (ఎంఎన్ఎఫ్) ప్రభుత్వం వుంది.

## తిరుమలలో చంద్రబాబు

- నేడు శ్రీవారి దర్శనం

ప్రజాశక్తి - తిరుమల

తిరుమల శ్రీవారి దర్శనార్థం టిటిడి అధినేత నారా చంద్రబాబు నాయుడు గురువారం సాయంత్రం తిరుమల చేరుకున్నారు. గాయత్రి నిలయంలో కుటుంబసభ్యులతో కలిసి రాత్రి బస చేశారు. శుక్రవారం ఉదయం వరాహస్వామిని, తర్వాత శ్రీవారిని దర్శించుకోనున్నారు. అనంతరం రేణిగుంట నుంచి విజయవాడకు చేరుకోనున్నారు. డిసెంబర్ రెండో వారంలో తన నియోజకవర్గమైన కుప్పంలో చంద్రబాబు పర్యటించనున్నారు.


సభలో మాట్లాడుతున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

## అర్హులందరికి సంక్షేమ పథకాలు అందాలి

- గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి

అర్హులందరూ కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుకోవాలని రాష్ట్ర గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ అన్నారు. కృష్ణా జిల్లా మచిలీపట్నంలో నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో గవర్నర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలను పేదలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తొలుత కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రచారం చేసేందుకు ఏర్పాటు చేసిన డిజిటల్ ప్రచార వాహనాన్ని జెండా ఊపి ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయుష్మాన్ భారత్, ప్రధాన మంత్రి ఉజ్వల యోజన, పిఎం కిసాన్ సమ్మాన్ నిధి, పిఎం ప్రణాం పథకాల అమలుపై అవగాహన కల్పించేందుకు సంబంధిత శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పథకాలను వివరిస్తూ బుర్రకథను కళాజాతా బృందం ప్రదర్శించింది. బాలాజీ విద్యాలయం, లిటిల్ ఫ్లవర్ విద్యా సంస్థల చిన్నారులు స్వాగత గీతానికి, పర్యావరణహిత సేద్యం చేయడం ద్వారా భూమాతను పరిరక్షించుకోవాలనే సందేశాన్ని ఇస్తూ సాగిన గేయాలకు కూచిపూడి నృత్య ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ ఎం.వి.ఎస్ నాగిరెడ్డి, కలెక్టర్ పి.రాజాబాబు, తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు అండగా ఉంటాం

- 'వికసిత్ భారత్ సంకల్పయాత్ర'లో ప్రధాని మోడీ


సత్యసాయి జిల్లా గోరంట్లలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న నిర్మల సీతారామన్

ప్రజాశక్తి-శింగరాయకొండ (ప్రకాశం జిల్లా)/ గోరంట్ల (సత్యసాయి జిల్లా)

వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేసేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని రూపొందించుకొని రైతులకు అండగా నిలుస్తున్నామని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అన్నారు. వికసిత్ భారత్ సంకల్పయాత్ర గురువారం ప్రకాశం జిల్లా శింగరాయకొండ మండలం పాకల గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్లో నిర్వహించారు. కనిగిరి మండలం చాకిరాల పంచాయతీ పరిధిలోని భూతంవారి పల్లికి చెందిన కె.వెంకటరమణమ్మ.. మోడీతో వర్చువల్‌గా మాట్లాడారు. ప్రభుత్వ పథకాల ద్వారా తనకు కలిగే ప్రయోజనాన్ని ఆమె వివరించారు. వ్యవసాయ రంగంపై తమ గ్రామం మొత్తం ఆధారపడి ఉంటుందని చెప్పారు. వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకునే విధంగా డ్రోన్ ఉపయోగించడంపై గుంటూరు ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో 12 రోజులపాటు శిక్షణ పొందానని, తమ గ్రామంలో వ్యవసాయ పనులకు డ్రోన్ వాడడం మొదలుపెట్టామన్నారు. ప్రధానమంత్రి మోడీ మాట్లాడుతూ వికసిత్ భారత సంకల్పయాత్ర పేరుతో కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజలకు వివరించాలన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అనంతరం ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులరెడ్డి, కలెక్టర్ ఎఎస్ దినేష్‌కుమార్, రాష్ట్ర నోడల్ ఆఫీసర్ రామచంద్రుడు మాట్లాడారు.

**ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి**

- **కేంద్రమంత్రి నిర్మల సీతారామన్**

సత్యసాయి జిల్లా గోరంట్ల పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి లబ్ధిదారుడు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రధానమంత్రి ఉజ్వల యోజన కింద భారతదేశమంతటా 10 కోట్ల మందికి గ్యాస్ కనెక్షన్లు అందించామని, ఆంధ్రప్రదేశ్‌లో ఐదు లక్షల మందికి కనెక్షన్లు ఇచ్చామని చెప్పారు. బెంగళూరు నుండి విజయవాడకు ఎకనామిక్ కారిడార్లలో సత్యసాయి జిల్లాలోని పలు మండలాలను అనుసంధానం చేస్తూ సిక్స్‌లైన్ జాతీయ రహదారి ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. డ్వాక్రా సంఘాల మహిళలు వారి జీవనోపాధి మెరుగుపరుచుకుంటూ స్వయం ఉపాధి పొందడానికి రుణాలు అందించి ప్రతి మహిళను లక్షాధికారి చేయడమే లక్ష్యమని తెలిపారు. అనంతరం వ్యవసాయ శాఖ, ఉపాధి, గృహ నిర్మాణ, ఐసిడిఎస్ శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను కేంద్ర మంత్రి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, ఎమ్మెల్యే శంకర్‌నారాయణ, జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు పాల్గొన్నారు.

## తిరునాళ్లకు డబ్బులు ఇవ్వలేదని..
# దళితుల గ్రామ బహిష్కరణ

- వారితో మాట్లాడితే పదివేలు జరిమానా
- ప్రకాశం జిల్లాలో దారుణం

ప్రజాశక్తి-శింగరాయకొండ (ప్రకాశం జిల్లా)

తిరునాళ్లకి డబ్బులు ఇవ్వలేదని ప్రకాశం జిల్లా శింగరాయకొండ మండలం, శానంపూడి గ్రామంలోని అరుంధతి నగర్ (మాదిగ పల్లె)కాలనీలోని 17 కుటుంబాలను కుల బహిష్కరణతో పాటు గ్రామ బహిష్కరణ చేశారు. వారితో ఎవరైనా మాట్లాడితే రూ.10 వేలు జరిమానా విధిస్తూ .. డప్పు కొట్టి చాటింపు వేయించారు.

అరుంధతి నగర్‌లో ఉన్న మాతమ్మ తిరునాళ్ల సందర్భంగా కాలనీ వారి నుంచి చందాలు వసూలు చేశారు. కొందరు డబ్బులు ఇవ్వగా..మరికొందరు తర్వాత ఇస్తామని చెప్పారు. తిరుణాళ్ల తర్వాత 40 కుటుంబాల వాళ్ల డబ్బులు ఇవ్వగా 17 కుటుంబాలు వాళ్ల ఇవ్వలేదు. తాము చర్చికి వెళుతున్నామని, డబ్బులు కట్టబోమని చెప్పారు. నవంబర్ 29న మాతమ్మ జాతరకు డబ్బులు ఇవ్వని 17 కుటుంబాలను కుల బహిష్కరణతో పాటు గ్రామ బహిష్కరణ చేస్తున్నామని కుల పెద్దలు చాటింపు వేయించారు. వారితో ఎవరైనా మాట్లాడితే రూ.10 వేలు జరిమానా విధిస్తామని డప్పు కొట్టి చాటింపు వేయించారు. దీంతో ఆ 17 కుటుంబాల వారు గ్రామంలోని సచివాలయంలో ఫిర్యాదు చేశారు. వారు పట్టించుకోకపోవడంతో శింగరాయకొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తహాశీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని పోలీసులు సూచించడంతో బాధితులు అక్కడికి వెళ్లి ఫిర్యాదు ఇచ్చారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని తమ సమస్యను పరిష్కారం చేయాలని కోరుతున్నారు.

## విద్యార్థినులపై తేనేటీగల దాడి

- 30 మంది అస్వస్థత

ప్రజాశక్తి - కదిరి టౌన్


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

సత్యసాయి జిల్లా కదిరి పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో తొమ్మిదవ తరగతి చదువుతున్న 30 మంది విద్యార్థినులపై తేనేటీగలు దాడి చేశాయి. దీంతో వారు అస్వస్థతకు గురయ్యారు. విద్యార్థుల సమాచారం మేరకు.. మధ్యాహ్న భోజనం సమయంలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థినులతో పాఠశాల ఆవరణంలో ఉపాధ్యాయులు పరిశుభ్రత పనులు చేయించారు. ఈ క్రమంలో ఒక్కసారిగా వారిని తేనెటీగలు చుట్టుముట్టాయి. తేనేటీగలు కుట్టడంతో 30 విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఉపాధ్యాయులు వారిని హుటాహుటిన కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వారు చికిత్స పొందుతున్నారు. పాఠశాలలో సిబ్బంది ఉన్నప్పటికీ విద్యార్థినుల చేత పనులు ఎందుకు చేయిస్తున్నారని విద్యార్థినుల తల్లిదండ్రులు ప్రశ్నించారు. తాము విద్యార్థినుల చేత ఎలాంటి పనులు చేయించలేదని, విద్యార్థినులు అస్వస్థతకు గురైన సమయంలో అక్కడ ఎలాంటి తేనేటీగలు లేవని పాఠశాల హెచ్‌ఎం పేర్కొన్నారు.



విజయం అనంతరం సిఐటియు నాయకులతో కార్మికులు

## 'సర్వరాయ' గుర్తింపు సంఘం ఎన్నికల్లో సిఐటియు ఘన విజయం

ప్రజాశక్తి - కడియం(తూర్పుగోదావరి జిల్లా)

తూర్పుగోదావరి జిల్లా కడియం మండలం వేమగిరిలోని సర్వరాయ సుగర్స్ బాట్లింగ్ యూనిట్ (కోకో కోల)లో గురువారం జరిగిన గుర్తింపు సంఘం ఎన్నికల్లో సిఐటియు అనుబంధ సంఘం శ్రీ సర్వరాయ సుగర్స్ లిమిటెడ్ బాట్లింగ్ యూనిట్ వర్కర్స్ యూనియన్ ఘన విజయం సాధించింది. మొత్తం 141 ఓట్లకు 134 ఓట్లు పోలయ్యాయి. పోలైన ఓట్లలో సిఐటియుకి 86, ఎఐటియుసికి 48 ఓట్లు వచ్చాయి. 38 ఓట్ల ఆధిక్యంతో సిఐటియు విజయం సాధించింది. ఫలితాల అనంతరం విజయోత్సవ సభ జరిగింది. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు టి.అరుణ్, ఎస్ఎస్.మూర్తి మాట్లాడారు. సిఐటియుని గెలిపించిన కార్మికులకు అభినందనలు తెలిపారు. కార్మికులకు మెరుగైన వేతన ఒప్పందం, ఇతర సమస్యలు పరిష్కారానికి సిఐటియు కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.సుందబాబు, బి.రాజులోవ, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

## పోలీసులకు వీక్లీ ఆఫ్ అమలు ఎన్నడు?

- ఖాళీలు భర్తీ చేయకుండా సాధ్యం కాదంటున్న ఎస్‌హెచ్ఒలు
- అత్యవసరాలకూ సెలవుల్లేవ్
- ఉత్తర్వులున్నా అమలుకాని వారాంతపు సెలవులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పోలీసులకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించిన వీక్లీ ఆఫ్ విధానం ఆచరణలో అటకెక్కింది. రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి రాగానే పోలీసుల సంక్షేమమే తమ తొలి ప్రాధాన్యతంటూ వీక్లీ ఆఫ్‌ల అమలు కోసం కమిటీ వేసింది. రాష్ట్రంలో 12,384 పోలీసుల ఖాళీలను భర్తీ చేస్తే వీక్లీ ఆఫ్‌లను అమలు చేయవచ్చని నివేదికను ఇచ్చింది. అయితే రాష్ట్ర ప్రభుత్వం పోలీసు శాఖలో ఖాళీలను భర్తీ చేయకుండా వీక్లీ ఆఫ్ అమలు కోసం 2019 జూన్‌లో ఉత్తర్వులు జారీ చేసింది. తక్షణం వీక్లీ ఆఫ్‌లు అమలులోకి వస్తాయని ప్రకటన చేసినా రాష్ట్రంలో ప్రతి పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది కొరత వుండటంతో ఎక్కడా అమలు కావడం లేదు. వీక్లీ ఆఫ్‌లు అమల్లోకి రాకున్నా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతియేటా అక్టోబరు 21న జరిగే పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం కార్యక్రమంలో దేశంలో ఏ ప్రభుత్వమూ అమలు చేయని రీతిలో తమ ప్రభుత్వం పోలీసులకు వీక్లీ ఆఫ్‌లు ఇస్తోందని ప్రకటిస్తున్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం పోలీసు ఖాళీలను భర్తీ చేసేందుకు 2022 సెప్టెంబరులో 6,100 కానిస్టేబుల్, 411 సబ్‌ఇన్‌స్పెక్టర్ పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చింది. ఈ మేర పోలీసులు కొత్తగా డిపార్ట్‌మెంట్‌లోకి వచ్చినా వీక్లీ ఆఫ్‌లు అమలవుతాయని ఆశించినా పోలీసులకు ఇప్పటికీ వీక్లీ ఆఫ్ అనేది కలగానే మిగిలింది. పోలీసుశాఖలో 6,511 పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చి ఏడాది దాటినా ఇప్పటి వరకూ రిక్రూట్‌మెంట్ ప్రక్రియను పూర్తి చేయలేదు. ప్రస్తుతం పోలీసు శాఖలో అన్ని విభాగాల్లో దాదాపు 18 వేల వరకూ ఖాళీలున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈ పోస్టులన్నీ భర్తీ చేయకుండా వీక్లీ ఆఫ్‌ను అమలు చేయడం సాధ్యం కాదని స్టేషన్ హౌస్ అధికారులు చెబుతున్నారు. సిబ్బంది కొరతతో పోలీసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కుటుంబాల్లో అనారోగ్యం వచ్చినా, శుభకార్యాలున్నా సెలవులు కూడా ఇవ్వని పరిస్థితి పోలీసు శాఖలో వుండటంతో మానసిక ఒత్తిళ్లకూ గురవుతున్నారు. ఖాళీలన్నీ భర్తీ చేసి వీక్లీ ఆఫ్‌ను అమలు చేయాలని పోలీసులు కోరుకుంటున్నారు.


విద్యార్థులతో సెల్ఫీ దిగుతున్న లోకేష్

# రాష్ట్రంలో వ్యవసాయ సంక్షోభం

- యువగళం పాదయాత్రలో లోకేష్

ప్రజాశక్తి - తాళ్లరేవు (కాకినాడ జిల్లా)

రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి చేతగాని పాలన కారణంగా వ్యవసాయరంగం సంక్షోభంలో కూరుకుపోయిందని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ విమర్శించారు. 213వ రోజు యువగళం పాదయాత్ర గురువారం కోనసీమ జిల్లా ముమ్మిడి వరంలోని సుంకరపాలెం క్యాంపు సైటు నుంచి ప్రారంభమై తాళ్లరేవు మండలం లచ్చిపాలెం వద్ద కాకినాడ జిల్లాలోకి ప్రవేశించింది. తొలుత పటవల, ముమ్మిడివరం నియోజకవర్గంలోని రైతులు లోకేష్‌ను కలిసి తమ సమస్యలను వివరించారు. నాలుగున్నరేళ్లుగా వ్యవసాయ పంటలకు మద్దతు ధర లభించడం లేదని వాపోయారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ.. రైతుల ఆత్మహత్యల్లో దేశంలో ఆంధ్రప్రదేశ్ మూడవ స్థానం, కౌలు రైతుల ఆత్మహత్యల్లో రెండవ స్థానంలో ఉందన్నారు. ఇన్‌పుట్ సబ్సిడీలు, పంటల బీమా పథకాలను వైసిపి ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. అధికారంలోకి వస్తే రైతులందర్నీ ఆదుకుంటామన్నారు. అన్నదాత పథకం కింద ప్రతి రైతుకూ ఏటా రూ.20వేల ఆర్థిక సాయం అందిస్తామన్నారు. తాళ్లరేవు సెంటర్‌లో ఇసుక నావ కార్మికులు, భవన నిర్మాణ రంగ కార్మికులు లోకేష్‌ను కలిసి తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఇసుక ర్యాంపులపై ఆధారపడి జీవిస్తున్న వందలాది కుటుంబాలు జీవనాధారం కోల్పోయాయన్నారు. చొల్లంగిపేటలో ఏర్పాటు చేసిన క్యాంపు సైటు వద్దకు యాత్ర చేరుకుంది.

## ఎఎజి పొన్నవోలుపై చర్యలు తీసుకోవాలి

- సిఎస్‌కు టిడిపి నేత వర్ల ఫిర్యాదు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తమ పార్టీ అధినేత చంద్రబాబు నాయుడుకు బెయిల్ తీర్పుపై న్యాయ వ్యవస్థను కించపరిచేలా మాట్లాడిన అడిషనల్ అడ్వకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డిని సచివాలయంలో గురువారం కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పొన్నవోలు కోర్టు ధిక్కరణకు పాల్పడ్డారని, వెంటనే ఆయనపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. చంద్రబాబుపై తప్పుడు కేసులు నమోదు చేసి, తప్పుడు సాక్ష్యాలు సృష్టించడమే ప్రధాన విధిగా ఎఎజి కదలికలు ఉన్నాయని విమర్శించారు. సిఎం జగన్ కళ్లల్లో ఆనందం కోసమే చట్టవిరుద్ధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. సిఎస్‌ను కలిసిన వారిలో టిడిపి ఎమ్మెల్సీ పి అశోక్‌బాబు, అధికార ప్రతినిధి సయ్యద్ రఫీ, మహిళా అధికార ప్రతినిధి కంభంపాటి శిరీష తదితరులు ఉన్నారు.

**ఎన్నికల వేళ జగన్ బిసిల జపం : బుద్దా వెంకన్న**

ఎన్నికలు సమీపిస్తున్నాయనే సిఎం జగన్ బిసిల జపం చేస్తున్నారని మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న విమర్శించారు. టిడిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బిసి సబ్‌ప్లాన్ నిధులు రూ.75 వేలకోట్లు దారి మళ్లించారని ఆరోపించారు. జగన్ 56 ఉత్తుత్తి బిసి కార్పొరేషన్లు పెట్టి రూపాయి కూడా సాయం అందించలేదని విమర్శించారు.

# నిర్వాసిత రైతులకు న్యాయం చేయండి

- కేంద్ర మంత్రి నిర్మల సీతారామన్‌ను కోరిన సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - గోరంట్ల రూరల్


కేంద్రమంత్రికి సమస్యను వివరిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్

శ్రీ సత్యసాయి జిల్లా గోరంట్ల మండల పరిధిలోని పాలసముద్రం సమీపంలో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన నాసన్, బెల్ కంపెనీకి భూములు కోల్పోయిన రైతులకు న్యాయం చేయాలని కేంద్రమంత్రి నిర్మల సీతారామన్‌ను సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ కోరారు. నాసన్ అభివృద్ధి పనులను పరిశీలించడానికి కేంద్ర మంత్రి వస్తున్న నేపథ్యంలో భూములు కోల్పోయిన వందలాది మంది రైతులు గురువారం ఉదయం నాసన్ కార్యాలయం ముందు సిపిఎం ఆధ్వర్యంలో దాదాపు ఎనిమిది గంటల పాటు నిరసన, ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంతియాజ్ మాట్లాడుతూ.. మండల పరిధిలోని పాలసముద్రం, చిన్న బాబయ్యపల్లి గ్రామాలకు చెందిన చిన్న, సన్నకారు దళిత, రైతులు 1150 ఎకరాల భూమిని నాసన్, బెల్ కంపెనీల భూ సేకరణలో భూములు కోల్పోయారన్నారు. పరిహారం అందించడంలో ప్రభుత్వం వివక్ష చూపిందని, అగ్రవర్ణాల రైతులకు ఒకరకంగా ఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు మరో రకంగా పరిహారం అందజేసిందని విమర్శించారు. అన్ని వర్గాలకు సమానంగా భూ పరిహారం అందాలని డిమాండ్ చేశారు. ఆందోళన ప్రాంతానికి పోలీసులు చేరుకుని నాయకులతో మాట్లాడారు. కేంద్ర మంత్రికి సమస్యను వివరించేందుకు నలుగురు ముందుకు రావాలని పోలీసులు కోరారు. దీంతో సిపిఎం నాయకులు ఇంతియాజ్, వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి పెద్దన్న, ప్రవీణ్, బాధితురాలు గంగమ్మ ముందుకు వచ్చారు. కేంద్రమంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. పరిహారం అందించడంలో రైతుల పట్ల వివక్ష చూపరాదని, అలసత్వం వహించరాదని కోరారు. అందుకు కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారు. సత్యసాయి జిల్లా కలెక్టర్‌ను పిలిచి పది రోజుల్లోపు రైతుల పరిహార విషయం తేల్చాలని ఆదేశించారు. ఈ విషయంపై తాను ఫోను ద్వారా సంప్రదిస్తానని చెప్పారు. దీంతో నాయకులు, నిర్వాసితులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు హనుమయ్య, సిఐటియు మండల అధ్యక్షులు వెంకటేష్, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు వెంకటేశులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు నారాయణ, గంగాధర, భూ నిర్వాసితులు గంగమ్మ, రమీజా, కదిరప్ప తదితరులు పాల్గొన్నారు.

## ఫర్నిచర్ తయారీ కేంద్రంలో భారీ అగ్ని ప్రమాదం

- రూ.20 లక్షల మేర ఆస్తి నష్టం

ప్రజాశక్తి- వి.కోట (చిత్తూరు జిల్లా)


చిత్తూరు జిల్లా వి.కోట మండల కేంద్రంలో ఓ ఫర్నీచర్ తయారీ కర్మాగారంలో గురువారం ఉదయం అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో రూ.20 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు. కె.కొత్తూరుకు చెందిన సయ్యద్.. పత్రపల్లి సమీపంలోని కెజిఎఫ్ రోడ్డులో ఉన్న కోళ్ల ఫారంలో ఫర్నీచర్ తయారీ యూనిట్‌ను నిర్వహిస్తున్నారు. గురువారం ఉదయం 7.30 గంటల సమయంలో షెడ్డులో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. గాలి బలంగా వీయడంతో మంటలు షెడ్డు మొత్తం వ్యాపించాయి. క్షణాల వ్యవధిలో షెడ్డులోని ఫర్నీచర్, తయారీ సామగ్రి కాలిబూడిదైంది. దట్టమైన పొగ పరిసరాల్లో వ్యాపించడంతో స్థానికులు చూసి యజమానికి సమాచారం అందించారు. అప్పటికే మంటలు ఎగసిపడుతూ ఫర్నీచర్ కర్మాగారం మొత్తం దగ్ధమైంది. ఈ ప్రమాదంలో సుమారు రూ.20 లక్షలు నష్టం వచ్చిందని యజమాని సయ్యద్ ఆవేదన వ్యక్తం చేశారు. అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు, విద్యుత్‌శాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. స్థానికంగా ఫైర్‌స్టేషన్ అందుబాటులో లేకపోవడం, కుప్పం నుంచి అగ్నిమాపక సిబ్బంది వచ్చే సమయానికి కర్మాగారం పూర్తిగా కాలిపోయింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదం జరిగిందా? మద్యం మత్తులో ఎవరైనా నిప్పు అంటిచారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## రేపటి నుంచి లెజెండ్స్ క్రికెట్ టోర్నీ

- ప్రపంచ వ్యాప్తంగా 70 మంది క్రికెటర్లు రాక

ప్రజాశక్తి -పిఎం పాలెం (విశాఖ)


లెజెండ్స్ క్రికెట్ లీగ్ టీ-20 తొలి దశ మ్యాచ్‌లకు విశాఖ పిఎం.పాలెంలో ఉన్న డాక్టర్ వైఎస్‌ఆర్ ఎసిఎ - విడిసిఎ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం వేదిక కానుందని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్‌ఆర్.గోపినాథ్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డిసెంబర్ 2 నుంచి 4వ తేదీ వరకు జరిగే ఈ టోర్నమెంట్‌లో ఐదు జట్లు తలపడతాయన్నారు. లీగ్‌లో పాల్గొనేందుకు ప్రపంచ వ్యాప్తంగా ప్రఖ్యాతిగాంచిన దాదాపు 70 మంది క్రికెటర్లు వైజాగ్‌కు రానున్నారని వెల్లడించారు. గౌతమ్ గంభీర్ సారథిగా వ్యవహరించే ఇండియా క్యాపిటల్స్ కెవిన్ పీటర్సన్, యశ్‌పాల్‌సింగ్, రిచర్డ్ పావెల్, మునాఫ్ పాటేల్, దిల్హార్ ఫెర్నాండో తదితరులు ఉన్నారు. హర్భజన్‌సింగ్ కెప్టెన్‌గా వ్యవహరించే మణిపాల్ టైగర్స్ జట్టులో ఎస్.బద్రినాథ్, రాబిన్ ఊతప్ప, మహ్మద్ కైఫ్, ప్రవీణ్‌కుమార్, పంకజ్ సింగ్, మిశ్చెల్, కారీ అండర్సన్, సురేష్ రైనా సారథిగా వ్యవహరించే అర్బన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టులో మార్టిన్ గుప్తిల్, డానే స్మిత్, ప్రజ్ఞాన్ ఓజా, టినో బెస్ట్, చమర కాపుగెందర్, పార్థీవ్ పటేల్ కెప్టెన్‌గా వ్యవహరించే గుజరాత్ జైంట్స్ జట్టులో క్రిస్ గేల్, కెవిన్ ఓ బ్రియన్, హమీద్ రజా, ఎస్.శ్రీశాంత్, ఆరన్ ఫించ్ సారథిగా ఉన్న సదరన్ సూపర్‌స్టార్స్ జట్టులో అబ్దుల్ రజాక్, టేలర్, ఉపుల్ తరంగ, అశోక్ దిండా తదితరులు ఉన్నారు.


పిఎం.పాలెంలోని డాక్టర్ వైఎస్‌ఆర్ ఎసిఎ- విడిసిఎ క్రికెట్ స్టేడియం

**షెడ్యూల్ ఇలా..**

డిసెంబర్ 2వ తేదీ సాయంత్రం 7 గంటలకు ఇండియా క్యాపిటల్స్, మణిపాల్ టైగర్స్, 3న మధ్యాహ్నం 3 గంటలకు గుజరాత్ జైంట్స్, సదరన్ సూపర్ స్టార్స్, 4న సాయంత్రం 7 గంటలకు మణిపాల్ టైగర్స్, అర్బన్‌రైజర్స్ హైదరాబాద్ జట్లు తలపడనున్నాయి.

## నేటి నుంచి ఎస్‌బిఐ మెగా ప్రాపర్టీ షో




**హైదరాబాద్ :** బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బిఐ నేటి నుంచి హైదరాబాద్‌లో మెగా ప్రాపర్టీ షోనూ నిర్వహిస్తుంది. డిసెంబర్ 1-3 తేదిల్లో హైటెక్స్‌లో ఈ ప్రదర్శనను ఏర్పాటు చేస్తుంది. ఈ ప్రాపర్టీ షోలో 70 మంది పెద్ద బిల్డర్లు తమ 600 మేర ప్రాజెక్టులను ప్రదర్శించనున్నారని ఎస్‌బిఐ హైదరాబాద్ సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ రాజేష్ కుమార్ ఇటీవల తెలిపారు. ఒకే వేదిక వద్ద అన్ని పరిష్కారాలు అందించే యోచనతో దీన్ని ఏర్పాటు చేశామన్నారు. సిబిల్ స్కోర్ ఆధారంగా పోటీతత్వంతో కనీసం 8.25 శాతం వడ్డీ రేటుతో రుణాలను జారీ చేయనున్నామన్నారు. గృహ రుణాల జారీలో తమ బ్యాంక్ మార్కెట్ లీడర్‌గా ఉందన్నారు.

## కామాంధుడికి ఎనిమిదేళ్ల జైలుశిక్ష

- తీర్పును వెలువరించిన చిత్తూరు పోక్సో కోర్టు

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం)


ఓ కామాంధుడికి ఎనిమిదేళ్ల జైలుశిక్ష పడింది. బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన కేసులో చిత్తూరు పోక్సో కోర్టు పై తీర్పును వెలువరించింది. కేసు పూర్వపరాలిలా ఉన్నాయి. చంద్రగిరి పోలీసు సబ్ డివిజన్, తిరుచానూరు పోలీసుస్టేషన్ పరిధిలో 2020లో ఎస్‌విపి కాలనీలో తిరుచానూరు గ్రామానికి చెందిన గురుస్వామి కుమారుడు నాదముని తన కూతురు పుట్టినరోజు వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తమ బంధువు నాదముని హాజరయ్యారు. ఫంక్షన్‌లో ఓ బాలిక పట్ల నాదముని అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో బాలిక తల్లిదండ్రులు తిరుచానూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నిందితుడిపై ఫొక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించి, ఛార్జిషీట్‌ను కోర్టుకు సమర్పించారు. నిందితుడిని దోషిగా తేలుస్తూ ఎనిమిదేళ్ళ కఠిన కారాగారశిక్ష, మూడువేలు జరిమానా విధిస్తూ చిత్తూరు పొక్సో కోర్టు జడ్జి ఎన్.శాంతి గురువారం తీర్పునిచ్చారు.

## యుపిఐ చెల్లింపుల్లోకి ఓలా

**బెంగళూరు :** ప్రముఖ క్యాబ్ అగ్రిగేటర్ ఓలా కొత్తగా యుపిఐ చెల్లింపుల్లోకి ప్రవేశిస్తున్నట్లు ప్రకటించింది. తమ వినియోగదారులు ఇకపై ఓలా యాప్‌లోనే డిజిటల్ చెల్లింపులు చేయవచ్చని ఓలా సహ వ్యవస్థాపకుడు భవీష్ అగర్వాల్ ఓ ట్వీట్‌లో పేర్కొన్నారు. యాప్‌లో యుపిఐ పేమెంట్స్ ఫీచర్‌ని ఆ సంస్థ జత చేసింది. దీంతో యాప్ ద్వారానే క్యూఆర్ కోడ్‌ని స్కాన్ చేసి నగదు చెల్లించవచ్చని ఓలా పేర్కొంది. ఈ ఫీచర్ మొదట బెంగళూరులో అందుబాటులో తీసుకురానున్నట్లు ప్రకటించింది. ఈ ఏడాది ముగిసే నాటికి దేశ వ్యాప్తంగా అన్ని నగరాలకు విస్తరించనున్నట్లు వెల్లడించింది.

## టాటా టెక్ బంఫర్ లిస్టింగ్

### 140 శాతం ప్రీమియంతో ప్రవేశం




**ముంబయి :** టాటా గ్రూపు నుంచి దాదాపు 19 ఏళ్ళ తర్వాత లిస్టింగ్‌కు వచ్చిన టాటా టెక్నాలజీస్ లిస్టింగ్ తొలి రోజే అదరగొట్టింది. గురువారం ఉదయం 140 శాతం ప్రీమియంతో స్టాక్ మార్కెట్లోకి ప్రవేశించింది. తుదకు 165 శాతం లాభంతో రూ.1,325 వద్ద ముగిసింది. టాటా టెక్నాలజీ ఇష్యూ ధర రూ.500గా నిర్ణయించింది. లిస్టింగ్‌కు వచ్చిన తొలి రోజే రూ.1,200 వద్ద ప్రారంభమయ్యింది. దీంతో ఒక్కో షేరుపై లిస్టింగ్‌లోనే ఇన్వెస్టర్లకు రూ.700 రాబడిని ఇచ్చింది. ఇష్యూలో షేర్లు దక్కిన వారు 30 షేర్లు కలిగిన ఒక్కో లాట్‌పై రూ.21వేల లాభాన్ని పొందారు. ఒక్క లాట్ కోసం రూ.15వేలు పెట్టుబడి పెట్టారు. దీంతో లిస్టింగ్ రోజున అత్యధిక రాబడులు ఇచ్చిన సంస్థల జాబితాలో ఏడో స్థానంలో నిలిచింది. ఈ ఇష్యూలో ద్వారా రూ.3042.5 కోట్లు సమీకరించాలని ఆ కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది. కాగా రూ.1.5 లక్షల కోట్ల విలువ చేసే బిడ్డింగ్‌లు రావడం విశేషం. టాటా మోటార్స్‌కు చెందిన టాటా టెక్నాలజీస్ ఇంజినీరింగ్, ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ డిజిటల్ సర్వీసెస్ సంస్థ, జాగ్వార్ ల్యాండ్‌రోవర్ సహా టాటా గ్రూప్‌లోని పలు సంస్థలకు ఇది ప్రధానంగా సేవలందిస్తోంది. ఈ ఐపిఒలో భాగంగా టాటా మోటార్స్ 11.4 శాతం వాటాకు సమానమైన షేర్లను విక్రయించింది.

సంపాదకీయం


# ధిక్కారమే!

ప్రజలెన్నుకున్న శాసనసభలు ఆమోదించిన బిల్లులను గవర్నర్లు అడ్డుకోవడానికి వీల్లేదని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టంగా పేర్కొన్నప్పటికి కేరళ శాసనసభ ఆమోదించిన బిల్లుల్లో ఏళ్ల తరబడి తొక్కిపట్టిన గవర్నర్ ఆరిఫ్ మహ్మద్ ఖాన్ వాటిలో ఒక్కటి మాత్రమే ఆమోదించి మిగతా ఏడింటిని రాష్ట్రపతికి నివేదించడం సుప్రీం ఆదేశాలను ధిక్కరించడంగానే భావించాలి. రాజ్యాంగ పదవి నిర్వహిస్తున్న వ్యక్తి ఇలా వ్యవహరించడం దారుణం. గవర్నర్ తీరును సుప్రీం ధర్మాసనం తీవ్రంగా ఆక్షేపించడం, ఇటువంటి చర్యలను ఎంతమాత్రం అనుమతించబోమని తేల్చి చెప్పడం సరైన స్పందన. "రెండేళ్లుగా గవర్నర్ ఏం చేస్తున్నారు? బిల్లులు ఎందుకు నిలిపి ఉంచారు? ఇంతకాలం పాటు బిల్లులను తొక్కిపట్టడానికి కారణం ఎందుకు చెప్పలేదు అని ప్రశ్నించింది. కోర్టు జోక్యం చేసుకోవడంతో బిల్లులను రాష్ట్రపతికి పంపారు. చట్టాలను రూపొందించే శాసనసభల అధికారాల్లో జోక్యం చేసుకునే విధంగా గవర్నర్ అధికారాలను దుర్వినియోగం చేయరాదు. గవర్నర్‌కు రాజ్యాంగ బాధ్యత ఉంది. అది నెరవేరలేదని తేలితే కోర్టు జోక్యం చేసుకోవాల్సి ఉంటుంది." అని సాక్షాత్తూ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ ఆగ్రహం వ్యక్తం చేయడం సబబుగా ఉంది.

రాష్ట్ర అసెంబ్లీ అమోదించిన బిల్లులకు అంగీకారం తెలపకుండా గవర్నర్ ఉద్దేశపూర్వకంగానే జాప్యం చేస్తున్నారన్నది సుస్పష్టం. రాజ్యాంగంలోని ఆర్టికల్ 200 ప్రకారం బిల్లులపై గవర్నర్లు నిర్ణయాలు తీసుకునే విషయంలో సుప్రీంకోర్టు స్పష్టమైన మార్గదర్శకాలను జారీ చేయాలన్న డిమాండ్‌ను పరిశీలిస్తామన్న ధర్మాసనం గవర్నర్ తీరులో మార్పు రాకుంటే ఆయనకు మార్గదర్శకాలు జారీ చేసేందుకూ వెనుకాడబోమని హెచ్చరించడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తుంది. బిల్లులను తొక్కిపట్టిన పంజాబ్, కేరళ, తమిళనాడు రాష్ట్రాల గవర్నర్ల తీరుపై ఆ యా రాష్ట్ర ప్రభుత్వాలు సుప్రీం గడప తొక్కవలసివచ్చింది. అందులో తొలుత పంజాబ్ కేసులో తీర్పునిచ్చిన సర్వోన్నత న్యాయస్థానం రాజ్యాంగపరమైన, విధానపరమైన అంశాలను, గవర్నర్ల పరిధి, పరిమితులను స్పష్టంగా పేర్కొంది. అయినా కేరళ గవర్నర్ సక్రమంగా స్పందించకపోవడంతో 'పంజాబ్ విషయంలో ఇచ్చిన తీర్పును చదవమనండి' అని సుప్రీం ధర్మాసనం గట్టిగా చెప్పడం గమనార్హం. ఆ తరువాత సైతం నిబంధనలు పాటించకుండా గవర్నర్ బిల్లులను రాష్ట్రపతి పరిశీలనకు పంపడమేగాక అందుకు ఎలాంటి కారణం కూడా చెప్పకపోవడం బాధ్యతా రాహిత్యమే! తొక్కిపట్టినవాటిలో మనీ బిల్లు ఒకటి ఉందని కేరళ ప్రభుత్వం తరపు న్యాయవాది లేవనెత్తాకనే 'ఆ మనీ బిల్లుపై గవర్నరు వెంటనే నిర్ణయం తీసుకునేలా చూస్తాన'ని అటార్నీ జనరల్ చెప్పడం చూస్తుంటే ప్రజా సంక్షేమానికి కీలకమైన బిల్లుల పట్ల రాజ్‌భవన్ ఎంత యథాలాపంగా వ్యవహరిస్తోందో తేటతెల్లమవుతోంది. బిల్లులో ఏముందో కాదు, దాన్ని ఎన్నాళ్లు ఎలా ఆపాలన్నదే ఆరిఫ్ ఖాన్ విధానంగా ఉందన్నమాట.

శాసనసభల ఎన్నికల్లో బిజెపి యేతర పార్టీలకు మెజార్టీ వచ్చినా గవర్నర్లను ప్రయోగించి దొడ్డిదారిన తమ పార్టీ ప్రభుత్వాలను ఏర్పాటు చేయడం కాషాయ పాలకులకు వెన్నతోపెట్టిన విద్యగా ఉంది. ప్రతిపక్ష పాలిత రాష్ట్ర ప్రభుత్వాలకు గవర్నర్ల ద్వారా అడ్డంకులు కల్పించి, పాలన సాగనీయకుండా చేయడం మరో దుర్నీతి. ఆ యా రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకందించాల్సిన అభివృద్ధి, సంక్షేమ చర్యలను అడ్డుకోవడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమే! రాజ్‌భవన్ ద్వారా రాజకీయాలు నడిపే విధానాలను బిజెపి కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా విడనాడాలి. భారత రాజ్యాంగ మూలస్తంభాల్లో ముఖ్యమైన ఫెడరల్ వ్యవస్థను కాపాడడానికి సర్వోన్నత న్యాయస్థానం పూనుకోవడం అవసరం. గవర్నర్లు ఎన్నికైన ప్రజా ప్రతినిధులు కారన్న భారత ప్రధాన న్యాయమూర్తి వ్యాఖ్య ఎంతో అర్థవంతమైనది. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ విలువలను కాపాడడానికి, బరితెగించిన గవర్నర్లకు ముకుతాడు వెయ్యడానికీ సుప్రీంకోర్టు కట్టుదిట్టమైన మార్గ నిర్దేశనం చేస్తుందని దేశ ప్రజలు ఎదురు చూస్తున్నారు.

మహనీయుల మాట



**చరిత్రే నిజమైన ఉపాధ్యాయుడు. కార్మిక వర్గానికి విప్లవమే అత్యుత్తమ పాఠశాల.**

**- రోజా లగ్జెంబర్గ్**

విశ్లేషణ

# ఉదారవాద విధానాలపై పోరులో మహిళా కార్మిక శక్తి





ఎ.ఆర్. సింధు

**ఇటీవలి పోరాటాలకు సంబంధించి తప్పక చెప్పుకోవాల్సిన ప్రధాన అంశం ఒకటుంది. అదేమిటంటే మహిళల ప్రాతినిధ్యం పెరగడం చాలా స్పష్టంగా కనిపిస్తోంది. అది కార్మిక వర్గం, రైతులు, వ్యవసాయ కార్మికులు, యువత, విద్యార్థి మరే ఇతర వర్గాలైనా సరే వారి పోరాటంలో మహిళల పాత్ర ప్రధానంగా వుంటోంది. కార్మిక సంఘాలు చేపట్టే ఏ కార్యక్రమంలోనైనా సరే...అది జాతీయ స్థాయి అయినా, రాష్ట స్థాయి అయినా లేదా అంతకంటే కింది స్థాయి అయినా వర్కింగ్ మహిళల ప్రాతినిధ్యం ఎప్పుడూ కూడా 40 నుండి 45 శాతంగా వుంటోంది. కొన్ని సందర్భాల్లో అయితే 50 శాతం కూడా దాటుతోంది. భారతదేశంలో కార్మికోద్యమం ముఖ్యంగా మహిళా కార్మికుల ఉద్యమం రైతుల పోరాటాల్లో కీలక పాత్ర పోషించింది.**

దేశం ఒకపక్క ఆర్థికంగా సూపర్ పవర్‌గా మారుతోందని మోడీ ప్రభుత్వం చెబుతుంటే...మరోపక్క ప్రపంచ ఆర్థిక వేదిక గణాంకాల ప్రకారం లింగ సమానతలో 146 దేశాల్లో భారత్ 127వ స్థానంలో వుంది. మనం నిరుద్యోగానికి సంబంధించి అత్యంత అధ్వానమైన పరిస్థితిని ఎదుర్కొంటున్నాం. భారత్‌లో మహిళల పని ప్రాతినిధ్య రేటు 30 శాతం కన్నా తక్కువగా వుంది. అందులో సగం మంది ఎలాంటి చెల్లింపులు లేని హెల్పర్లే! మెజారిటీ వ్యవసాయ కార్మికులు మహిళలే. వ్యవసాయ కార్యకలాపాల్లో ప్రధాన భాగం నిర్వహించేది, చిన్న చిన్న కమతాల్లో జంతువుల పెంపకం వంటి పనులు చేసేది ఆయా కుటుంబాలకు చెందిన మహిళలే, కానీ వారిని ఎన్నడూ రైతులుగా పరిగణించరు. లేదా వారికి స్వంతంగా భూమి వుండదు. లేదా వాటిపై ఎలాంటి చట్టపరమైన హక్కులు, అర్హతలు వుండవు. ఇళ్లల్లో పని చేయడం వంటి వృత్తుల్లో వుండే మహిళలు అత్యంత అమానుషమైన పరిస్థితులను ఎదుర్కొంటూ వుంటారు. వారికి ఎలాంటి చట్టబద్ధమైన రక్షణ వుండదు. పైగా పురుషులతో పోలిస్తే వీరి వేతనాల్లో అంతరాలు చాలా ఎక్కువగా వుంటాయి. పని ప్రదేశాల్లో ఎలాంటి భద్రత లేదా రక్షణ వుండదు.

### ఫ్రంట్‌లైన్ వర్కర్లు - వేతన అసమానతలు

దాదాపు కోటి మంది మహిళా కార్మికులు వున్నారు. భారత ప్రభుత్వం అమలు చేసే వివిధ మౌలిక సేవల పథకాల్లో పనిచేసే స్కీమ్ వర్కర్లు ఫ్రంట్‌లైన్ కమ్యూనిటీ వర్కర్లుగా వున్నారు. వారిని వలంటీర్లుగా వ్యవహరిస్తారు. వారికి కనీస వేతనాలు, సామాజిక భద్రతతోపాటు ఎలాంటి చట్టబద్ధమైన హక్కులు వుండవు. కోవిడ్ నిర్వహణలో ప్రధాన భాగం, ప్రజలతో ప్రత్యక్షంగా పెట్టుకునే సంబంధాలు వంటివన్నీ ఈ ఫ్రంట్‌లైన్ వర్కర్లతోనే చేయించారు. కానీ, వేతనాల్లో లింగ అసమానత పెరుగుతోంది. వివిధ అధ్యయనాల్లో వెల్లడైన అంశాల ప్రకారం, పురుష కార్మికులు లేదా ఉద్యోగులు, మహిళా కార్మికులు లేదా ఉద్యోగుల మధ్య వేతనాల్లో అంతరం 35-55 శాతంగా వుంది.

### రక్షణ కరువు

మహిళా కార్మికులు ముఖ్యంగా అసంఘటిత రంగాల్లోని మహిళా కార్మికుల్లో అత్యధికులకు ఎలాంటి ప్రసూతి ప్రయోజనాలు రావు. క్రెచ్ సదుపాయాలు వుండవు. వారు రాత్రివేళల్లో కూడా విధులు నిర్వహించాల్సి వుంటుంది. మహిళలకు కల్పించిన రక్షణాత్మక చట్టాలన్నీ లేబర్ కోడ్‌ల ద్వారా లాగేసుకుంటున్నారు. ఇళ్లల్లో హింస, అలాగే పని ప్రదేశాల్లో హింస ప్రమాదకరమైన రీతిలో పెరిగిపోయింది. మహిళల పాత్రలను పున: సాంప్రదాయీకరణ చేయడం ద్వారా ప్రభుత్వ, ప్రభుత్వ రంగంలో క్యాజువలైజేషన్, కాంట్రాక్టీకరణ జరిగాయి.

### తిరోగమన విధానాలపై ప్రతిఘటన

పాలక వర్గాలు అనుసరించే వివిధ మార్గాలు, పద్ధతుల ద్వారా పెట్టుబడిదారీ సంక్షోభ భారంలో మహిళా కార్మికులు అసమానమైన రీతిలో తమ వాటాను భరించాల్సి వస్తోంది. దీంతో వారు కార్మిక సంఘాల ద్వారా సంఘటితం అవుతున్నారు. తద్వారా ప్రభుత్వ దాడులను తిప్పికొట్టడంలో చారిత్రక పాత్ర పోషిస్తున్నారు. కార్మిక వర్గం, రైతాంగ ఉద్యమాల్లో మాదిరిగానే, ఇక్కడ కూడా కార్పొరేట్, మతోన్మాద కూటమి అనుసరించే తిరోగమన విధానాలను మహిళా కార్మిక ఉద్యమం తీవ్రంగా ప్రతిఘటిస్తూనే వుంది. ఇటీవలి పోరాటాలకు సంబంధించి తప్పక చెప్పుకోవాల్సిన ప్రధాన అంశం ఒకటుంది. అదేమిటంటే మహిళల ప్రాతినిధ్యం పెరగడం చాలా స్పష్టంగా కనిపిస్తోంది. అది కార్మిక వర్గం, రైతులు, వ్యవసాయ కార్మికులు, యువత, విద్యార్థి మరే ఇతర వర్గాలైనా సరే వారి పోరాటంలో మహిళల పాత్ర ప్రధానంగా వుంటోంది. కార్మిక సంఘాలు చేపట్టే ఏ కార్యక్రమంలోనైనా సరే...అది జాతీయ స్థాయి అయినా, రాష్ట్ర స్థాయి అయినా లేదా అంతకంటే కింది స్థాయి అయినా వర్కింగ్ మహిళల ప్రాతినిధ్యం ఎప్పుడూ కూడా 40 నుండి 45 శాతంగా వుంటోంది. కొన్ని సందర్భాల్లో అయితే 50 శాతం కూడా దాటుతోంది. భారతదేశంలో కార్మికోద్యమం ముఖ్యంగా మహిళా కార్మికుల ఉద్యమం రైతుల పోరాటాల్లో కీలక పాత్ర పోషించింది.

### పెరిగిన ప్రాతినిధ్యం

పెద్ద ఎత్తున ప్రజా సమీకరణలు, సుదీర్ఘ సమ్మెలు చేపట్టడం ద్వారా స్కీమ్ వర్కర్లు-అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన పథకం కార్మికులు-సిఐటియు నేతృత్వంలో కార్మిక వర్గంలోనే అత్యంత సమరశీలురుగా ఆవిర్భవించారు. ఇటీవలి కాలంలో వివిధ రాష్ట్రాల్లో స్కీమ్ వర్కర్లు అనేక విజయవంతమైన సమ్మెలు నిర్వహించారు. హర్యానా లోని 73 రోజుల ఆశా వర్కర్ల సమ్మె తీవ్ర అణచివేతను ఎదుర్కొంది. అయినప్పటికీ, హర్యానా లోని బిజెపి ప్రభుత్వం రాష్ట్రం నుంచి నెలవారీ వేతనంగా రూ.6100 ఇచ్చి, అదనంగా 50శాతం రాయితీలు చెల్లించేలా చేసింది. గతేడాది హర్యానాలో అంగన్‌వాడీ కార్మికులు చేసిన సమ్మె నాలుగు మాసాల పాటు సాగింది. తర్వాత వారికి దాదాపు రూ.1200 అదనపు మొత్తం వేతనంగా అందజేస్తున్నారు. మధ్యప్రదేశ్‌లో ఆశా వర్కర్ల 62 రోజుల సమ్మె, బీహార్‌లో 32 రోజుల సమ్మె, జమ్మూకాశ్మీర్‌లో దాదాపు రెండు మాసాలపాటు జరిగిన సమ్మె, మహారాష్ట్రలో 22 రోజుల పాటు జరిగిన సమ్మెలతో వారి వేతనాల్లో ఒక మోస్తరు పెంపుదల లభించింది. మరోపక్క ఢిల్లీలో అంగన్‌వాడీ కార్మికుల సమ్మె కొనసాగుతోంది. హర్యానా లోని మధ్యాహ్న భోజన కార్మికులు కూడా సమ్మె ద్వారా రూ.7500 వేతనాన్ని సాధించుకోగలిగారు. ఆంధ్రప్రదేశ్, అస్సాం, తెలంగాణ, ఉత్తరాఖండ్, పశ్చిమ బెంగాల్, గుజరాత్ వంటి రాష్ట్రాల్లో కూడా గత కొన్నేళ్లలో పెద్ద పెద్ద పోరాటాలే జరిగాయి. ఈ పోరాటాల ద్వారా ఆయా సంఘాలు వేతనాలు పెంచగలిగాయి. రాష్ట్ర స్థాయిలో వన్ టైమ్ రిటైర్మెంట్ ప్రయోజనాలు వంటి సదుపాయాలను కూడా పొందగలిగారు. ఈ పోరాటాలు చెల్లింపులు లేని పనికి సంబంధించిన అంశాన్ని జాతీయస్థాయి చర్చల్లో ముందుకు తీసుకువచ్చాయి. సంరక్షణ పని, సంరక్షణ ఉద్యోగాల నాణ్యత గురించి ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చాయి. అసంఘటిత రంగాల్లో గల విస్తృత సంఖ్యలోని కార్మికులకు పోరాటాలు చేయగలిగే విశ్వాసాన్ని ఈ పోరాటాలు కల్పించాయి. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లోగా బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ 50 లక్షల కుటుంబాలకు ప్రచారం చేరాలని స్కీమ్ వర్కర్లు నిర్ణయించారు.

కార్మిక వర్గ పోరాటాల్లో, సంఘీభావ చర్యల్లో మరింతమంది మహిళలు పాల్గొనడం వల్ల రైతాంగ పోరాటాల్లో కూడా మరింత మంది మహిళలు రావడానికి వీలవుతుంది. ఇది రైతులు, కార్మికుల మధ్య ఐక్యతకు దోహదపడుతుంది. నవంబరు 26-28 తేదీల్లో మూడు రోజుల పాటు నిర్వహించిన కార్మిక కర్షక మహా ధర్నా భారతదేశంలోని వర్గ పోరాటాల్లో ఒక మైలురాయిగా నిలుస్తుంది. ఈ మహిళల ప్రాతినిధ్యం అనేక సామాజిక అడ్డంకులను ఛేదించడంలో, పలు రంగాల్లో, ప్రాంతాల్లో పోరాటాలను పెంపొందించడంలో కీలక పాత్ర పోషించనుంది.

**/ వ్యాసకర్త సిఐటియు అఖిల భారత కార్యదర్శి/**

వ్యాఖ్య



## దాడుల నిలిపివేతతోనే పాలస్తీనియన్లకు ఉపశమనం!

గాజా పౌరుల మీద నాలుగు రోజుల పాటు దాడులను నిలిపివేసేందుకు, ఇజ్రాయిల్ జైళ్లలో ఉన్న 150 మంది మహిళలు, పిల్లలను, హమాస్ వద్ద బందీలుగా ఉన్న వారిలో 50 మంది మహిళలు, పిల్లలను విడుదల చేసేందుకు కుదిరిన ఒప్పందాన్ని మరో రెండు రోజులు పొడిగించారు. గాజా కాలమానం ప్రకారం గురువారం ఉదయం 5 గంటలకు ఆ గడువు ముగిసింది. ఇప్పటి వరకు 99 మంది బందీలు, 210 మంది ఖైదీలకు విముక్తి లభించింది. ఇజ్రాయిల్ దాడుల్లో ముగ్గురు బందీలు మరణించినట్లు హమాస్ ప్రకటించగా, పిల్లలతో సహా ఇంకా 161 మంది బందీలుగా ఉన్నట్లు ఇజ్రాయిల్ తెలిపింది. దాడుల నిలిపివేత మరికొంత కాలం లేదా పూర్తిగా నిలిపివేసేందుకు చర్చలు జరుగుతున్నట్లు వార్తలు వచ్చినప్పటికీ ఇది రాస్తున్న సమయానికి ఎలాంటి నిర్ణయం జరగలేదు. అవగాహన పరిధికి మించి ఇతర కారణాలతో హమాస్ అదనంగా 21 మంది బందీలను విడుదల చేసింది. తాజా పరిణామాల వెనుక అమెరికా మీద వస్తున్న ఒత్తిడే ప్రధాన కారణంగా కనిపిస్తున్నది. ఇజ్రాయిల్‌కు మద్దతు ఇవ్వవద్దని, మానవ హక్కుల కార్యకర్తలు, చివరికి స్వంత డెమోక్రటిక్ పార్టీ నేతలు, మద్దతుదార్ల నుంచి ఒత్తిడి వస్తున్నప్పటికీ ఖాతరు చేయకుండా కొట్టండి, నరకండి, చంపండి, నాశనం చేయండి అంటూ అక్టోబరు ఏడు నుంచి ఇజ్రాయిల్‌ను ప్రోత్సహించిన జోబైడెన్ తాజాగా సన్నాయి నొక్కులు నొక్కుతున్నాడు. ఇజ్రాయిలీ, పాలస్తీనియన్ల దీర్ఘకాల భద్రతకు రెండు దేశాలు ఏర్పడటమే హామీ ఇవ్వగలదని ట్వీట్ చేశాడు. కాల్పులను విరమించాలని డిమాండ్ చేస్తున్న అమెరికన్ పౌరుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నది. కొన్ని రాష్ట్రాల ప్రజా ప్రతినిధులతో సహా ప్రముఖులు నిరాహార దీక్షలను ప్రారంభించారు. పది లక్షల సంతకాలతో కూడిన మహజరును అందచేశారు.

ఇల్లు కాలుతుంటే బొగ్గులేరుకునే బాపతు అమెరికా అన్నది తెలిసిందే. గాజాలో పరిణామాల గురించి అది వేసుకున్న లెక్కలు తప్పాయి. ఆయుధాలు అమ్ముకోవటానికి వివాదాన్ని ప్రాంతీయ యుద్ధంగా మార్చేందుకు అది విసిరిన వలలో అరబ్బు, ఇస్లామిక్ దేశాలు పడలేదు. ప్రాణ నష్టం పరిమితంగా ఉండేట్లు చూడండి అన్న మాటలను యూదు దురహంకారులు ఖాతరు చేయలేదు. చివరికి ఆసుపత్రులు, ఐరాస సహాయ కేంద్రాలు, శరణార్థుల శిబిరాలనూ వదల్లేదు. అన్ని రకాల యుద్ధ నేరాలకు పాల్పడ్డారు. హమాస్ తీవ్రవాదులను ఏరివేసే పేరుతో ప్రారంభించిన దాడులు 70 శాతం పైగా పిల్లలు, మహిళలతో సహా 15 వేల మంది అమాయక పౌరుల ప్రాణాలు తీయటం, హమాస్ వద్ద ఉన్న బందీల జాడను కనుగొనటంలో వైఫల్యం, మరికొన్ని వేల మందిని చంపినా హమాస్ కార్యకర్తలు జాడ దొరకదనే అభిప్రాయం బలపడుతుండటంతో గౌరవప్రదంగా వెనక్కు తగ్గేందుకు అమెరికా సూచన మేరకే ఖైదీల విడుదలకు ఇజ్రాయిల్ అంగీకరించింది. సహజంగానే పాలస్తీనియన్ల వత్తిడి హమాస్ మీద కూడా పని చేసింది.

గడచిన ఏడున్నర దశాబ్దాలుగా ఇజ్రాయిల్ మూకలు ఎన్ని పాలస్తీనా విముక్తి సంస్థలను అణచివేసినా, ఎందరిని చంపినా కొత్త యోధులు ఉద్భవిస్తూనే ఉన్నారు, కొత్త సంస్థలు ఉనికిలోకి వస్తున్నాయి. అందువలన అపరిమిత బలంతో ఒకవేళ హమాస్ ను అణచివేసినా మరో కొత్త సంస్థ పుట్టుకురాదనే హామీ లేదు. గత చరిత్ర చెప్పింది అదే. దశాబ్దాల తరబడి గాజా, వెస్ట్‌బాంక్‌లను దిగ్బంధించినా, ఆక్రమించినా సాధించిందేమీ లేదు. ఇటువంటి స్థితిలో మరికొద్ది వారాల్లో అమెరికా అధ్యక్ష ఎన్నికల ప్రచారం ప్రారంభం కానున్నది. మారణకాండ కొనసాగితే సమర్థించుకోవటం మరింత కష్టం అవుతుంది. అమెరికన్లు అనేక మంది బందీలుగా ఉన్నందున వారి విడుదల వెంటనే జరగకపోతే అది ఎన్నికల అంశంగా మారినా ఆశ్చర్యం లేదు. ఇతరులను ఎంత మందిని చంపినా ఫరవాలేదన్నట్లుగా ఉండే అమెరికన్లు తమవారి దగ్గరకు వచ్చేసరికి ఒక్కరికి హాని జరిగినా తీవ్రంగా స్పందించటం తెలిసిందే. దాడులను విరమిస్తే హమాస్ పలుకుబడి పెరుగుతుందని, దాని సాయుధ విభాగం మరింత పటిష్టమౌతుందని ఇజ్రాయిల్ వెనక్కు తగ్గేది లేదని అంటున్నా బైడెన్ తన రాజకీయ ప్రయోజనాలకే పెద్ద పీట వేస్తున్నాడు. అందుకే కొత్త పల్లవి, ఇజ్రాయిల్ మీద ఒత్తిడి అన్నది స్పష్టం. గతంలో కూడా ఇలాగే కొన్ని వారాల తరువాత దాడుల నిలిపివేత, తిరిగి అణచివేత జరిగింది. ఎవరు ఎలాంటి ఉద్దేశ్యంతో ఉన్నప్పటికీ మారణకాండ నిలిపివేత పాలస్తీనియన్లకు ఉపశమనం కలిగిస్తుంది. అందుకే శాంతి శక్తులు ఒప్పందాన్ని హర్షించాయి. అది శాశ్వతంగా కుదిరితే అంతకంటే కావాల్సింది లేదు.

**- ఫీచర్స్ అండ్ పాలిటిక్స్**

**మీ వ్యాసాలు 5000 క్యారెక్టర్లు లేదా 700 పదాలు వుండాలి. పంపాల్సిన మెయిల్ :**
**editpageps@gmail.com**

సందర్భం

# వికలాంగుల సంక్షేమ లక్ష్యాలు నెరవేరేనా?



**రాజ్యాంగంలో పేర్కొన్న స్వేచ్ఛ, సమానత్వం సౌభ్రాతృత్వం వంటివి వికలాంగులకు అందని ద్రాక్షగానే మిగులుతున్నాయి. ఆర్టికల్ 14 నుండి 19 వరకు సమాజంలో పౌరులందరూ సమానమేనని, ఎలాంటి వివక్షతలు ఉండరాదని పేర్కొంది. ఇవేవీ వికలాంగులకు దక్కడం లేదు. సమాజంలో నేటికీ వారు ద్వితీయ శ్రేణి పౌరులుగానే బతకాల్సి వస్తున్నది. వికలాంగులు అంటేనే చిన్నచూపు చూస్తున్నారు. విద్య, ఉద్యోగాల్లో సైతం వివక్షత కొనసాగడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం.**

**డిసెంబర్ 3 అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం**



యం. అడివయ్య

వికలాంగులకు సమాన అవకాశాలు, హక్కులు కల్పించి వారిని సమాజాభివృద్ధిలో భాగస్వాములను చేయాలనే లక్ష్యంతో ఐక్యరాజ్యసమితి (యుఎన్‌ఓ) 1981 సంవత్సరాన్ని అంతర్జాతీయ వికలాంగుల సంవత్సరంగా ప్రకటించింది. వికలాంగులు సమాజంలో గౌరవప్రదంగా జీవిస్తూ, సకలాంగులతో సమానంగా అన్ని హక్కులు పొందే విధంగా చైతన్యపరిచేందుకు 1992 డిసెంబర్ 3 నుండి అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం జరుపుకుంటున్నాం. యుఎన్‌ఓ సభ్య దేశాలన్నీ వికలాంగుల సంక్షేమానికి చర్యలు తీసుకునే విధంగా ఐక్యరాజ్యసమితి రూపొందించిన వికలాంగుల హక్కుల ఒప్పంద పత్రంపై భారతదేశం కుడా సంతకం చేసింది. 2007 అక్టోబర్ 1న భారత ప్రభుత్వ క్యాబినెట్ సిఫార్సులతో రాష్ట్రపతి ఆమోదించారు.

ప్రపంచ వ్యాప్తంగా ప్రతి ఆరుగురిలో ఒకరికి అంగవైకల్యం ఉంది. ఆరోగ్య అసమానతల వలన అనేకమంది వికలాంగులు చనిపోతున్నారు. సమాజంలో వివక్షత, అసమాన విధానాలు ప్రజల ఆరోగ్యాన్ని నిర్ణయించే అంశాలుగా ఉన్నాయి. ఆరోగ్య సంరక్షణలో నాణ్యత లేకపోవడం, ఆరోగ్య కార్యకర్తలు తక్కువ మంది ఉండడం వంటివి వికలాంగుల జీవితాలపై ప్రభావం చూపుతున్నాయి. ఆరోగ్య అసమానతల వలన వికలాంగులు మెరుగైన వైద్యం పొందడంలో వెనకబడి ఉంటున్నారు. వారికి మెరుగైన వైద్యం అందించేందుకు మంచి ఆరోగ్యం, శ్రేయస్సు సాధించడానికి ప్రభుత్వాలు కృషి చేయాలి. ఆరోగ్య సమానత్వం వారి హక్కు. కానీ వారు హింస, అవమానాలు, అన్యాయాలకు గురవుతున్నారు. ఫిలిప్పైన్స్, ఖతార్, బెలూచిస్తాన్, పాకిస్తాన్, దుబాయ్, యూఏఈ దేశాల్లో నిర్వహిస్తున్న మోడల్ డిజెబిలిటీ సర్వేని ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాల్లో చేయాల్సిన అవసరం ఉంది. సహాయ పరికరాలు ప్రతి పది మందిలో ఒకరికి మాత్రమే అందుబాటులో ఉన్నాయని ఈ సర్వేలో తేలింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ 2030 నాటికి సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్‌ను నిర్దేశించింది. వీటి ద్వారా వికలాంగులకు మరింత మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. వికలాంగుల్లో 80 శాతం మంది అభివృద్ధి చెందిన దేశాల్లో నివసిస్తున్నారు. 60 ఏళ్లు, అంతకంటే ఎక్కువ వయసున్న వృద్ధుల్లో 46 శాతం మందికి వైకల్యం ఉందని అంచనా.

### రాజ్యాంగ ఫలాలు అందుకునే హక్కు లేదా?

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 77 ఏళ్లు, రాజ్యాంగం అమల్లోకి వచ్చి 73 సంవత్సరాలు పూర్తయింది. రాజ్యాంగంలో పేర్కొన్న స్వేచ్ఛ, సమానత్వం సౌభ్రాతృత్వం వంటివి వికలాంగులకు అందని ద్రాక్షగానే మిగులుతున్నాయి. ఆర్టికల్ 14 నుండి 19 వరకు సమాజంలో పౌరులందరూ సమానమేనని, ఎలాంటి వివక్షతలు ఉండరాదని పేర్కొంది. ఇవేవీ వికలాంగులకు దక్కడం లేదు. సమాజంలో నేటికీ వారు ద్వితీయ శ్రేణి పౌరులుగానే బతకాల్సి వస్తున్నది. వికలాంగులు అంటేనే చిన్నచూపు చూస్తున్నారు. విద్య, ఉద్యోగాల్లో సైతం వివక్షత కొనసాగడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం. ఆదివాసీ, గిరిజనులు, వికలాంగుల హక్కుల కోసం గళం విప్పిన 90 శాతం వైకల్యం కలిగిన ప్రొఫెసర్ సాయిబాబాను అరెస్టు చేసి జైల్లో పెట్టడం చూస్తున్నాం. దీంతో రాజ్యాంగం కల్పించిన భావ ప్రకటనా స్వేచ్ఛ వికలాంగులకు ఉందా అనే అనుమానం కలుగుతోంది. ఆర్టికల్ 41 ప్రకారం వికలాంగులకు ఆర్థిక స్వావలంబన కల్పించి వారిని అభివృద్ధి చేయాలని, పని కల్పించే బాధ్యత ప్రభుత్వానిదే అని పేర్కొంది. ఇవేవీ అమలు కాకపోవడం పాలకుల వైఫల్యానికి నిదర్శనం.

### విద్య, ఉద్యోగాల్లో వాటా ఎక్కడ?

విద్య, ఉద్యోగాల్లో న్యాయ మైన వాటా వికలాంగులకు దక్కకపోవడం తో అనేకమంది ఉన్నత చదువులు చదివి నిరుద్యోగు లుగా మారుతు న్నారు. 2016 వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టం ప్రకారం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగ నియామకల్లో నాలుగు శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి. వికలాంగుల కు ప్రత్యేక స్కూళ్లు, ప్రత్యేక శిక్షణ పొందిన టీచర్లను ఏర్పాటు చేయాల్సి ఉన్నా అమలు కావడం లేదు. ఆటిజం, అంధత్వం, వినికిడి సమస్యతో బాధపడే విద్యార్థులకు ప్రత్యేక పాఠశాలల్లో శిక్షణ పొందిన ఉపాధ్యాయులను నియమించాలని 2017 అక్టోబర్ 30న సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. వికలాంగులకు చదువు చెప్పేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని అత్యున్నత న్యాయస్థానం ఆదేశిస్తున్నా పాలకులకు పట్టడం లేదు. ప్రభుత్వ ఉద్యోగ నియామకల్లో ఉమ్మడి రాష్ట్రంలో జరిగినటువంటి అన్యాయమే రెండు తెలుగు రాష్ట్రాలలోనూ కొనసాగుతున్నది.

### 21 రకాల వైకల్యాల గుర్తింపు ఎప్పుడు?

2016 వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టం 21 రకాల వైకల్యాలను గుర్తించింది. కానీ వైకల్య ధృవీకరణ పత్రాలు మాత్రం 1995 పిడబ్ల్యుడి చట్టం గుర్తించిన 7 రకాల వైకల్యాలకు మాత్రమే ఇస్తున్నారు. కండరాల క్షీణత, తలసేమియా, ఆటిజం, సెరిబ్రల్‌పాల్సీ వంటి తీవ్ర వైకల్యం కలిగిన వికలాంగులు సర్టిఫికెట్లు రాక అనేక ఇబ్బందులు పడుతున్నారు. చట్టం అమల్లోకి వచ్చి 7 సంవత్సరాలు గడుస్తున్నా నేటికీ ఆ ఏడు రకాల వైకల్యాలకు మాత్రమే వైకల్య ధ్రువీకరణ పత్రాలను జారీ చేస్తున్నారు.

### అమలుకు నోచుకోని చట్టాలు

పోరాటాల ఫలితంగానే కేంద్ర ప్రభుత్వం వికలాంగుల సంక్షేమం కోసం అనేక చట్టాలను చేసింది. 2016 వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టం, 2017 ఇంటర్ హెల్త్ కేర్, నేషనల్ ట్రస్ట్, ఆటిజం యాక్ట్, ఐక్యరాజ్యసమితి హక్కుల ఒప్పందం వంటి అనేక చట్టాలు దేశంలో వికలాంగుల సంక్షేమం కోసం అమలులో ఉన్నాయి. కానీ దేశ పాలకులకు చట్టాలను అమలు చేయాలనే చిత్తశుద్ధి కనిపించడం లేదు. పెట్టుబడిదారులకు సానుకూల వాతావరణం కల్పించాలనే పేరుతో కార్మిక చట్టాలను సవరించి నాలుగు లేబర్ కోడ్స్‌గా అమల్లోకి తీసుకొచ్చిన కేంద్ర ప్రభుత్వం వికలాంగుల చట్టాలను కూడా మార్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నది. 2016 వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టంలోని సెక్షన్ 89, 92, 93 రద్దు చేసేందుకు, 1999 నేషనల్ ట్రస్టు సవరించేందుకు, దేశవ్యాప్తంగా ఉన్న తొమ్మిది నేషనల్ ఇన్‌స్టిట్యూషన్లను విలీనం కావించేందుకు చేసిన ప్రయత్నాలను ఎన్‌పిఆర్‌డి దేశ వ్యాప్త పోరాటాల ద్వారా తిప్పికొట్టింది.

### 'సుగమ్య అభియాన్ భారత్' ప్రచారం కోసమేనా!

సామూహిక ప్రాంతాలను వికలాంగులు వినియోగించుకునే విధంగా మార్చాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం 'సుగమ్య అభియాన్ భారత్' పథకాన్ని ప్రవేశపెట్టింది. 2022 నాటికి దేశవ్యాప్తంగా ఉన్న ప్రధాన పట్టణాల్లో సగం వరకైనా అవరోధరహితంగా మార్చాలని నిర్దేశించిన లక్ష్యం నెరవేరలేదు. నేటికీ సామూహిక ప్రాంతాలు వికలాంగులకు అందనంత దూరంలో ఉన్నాయి. ప్రధానమంత్రి వికలాంగులను దివ్యాంగులుగా నామక రణం చేశారు. పేరు మార్చినంత మాత్రాన వికలాంగులకు ఒరిగిందేమీ లేదనే విషయం ప్రభుత్వాలు గుర్తించాలి.

### ఐక్య పోరాటాలతోనే హక్కుల సాధన

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వికలాంగుల వ్యతిరేక విధానాలపై ప్రపంచ వికలాంగుల దినోత్సవ స్ఫూర్తితో ఉద్యమించాలి. దేశవ్యాప్తంగా ఒకే పెన్షన్ విధానం, రైల్వేలో సౌకర్యాలు, అంత్యోదయ రేషన్ కార్డులు, నామినేటెడ్ పదవులలో రిజర్వేషన్లు, సామాజిక భద్రత, స్వయం ఉపాధి, మహిళా వికలాంగుల రక్షణ వంటి సమస్యలపై ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**/ వ్యాసకర్త ఎన్‌పిఆర్‌డి జాతీయ ఉపాధ్యక్షుడు, సెల్ : 9490098713 /**

# కదం తొక్కిన విద్యార్థులు

- ఫలించిన ఎస్ఎఫ్ఐ సైకిల్ యాత్ర, దీక్షల పోరాటం
- స్థానిక సమస్యలు పరిష్కరిస్తాం : ఇన్‌ఛార్జి డిఆర్ఓ
- 6న విద్యాశాఖ అధికారులతో చర్చలకు హామీ

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

విద్యారంగ సమస్యలపై ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన గతంలో సైకిల్‌యాత్ర చేపట్టిన విద్యార్థులు ఇటీవల వారం రోజుల పాటు కలెక్టరేట్ వద్ద నిరాహారదీక్షలు చేపట్టారు. గురువారం చేపట్టిన మహాధర్నాకు అధికారులు స్పందించి జిల్లాలోని విద్యారంగ సమస్యపై డిసెంబర్ 6న శాఖ అధికారులతో చర్చించి, స్థానికంగా ఉన్న సమస్యలను సత్వరమే పరిష్కారానికి హామీ ఇచ్చారు. దీంతో ఆందోళనను విరమించారు. తొలుత ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి మెయిన్ రోడ్డు మీదుగా కలెక్టరేట్ వరకూ పెద్ద ఎత్తున విద్యార్థులు ర్యాలీ నిర్వహించి, అనంతరం కలెక్టరేట్ ఆవరణలో ధర్నా చేపట్టారు. ధర్నానుద్దేశించి ఎస్ఎఫ్ఐ రాష్ట్రకమిటీ సభ్యులు సిహెచ్.వెంకటేష్ మాట్లాడుతూ విద్యాశాఖ ఉన్నతాధికారులు సంక్షేమ హాస్టళ్లకు, విద్యాసంస్థలను సందర్శించే పరిస్థితి లేదని, ఆ పని ఎస్ఎఫ్ఐ చేస్తూ పరిశీలించిన సమస్యల్ని పరిష్కారం చేయాలంటే అధికారులు ముందుకు రాకపోవడం దుర్మార్గమని అన్నారు. కనీసం విద్యార్థులకు మరుగుదొడ్లు కూడా లేకపోవడం బాధాకరమని, వసతిగృహాలకు సొంత భవనాల్లేక చాలీచాలని గదుల్లో కొట్టుమిట్టాడుతున్న పరిస్థితి జిల్లాలో ఉందని తెలిపారు. విద్యార్థులు కోరుతుంది గొంతమ్మ కోరికలు కావాలని, వారి విద్యాభివృద్ధికి చేస్తున్న పోరాటాలని, వాటిని వెంటనే పరిష్కరించాలని చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డి.పండు, పి.రాజశేఖర్ మాట్లాడుతూ పోరాటమే సరైన మార్గమన్న నినాదం ఈ పోరాటం ద్వారా రుజువైందని అన్నారు. జిల్లా ఏర్పడి రెండేళ్లవుతున్నా కనీసం మౌలికసదుపాయాలు కల్పించకపోవడం దారుణమని, అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం అందించే అరకొర మెస్ చార్జీలతో విద్యార్థులకు పౌష్టికమైన ఆహారం అందడం లేదని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచాలని, బకాయి మెస్ బిల్లులు విడుదల చేయాలని, పార్వతీపురంలో గల బిసి, ఎస్‌సి పోస్ట్‌మెట్రిక్ హాస్టళ్లకు సంత భవనాలు ఏర్పాటు చేయాలని, సాలూరు పోస్టు మెట్రిక్ బాయ్స్ హాస్టలుకు రోడ్ సౌకర్యం కల్పించాలని, గర్ల్స్ పోస్టుమెట్రిక్ హాస్టల్‌కు, పాలకొండ పోస్టుమెట్రిక్ హాస్టలకు సొంత భవనాలు నిర్మించాలని, వీరగొట్టం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సొంత భవనం ఏర్పాటు చేయాలని, పార్వతీపురంలో మెడికల్, ఐటిఐ, పిజి, సాలూరులో బిఇడి, పాలకొండలో పిజి గుమ్మలక్ష్మీపురం డైట్ కళాశాలలు నిర్మించాలని, కురుపాం ఇంజనీరింగ్ కళాశాల భవనం పనులు పూర్తి చేయాలని, గరుగుబిల్లి, సీతంపేట మండలాల్లో జూనియర్ కళాశాలలు నిర్మాంచాలని, బలిజిపేట, కురుపాం, భామిని, పాచిపెంట మండల కేంద్రాల్లో డిగ్రీ కళాశాలలు నిర్మించాలని, కొమరాడ, సీతానగరం, వీరఘట్టాం, మక్కువ, పాచిపెంట, భామిని, బలిజిపేట మండలాల్లో పోస్టు మెట్రిక్ హాస్టళ్లను నిర్మించాలని, పాలకొండ డిగ్రీ కళాశాలకు ప్రహరీ గోడ నిర్మించాలని, సాలూరు కేంద్రంలో ఆశ్రమ పాఠశాల నిర్మించాలని, పాఠశాల, సంక్షేమ హాస్టళ్లకు సరిపడ్డ పర్మినెంట్ వర్కర్స్, వార్డలను నియమించాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లపై స్పందించిన జాయింట్ కలెక్టర్ గోవిందరావు, డిఆర్ఓ ఇంచార్జ్ తో స్పష్టమైన హామీ, చర్చలు జరిపేందుకు తేదీ తెలియజేయక పోవడంతో విద్యార్థులంతా ఆగ్రహించి, కలెక్టర్ కార్యాలయం ఆవరణలోనే బైఠాయించారు. పోలీసులకు, విద్యార్థులకు కొంత ఘర్షణ జరిగిన అనంతరం, డిసెంబర్ 6 బుధవారం విద్యాశాఖ సంబంధిత అధికారులతో చర్చలకు ఎస్ఎఫ్ఐ నాయకులను ఆహ్వానిస్తున్నట్టు ఇన్‌ఛార్జి డిఆర్ఓ కేశవ నాయుడు ద్వారా సమాచారాన్ని అందించారు. పోరాట విజయంగా భావించి విద్యార్థులు ఆందోళనను విరమించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు కె.రాజు, సింహాచలం, గంగారాం, వరుణ్ పెద్దఎత్తున విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.
















## జాతీయ సైన్స్ కాంగ్రెస్‌కు 'పులసను సంరక్షించు కుందాం' ఎంపిక

ప్రజాశక్తి-అమలాపురం

రాష్ట్రస్థాయి సైన్స్ కాంగ్రెస్ ప్రదర్శనలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా సంచలనం సృష్టించిందని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.కమల కుమారి గురువారం తెలిపారు. విజయవాడలోని కెఎల్ యూనివర్సిటీ నందు జరిగిన రాష్ట్రస్థాయి సైన్స్ కాంగ్రెస్ నందు రాష్ట్రవ్యాప్తంగా 1084 ప్రాజెక్టులను ప్రదర్శించారని ఆమె తెలిపారు. వాటి నుంచి మొదటి 17 స్థానాలు గెలిచిన ప్రాజెక్టులు జాతీయస్థాయి సైన్స్ కాంగ్రెస్ కి ఎంపికయ్యాయని తెలిపారు. సమనస నందు గల ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థి చైతన్య దీపిక, గైడ్ టీచర్ సుభాషిని ఆధ్వర్యంలో నిర్వహించిన మన కోనసీమ సంపద పులసను సంరక్షించు కుందాం అనే ప్రాజెక్టు జాతాయ స్థాయికి ఎంపికైందని ఆమె తెలిపారు. చైతన్య దీపికకు ఎస్‌సిఇఆర్టీ డైరెక్టర్ ప్రతాపరెడ్డి, మెంబర్ సెక్రటరీ ఆఫ్ కాస్ట్ అపర్ణ, రాష్ట్ర సైన్స్ సిటీ కోఆర్డినేటర్ జయరాం రెడ్డి, కెఎల్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ జగన్నాథరావు చేతుల మీదగా నగదు పురస్కారం ట్రోఫీ అంద జేశారన్నారు. ఈ విద్యార్థిని త్వరలో జరగబోయే జాతీయస్థాయి సైన్స్ కాంగ్రెస్ దినోత్సవం లో పాల్గొనవలసి ఉంటుందని వాటికి సంబంధించిన వివరాలు త్వరలో వెల్లడిస్తామని జిల్లా సైన్స్ అధికారి జివిఎస్.సుబ్రహ్మణ్యం తెలియజేశారు. జాతీయస్థాయి ఎంపికైన ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఉపాధ్యాయ బందాన్ని మరియు విద్యార్థిన్ని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.కమల కుమారి, జిల్లా సైన్స్ అధికారి జివిఎస్.సుబ్రహ్మణ్యం, జిల్లా ఎకాడమిక్ కోఆర్డినేటర్ బ్రహ్మానందం, జిల్లా ఉప విద్యాశాఖ అధికారి ఫణిబాల లక్ష్మీనరసింహ, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ సురేష్, బి.రమణశ్రీ అభినందించారు.

## ప్రతిభాపాటవాల వెలికితీతకు బాలోత్సవాలు దోహదం

- ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ
- తణుకు బాలోత్సవాల బ్రోచర్, పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - తణుకురూరల్ (పశ్చిమగోదావరి జిల్లా)

విద్యార్థినీ, విద్యార్థుల్లో ప్రతిభాపాటవాలను వెలికి తీసేందుకు బాలో త్సవాలు దోహదం చేస్తాయని ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ అన్నారు. గురువారం శ్రీశ్రీ సేవా విజ్ఞాన కేంద్రంలో జరిగిన సమావేశంలో బాలోత్సవాల బ్రోచర్‌ను, పోస్టర్‌ను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా సాబ్జీ మాట్లాడుతూ ఉపాధ్యాయులు, తల్లిదండ్రు లు పిల్లలను ప్రోత్సహించాలని కోరారు. ప్రయివేటు పాఠశాలల అసోసియేషన్ (అపుస్మా) తణుకు జోన్ అధ్యక్షులు పెన్మెత్స రామరాజు మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న అభిరుచులను, సృజనాత్మకత వెలికితీతకు తణుకు బాలోత్సవాలు ప్రాధాన్యతనిస్తున్నాయన్నారు. వ్యాసరచన, వక్తృత్వం, స్పెల్‌బి, క్విజ్, మెమరీ టెస్ట్, చిత్రలేఖనం వంటి అకడమిక్ అంశాలు, దేశభక్తి, అభ్యుదయ గీతాలాపన, శాస్త్రీయనృత్యం, కోలాటం తదితర సాంస్కృతిక అంశాల్లో ఈ ప్రదర్శనలు జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అపుస్మా తణుకు శాఖ కార్యదర్శి రాజశేఖర్, కోశాధికారి నగేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు విద్యాకాంత్, పలు పాఠశాలల యాజమాన్య ప్రతినిధులు, శ్రీశ్రీ సేవావిజ్ఞాన కేంద్రం బాధ్యులు, బాలోత్సవం ప్రధాన కార్యదర్శి పి.దక్షిణామూర్తి, ఆర్గనైజింగ్ కార్యదర్శి పిఎల్.నరసింహారావు, ప్రగతి విద్యా సంస్థల డైరెక్టర్ ప్రగతి రాజా పాల్గొన్నారు.

# నాలుగు నెలల్లో రూ. లక్ష కోట్లు!

## సమీకరణకు ఆర్థికశాఖకు ప్రభుత్వ ఆదేశం



**ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి**

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరి నాలుగు నెలల్లో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు కోసం కనీసం లక్ష కోట్ల రూపాయలు అవసరమవుతాయని రాష్ట్ర ప్రభుత్వం అంచనా వేసింది. ఈ మొత్తాన్ని ఎలాగైనా సమీకరించాలని ఆర్థికశాఖను ఆదేశించింది. దీంతో ఈ మేరకు ఉన్న అవకాశాలపై ఆర్థిక శాఖకు చెందిన ఉన్నతాధికారులు కసరత్తు చేస్తున్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం కొద్ది రోజుల క్రితం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నిర్వహించిన ఉన్నత స్థాయి సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. సాధారణ ఎన్నికలు సమీపిస్తుండటంతో పథకాల అమలులో ఏ మాత్రం నిర్లక్ష్యం ఉండకూడదని ఈ సమావేశంలో సిఎం ఆదేశించినట్లు తెలిసింది. దీంతో ఆర్థికశాఖ ఉన్నతాధికారులతో పాటు, ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరిస్తున్న మరికొందరు కూడా నిధుల సమీకరణపై దృష్టి సారించినట్లు తెలిసింది. లక్ష కోట్ల రూపాయలకన్నా మరికొంత ఎక్కువ మొత్తమే అవసరమౌతుందన్న అభిప్రాయాన్ని వీరు వ్యక్తంచేస్తున్నట్లు సమాచారం. కొన్ని పథకాలు ఇప్పటివరకు పూర్తిస్థాయిలో అమలు కాలేదని, మరికొన్ని పథకాల్లో రకరకాల పేర్లతో లబ్ధిదారులను కుదించారని, అటువంటి లోపాలన్నింటిని తక్షణమే దిద్దుకోవాలని వివిధ ప్రభుత్వ శాఖలకు కూడా ఆదేశాలు వెళ్లినట్లు తెలిసింది.

ముఖ్యంగా సామాజిక ఫించన్లు ఏ కారణంతోనైనా అందడం లేదన్న ఫిర్యాదు లబ్ధిదారుల నుండి రాకూడదని ప్రభుత్వం భావిస్తున్న ట్లు సమాచారం. దీంతో వివిధ సంక్షేమ పథకాల లబ్ధిదారుల సంఖ్య కూడా రానున్న నాలుగు నెలల్లో పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. దీనిని కూడా దృష్టిలో పెట్టుకుని నిధుల కొరత లేకుండా చూడాలని ఆర్థికశాఖకు సూచించినట్లు తెలిసింది.

**ఫిబ్రవరిలో నోటిఫికేషన్...?**

ఐదు రాష్ట్రాల ఫలితాలు వెలువడిన తరువాత సాధారణ ఎన్నికలపై కేంద్రం దృష్టి సారించే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు భావిస్తున్నాయి. ఫిబ్రవరి నెలాఖరులోగా ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉందని వీరి అంచనా! దీనిని దృష్టిలో ఉంచుకుని పూర్తిస్థాయిలో పథకాలు అందించాలని ప్రభుత్వం భావిస్తోంది.

**అంత ఆదాయం ఎలా!**

అక్టోబర్ వరకు పరిశీలిస్తే అనుకున్న ఆదాయం కన్నా తక్కువగానే రికార్డయింది. రాష్ట్ర, కేంద్ర నిధులతో కలిపి 2.60 లక్షల కోట్లు రావాల్సి ఉంటుందని అంచనా వేయగా, తొలి ఏడు నెలలకు లక్ష కోట్లుకన్నా తక్కువగానే వచ్చింది. ఇక మిగిలిన ఐదు నెలల్లో 1.10 లక్షల కోట్లు రావాల్సి ఉంటుందని చెబుతున్నారు. అనుకున్నట్లుగా ఆ మొత్తం ఆదాయం లభించినా కూడా చివరి నెలల్లో ఖర్చులు గణనీయంగా పెరుగుతాయని, అందుకే ఆ నిధులు ఎంతమాత్రం చాలవని ఆర్థికశాఖ అధికారులు అంటున్నారు.

# విద్యార్థుల అరణ్య రోదన

### పట్టించుకోని బెస్టూ యాజమాన్యం

### అనుమతుల్లేని భవనంలోనే క్యాంపస్



**ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి**

బెస్టూ యూనివర్శిటీ యాజమాన్యం విద్యార్థుల సమస్యను పట్టించుకుంటున్న దాఖలాల్లేవు. అనంతపురం నగరంలోనే క్యాంపస్ ఉంటుందని చెప్పి అడ్మిషన్లు చేసుకున్నాక..మకాంను తిరిగి గోరంట్ల మండలం గౌనివారిపల్లి గ్రామానికి తరలించే ప్రయత్నంలో వెనుకడుగు వేసిన దాఖలాల్లేవు. విద్యార్థులు వారం రోజులుగా నిరసనలు చేపట్టినా జిల్లా కలెక్టరు దృష్టికి తమ సమస్యను తీసుకెళ్లినా ఫలితం కనిపించడం లేదు. ఎందుకంటే ప్రయివేటు యూనివర్శిటీ లపై స్థానికంగా ఎవరి అజమాయిషీ ఉండే అవకాశం లేదు. కేంద్ర ప్రభుత్వ స్థాయిలోనే జరగాల్సి ఉంది. దీంతో యజమాన్యం ఇష్టమెచ్చినట్టుగా వ్యవహరి స్తోంది. దీంతో విద్యార్థుల భవితవ్యం అగమ్య గోచరంగా మారింది.

**విద్యార్థులతో ఒక మాట... యుజిసి వద్ద మరో మాట**

విద్యార్థులకేమో అనంతపురం జిల్లా కేంద్ర పరిధిలోని అక్కంపల్లి వద్దనున్న ఒక ప్రయివేటు ఇంజనీరింగు కళాశాల భవనాన్ని క్యాంపస్‌గా చూపించింది. అయితే యుజిసి పరిశీలనకు వచ్చినప్పుడు మాత్రం గోరంట్లలోని గౌనివారిపల్లిలో చూపించింది. 2022 జులై నెలలో యుజిసి కమిటీ యూనివర్శిటీని తనిఖీ చేసి అంతా భేష్‌గా ఉందని కితాబునిచ్చింది. తాము సంతృప్తిగానున్నట్టు కమిటీ ముందు విద్యార్థులు చేప్పే విధంగా ఏర్పాట్లు చేశారు. అయితే వాస్తవ పరిస్థితి మాత్రం అందుకు భిన్నంగా ఉంది. విద్యార్థులు గౌనివారిపల్లిలో ఎటువంటి సౌకర్యాలు లేవని ఇబ్బందులు పడుతున్నారు. ఇదే విషయాన్ని విద్యార్థులు చెబుతున్నారు.

**అనుమతుల్లేని భవనంలో క్యాంపస్**

అనంతపురం నగరంలో ఇప్పుడు నడుస్తున్న క్యాంపస్ ఒక ప్రయివేటు ఇంజనీరింగు కళాశాలకు సంబంధించినది. ఇంటెల్ ఇంజనీరింగు కళాశాల భవనముంది. ఇప్పటికీ అదే కళాశాల పేరుతోనే భవనముంది. ఒకవేళ ఈ భవనం మరో కార్యకలాపాలకు వినియోగించాలంటే ఇంటెల్ యాజమాన్యం అనంతపురం జెఎన్‌టియుకు క్లోజర్ నోటీసును అందజేయాల్సి ఉంటుంది. ఇక తాము ఈ భవనంలో కళాశాల నిర్వహించడం లేదని తెలియజేయాల్సి ఉంటుంది. కాని ఇప్పటికీ ఆ యాజమాన్యం జెఎన్‌టియుకు అటువంటి సమాచారమేదీ ఇవ్వలేదు. అటువంటి భవనంలోనే ఇప్పుడే బెస్టూ యూనివర్శిటీ క్యాంపస్ ఏ రకంగా నిర్వహిస్తోందన్నది ప్రశ్నార్థకంగా మారింది. దీనికి ప్రభుత్వం వైపు నుంచి ఎటువంటి అనుమతులు ఉన్నాయన్నది కూడా ప్రశ్నార్థకంగా మారింది.

# పడకేసిన పారిశుద్ధ్యం

- సిసి రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

**ప్రజాశక్తి - సంజామల**

దేశానికి పట్టుకొమ్మలు గ్రామాలు.. గ్రామాలు అభివృద్ధి చెందాలనే ఆశయంతో స్వచ్ఛభారత్ కార్యక్రమానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు శ్రీకారం చుట్టాయి. ఆచరణలో క్షేత్రస్థాయిలో మాత్రం గ్రామాల్లో పారిశుధ్యం పడకేసింది. సంజమాల మండలంలోని అనేక గ్రామాల్లో వీధులు అపరిశుభ్రంగా మారి దుర్వాసన వెదజల్లుతున్నాయి. సిసి రోడ్లపై నీరు చేరి అపరిశుభ్రంగా మారాయి. సంజామల మండలంలోని రామిరెడ్డి పల్లె, ఎగోని, సంజామల, లింగందిన్నె, ఆలవకొండ తదితర గ్రామాలలో పరిశుభ్రత లోపించింది. సిసి రోడ్లకు ఇరువైపులా డ్రెయినేజీ కాల్వలు లేకపోవడంతో మురుగునీరు ఎక్కడికక్కడే నిలిచిపోతుంది. మురుగునీటిలో దోమలు వృద్ధి చెంది ప్రజలపై దాడి చేస్తుండడంతో అనారోగ్యం పాలవుతున్నారు. సిమెంట్ రోడ్లు ఉన్నా సైడ్ కాలవలు లేకపోవడంతో ప్రజలు రోడ్డుపై నిలిచిన మురుగునీటిలోనే నడుచుకుంటూ వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. మురుగునీటిలో చిన్న పిల్లలు, వృద్ధులు జారీ కింద పడిన సంఘటన ఉన్నాయని ఆయా గ్రామాల ప్రజలు చెబుతున్నారు. మరికొన్ని గ్రామాలలో డ్రైనేజీ కాలువలు ఉన్నా పూడిక తీయకపోవడంతో చెత్తాచెదారంతో నిండిపోయి నీరు రోడ్లపైనే పారుతుంది. సంజామలలోని గొల్ల వీధిలో, యగ్గోని గ్రామం ప్రధాన రహదారిలో, రామిరెడ్డి పల్లె గ్రామంలోని ప్రధాన రహదారిలో మురుగునీరు పారుతోంది. ప్రజలు నడవడానికి కూడా వీలు లేకుండా ఉండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలపై వెళ్ళాలన్నా ప్రజలు భయపడుతున్న పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సిసి రోడ్లకు ఇరువైపులా డ్రెయినేజీ కాల్వలు నిర్మించాలని, డ్రెయినేజీల కాల్వలను శుభ్రం చేయించి మురుగునీటి సమస్యను పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



# రెక్కల కష్టం బుగ్గిపాలు

- పెద్ద బొడ్డపాడులో అగ్ని ప్రమాదం
- ఎకరా వరి, 25 ఎకరాల్లో వరిగడ్డి దగ్ధం

**ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు**

ఆరుగాలం కష్టించి పండించిన పంట ఫలసాయం ఒక్క క్షణంలోనే అగ్నికి ఆహుతైంది. సకాలంలో వర్షాల్లేక ఇంజిన్లు పెట్టి సాగు చేసినా ఫలసాయం పొందే సమయంలో సంభవించిన అగ్ని ప్రమాదం అన్నదాతలను తేరుకోలేకుండా చేస్తుంది. పండించిన పంట, పశువుల మేత కోసం ఉంచిన గడ్డి కళ్లెదుటే అగ్నికి ఆహుతి కావడంతో ఆ రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. మండలంలోని పెద్దబొడ్డపాడులో అగ్ని ప్రమాదంలో ఎకరా మేర పొలాల్లోని వరి చేను, ఓవులు, 25 ఎకరాల్లో వరి గడ్డి దగ్ధమైంది. గ్రామానికి చెందిన జీలుగు చెరువులో ఉపాధి పనులు చేపడుతున్నారు. చెరువులోని ముళ్లపొదలు, పిచ్చి మొక్కలు తీసి పోగుగా వేసి వాటికి మంట పెట్టారు. గాలికి నిప్పురవ్వలు పరిస రాల్లోని పంట పొలాల్లోని కోసిన గడ్డిపై పడడంతో మంటలు వ్యాపించాయి. దీంతో పొలాల్లో ఉన్న రైతులు పరుగులు తీశారు. ఈ ప్రమాదంలో దుంపల గంగారాం, కొండల బలుసుకు చెందిన ఎకరా వరి చేను కాలిపోయాయి. బమ్మిడి భాస్కరరావు, దుంపల ముఖలింగం, తమ్మినాన తాతయ్య, తమ్మినాన రంగారావు, దుంపల రామయ్య, ఉప్పాడ సింహాచలం, ఉప్పాడ ధర్మారావు, దుంపల ప్రకాశరావు, జగదీష్ తదితర రైతులకు చెందిన సుమారు 25 ఎకరాల్లో వరి గడ్డి బూడిదైంది. కాశీబుగ్గ అగ్నిమాపక కేంద్రానికి స్థానికులు సమాచారం ఇవ్వడంతో సిబ్బంది చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. మంటల్లో బమ్మిడి భాస్కరరావుకు చెందిన ఆయిల్ ఇంజిన్ సెక్షన్ పైప్ కాలి బూడిదైంది. వంశధార నీరు శివారు భూములకు రాకపోయినా బెండిగెడ్డలో ఆయిల్ ఇంజిన్లకు పైపులు అమర్చి రైతులు పంటకు నీటితడులు అందించారు. బెండిగెడ్డలోని సముద్రపు పోటు ఉప్పునీరు పెడితే పొలం సారం దెబ్బతింటుందని వ్యవసాయా ధికారులు హెచ్చరించినా, కళ్లెదురుగా పంటను వదిలేయలేక సాగుచేశారు. ఇన్ని కష్టాలు పడి చివరికి ఫలసాయం చేతికందివచ్చిన సమయంలో అగ్నికి ఆహుతి కావడంతో బాధిత రైతులు రోదిస్తున్నారు. సుమారు రూ.మూడు లక్షల వరకు నష్టం సంభవించి ఉంటుందని అంచనా వేస్తున్నారు. అగ్ని ప్రమాదంలో నష్టపోయిన బాధిత రైతులను ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# నిలకడగా నిరుద్యోగం

- సరైన ఉద్యోగాలు కల్పించలేక పోతున్న ఆర్థిక వ్యవస్థ
- స్వయం ఉపాధిని వెతుక్కుంటున్న యువత



**న్యూఢిల్లీ :** దేశంలో నిరుద్యోగం ఏ మాత్రం తగ్గడం లేదు. ఈ సమస్యను పరిష్కరించేందుకు పలు పథకాలు, కార్యక్రమాలు అమలు చేస్తున్నామని నరేంద్ర మోడీ ప్రభుత్వం ఎంతగా గొప్పలు చెప్పుకుంటున్నప్పటికీ ఆశించిన పురోగతి కన్పించడం లేదు. ఈ త్రైమాసికంలో 6.6%గా నమోదైన నిరుద్యోగ రేటు కార్మిక మార్కెట్లలో క్షీణతను ప్రతిబింబిస్తోంది. పట్టణ ఆర్థిక వ్యవస్థ యువతకు అవసరమైన ఉద్యోగాలు కల్పించలేక పోతోందని చెప్పడానికి ఈ క్షీణత నిదర్శనం.

**పీఎల్ఎఫ్ఎస్ ఏం చెప్పింది?**

జాతీయ శాంపిల్ సర్వే కార్యాలయం (ఎన్ఎస్ఎస్ఓ) నిర్వహించిన పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే (పీఎల్ఎఫ్ఎస్) వివరాలను కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ బుధవారం విడుదల చచేసింది. దీని ప్రకారం 2021-22 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసిక (ఏప్రిల్-జూన్) కాలంలో...అంటే కోవిడ్ సమయంలో పట్టణ ప్రాంతాల్లో నిరుద్యోగ రేటు అధికంగా 12.6%గా నమోదైంది. కాగా ఈ ఏడాది జూలై-సెప్టెంబర్ మధ్య కాలంలో పురుషులలో నిరుద్యోగ రేటు స్వల్పంగా పెరిగి 6%నికి చేరింది. అంతకుముందు త్రైమాసిక కాలంలో అది 5.9%గా నమోదైంది. మహిళలలో నిరుద్యోగ రేటు 9.1% నుండి 8.6%కి తగ్గింది. యువతలో (15-29 సంవత్సరాల మధ్య వయస్కులు) నిరుద్యోగ రేటు 17.6% నుండి 17.3%కి తగ్గింది. కార్మికుల భాగస్వామ్య రేటు (ఎల్ఎఫ్‌పీఆర్-పట్టణ ప్రాంతాల్లో పని చేస్తున్న వారు, పని కోసం ఎదురు చూస్తున్న వారు) 48.8% నుండి 49.3%కి పెరిగింది. పురుషులతో పాటు మహిళలు కూడా పని చేసేందుకు ఆసక్తి చూపారు. అయితే ఇక్కడ గమనించాల్సిన విషయమేమంటే ఈ ఉత్సాహం వారికి మంచి ఉద్యోగాలు కల్పించలేకపోయింది. వేతనాలు అందుకునే ఉద్యోగాలు చేస్తున్న పురుషుల వాటా 47.8% నుండి 47%కి, మహిళల వాటా 54% నుండి 52.8%కి తగ్గిపోయింది. ఉద్యోగాలు లభించని చాలా మంది స్వయం ఉపాధి కోసం దారులు వెతుక్కున్నారు. కుటుంబం నిర్వహించే వ్యాపార కార్యకలాపాలలో ఎలాంటి వేతనం తీసుకోకుండా పనిచేస్తున్న వారు కూడా ఇందులో ఉన్నారు. మరో ఆసక్తికరమైన విషయమేమంటే మహిళల్లో దినసరి కార్మికుల సంఖ్య ఈ ఏడాది తొలి త్రైమాసికంలో 6.8% ఉండగా అది రెండో త్రైమాసికంలో 6.9%కి పెరిగింది.

**వ్యవసాయమే ఆధారమైంది**

రెండో త్రైమాసిక కాలంలో ఉపాధి అవకా శాలు పెరిగాయని, నిరుద్యోగం తగ్గిందని గొప్ప లు చెప్పుకోవడంలో అర్థమే లేదు. ఎందుకంటే వ్యవసాయ రంగంలోనే ఎక్కువ మందికి ఉపాధి అవకాశాలు లభించాయి. తొలి త్రైమాసికంలో ఈ రంగంలో 5.4% మంది ఉపాధి పొందగా రెండో త్రైమాసికంలో ఆ సంఖ్య 6.1%కి పెరిగింది. అదే సమయంలో సెకండరీ రంగంలో ఉద్యోగుల వాటా 33.1% నుండి 32.4%కి తగ్గిపోయింది. రెండో త్రైమాసిక కాలంలో దేశంలో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో వ్యవసాయ పనులు ముమ్మరమ య్యాయి. ఫలితంగా ఆ రంగంలో చాలా మందికి ఉపాధి లభించింది.


**తగ్గిన ఈపీఎఫ్ చందాదారులు**

ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్ఓ) గత వారం విడుదల చేసిన వివరాల ప్రకారం వరుసగా రెండో నెలలోనూ ఉద్యోగాల కల్పన తగ్గిపోయింది. సెప్టెంబర్‌లో ఇది ఆరు నెలల కనిష్ట స్థాయికి చేరింది. ఈపీఎఫ్ చందాదారుల సంఖ్య ఆగస్టులో 9,53,092 ఉండగా సెప్టెంబర్‌లో 8,91,583కు తగ్గింది. పదిహేను సంవత్సరాల వయసు పైబడిన వారిలో పట్టణ ప్రాంతాల్లో కార్మికుడు-జనాభా నిష్పత్తి (జనాభాలో ఉద్యోగుల శాతం) గత సంవత్సరం జూలై-సెప్టెంబర్ మధ్య కాలంలో 44.5% ఉండగా ఈ ఏడాది అదే కాలంలో 46%కి పెరిగింది.



# విద్యుత్ శాఖలో అక్రమాలు

- మంజూరు ఒకరికి... కనెక్షన్ మరొకరికి
- మామూళ్లు ఎవరిస్తే వారికి కనెక్షన్




**ప్రజాశక్తి -కణేకల్లు**

కణేకల్లు విద్యుత్ శాఖలో వ్యవసాయ కనెక్షన్ల అక్రమాలు భారీ సంఖ్యలో వెలుగుచూస్తున్నాయి. తవ్వే కొద్దీ అక్రమాలు ఒక్కొక్కటి వెలుగు చూస్తున్నాయి. బాధితులు వందకు పైగా ఉన్నారు. కనెక్షన్ ఒకరికి మంజూరైతే.... మరొకరికి కనెక్షన్ కట్టబెట్టారు. అయితే ఆన్‌లైన్‌లో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ మంజూరైన వారికే సర్వీసు నెంబర్ కేటాయింపు జరిగి బిల్లులు రావటంతో బాధితులు అవాక్కవుతున్నారు. రైతుల ఫోన్లకు కరెంటు బిల్లుల మేసేజ్‌లు రావటం, బిల్లు కట్టమని ఇఆర్ఒ ఆఫీసు నుండి డిమాండ్ నోటీసులు వస్తుండటంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. 'ఈ బిల్లులేంటీ? మాకెప్పుడు ట్రాన్స్ ఫార్మార్లు ఏర్పాటు చేశారు?' అంటూ రైతులు ఆందోళన చెందుతున్నారు. ఒకరికి మంజూరైన వ్యవసాయ కనెక్షన్‌ను మరొకరికి ఏర్పాటు చేశారు. ఇది సంబంధిత కాంట్రాక్టరు, ఆ శాఖ అధికారులు కుమ్మక్కై రైతులకు అన్యాయం చేశారని బాధితులు వాపోతున్నారు.

కణేకల్ మండలంలో 'విద్యుత్ శాఖ లో జరిగిన అక్రమాలపై 'ప్రజాశక్తి' జరిపిన విచారణలో అనేక కొత్త విషయాలు వెలుగు చూశాయి. ఈ ప్రాంతంలో వ్యవసాయ కనెక్షన్ల కోసం భారీగా డిమాండ్ ఉంది. రైతులు బోర్ల కింద వివిధ రకాల పంటలను సాగు చేయడానికి వ్యవసాయ కనెక్షన్ల కోసం ఆత్రుతతో ఎదురు చూడటం పరిపాటి. వ్యవసాయ కనెక్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్నా సీనియారిటీలో చాలా వెనుకబడి ఉంటారు. వీరికి కనెక్షన్ మంజూరు కావాలంటే కొంత సమయం పడుతోంది. ఇలా అవసరమున్న రైతుల బలహీనతను కాంట్రాక్టర్, కొందరు స్వార్థపూరిత అధికారులు సొమ్ము చేసుకుంటున్నారు. సీనియారిటీ కంటే ముందుగా కరెంటు కనెక్షన్లు ఇస్తామని చెప్పి వారి నుంచి అందినకాడికి దండుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. అమాయక రైతులను గుర్తించి వారికి మంజూరైన విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, వైర్లు, షిన్ ఇన్స్యులేటర్లు, 11కేవీ యాయాంగ్లర్లు, 11కేవీ టాపింగ్ ఛానల్లు, క్లాంప్లు, నట్టు, బోల్టులు, అర్త్ వైర్, డీపీ సామాన్లు, ఎల్డీ పోల్స్, క్రాస్ ఆరమ్స్ తదితర సామాగ్రిని మామ్ముళు ఇచ్చే రైతులకు తరలించి వారి పొలంలో ట్రాన్స్ ఫార్మర్ బిగిస్తారు. ఒక ట్రాన్స్‌ఫార్మర్ కింద మూడు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలి. అందులో భాగంగా మండలంలోని పులచెర్ల గ్రామంలో చంద్రశేఖర్ రెడ్డితో పాటు మరో ఇద్దరు రైతులకు (సర్వీసు నంబర్లు 7531325001206, 7531325001207, 7531325001205) విద్యుత్ కనెక్షన్లు మంజూరయ్యాయి. వీరికి ట్రాన్స్‌పార్మర్ ఏర్పాటు చేసి కనెక్షన్ ఇవ్వలేదు. వీరికి బదులుగా అధికారులకు ముడుపులు ఇచ్చిన రైతులకు కనెక్షన్ ఇచ్చారు. అయితే వీరికి బిల్లు మాత్రం వచ్చింది. దీంతో అసలు విషయం బయట పడింది. అదేవిధంగా కలేకుర్తి గ్రామ పరిధిలో ఉన్న తమ పొలానికి బెలుగుప్ప మండలం బూదవర్తి గ్రామానికి చెందిన రైతులు దుర్గన్న, రాజశేఖర్, నాగరాజు, విద్యుత్ కనెక్షన్ కోసం డిడి కట్టి దరఖాస్తు చేసుకున్నారు. వీరికి 7531318000606, 7531318000 607, 7531318000608 సర్వీసు నెంబర్లను ఆన్‌లైన్ ద్వారా కేటాయించారు. అయితే ఈ రైతులకు కాంట్రాక్టర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయలేదు. కాని వీరికి రూ.324 బిల్లు వచ్చింది. అదే విధంగా పుల్లంపల్లి గ్రామంలో పార్వతి, చిన్నలింగన్న, ఈరన్నలకు వ్యవసాయ కనెక్షన్లు మంజూరైనా వీరికి కూడా కనెక్షన్లు ఇవ్వలేదు. కొంత మందికి కరెంటు స్తంబాలు ఒక్కటే ఇచ్చారు. వీరికి కూడా బిల్లులు వచ్చాయి.

**అధిక రుసుం ఇచ్చుకోవాల్సిందే..**

రైతుల అవసరాలను అసరగా చేసుకున్న కాంట్రాక్టర్, అధికారులు అక్రమ వసూళ్ల కోసం కొందరు దళారులను ఏర్పాటు చేసుకున్నట్లు సమాచారం. వ్యవసాయ కనెక్షన్ లు ఇవ్వకపోగా బిల్లులు మాత్రం రావడంతో బాధిత రైతులు అధికారులను నిలదీస్తున్నారు. దీంతో వారు రైతులకు సమాధానం చెప్పుకోలేక ఉక్కిరికిబిక్కిరి అవుతున్నారు. బాధితులు ప్రతి రోజు కణేకల్లు విద్యుత్ సబ్ స్టేషన్‌కు కాళ్లు అరిగేలా తిరగాల్సిన పరిస్థితి నెలకొంది. కనెక్షన్ ఇవ్వకున్నా ఈ బిల్లులేలా వచ్చాయని కొందరు రైతులు అధికారులను నిలదీస్తున్నారు. మరి కొందరు రైతులు తమకు మంజూరైన కనెక్షన్లను ఇతరకు ఎంతకు అమ్ముకొంటున్నారంటూ వాగ్వివాదానికి దిగుతున్నారు. బాధితులు ఒక్కొక్కరు కార్యాలయానికి వస్తుండటంతో అధికారులు ముఖం చాటేస్తున్నారు.

# భయంభయంగా గాజా ప్రజలు

- శిథిలాల మధ్య కుళ్లిన మృతదేహాలతో దుర్గంధం
- ఏడవ రోజూ కొనసాగిన బందీల విడుదల
- గాజాకు మరింత సాయం పంపాలని జోర్డాన్ వినతి

**రఫా, గాజా :** కాల్పుల విరమణ కొనసాగుతున్నప్పటికీ గాజా ప్రజలు భయం, భయంగానే బతుకు వెళ్లదీస్తున్నారు. గురువారం ఆరవ విడత విడుదలలో భాగంగా పదిమంది ఇజ్రాయిలీ బందీలు గాజా నుండి విడుదల కానున్నారు. వారిలో ఇరువురు రష్యన్ పౌరులు. గత వారం రోజులుగా 200మందికి పైగా పాలస్తీనియన్లు విడుదలైనా ఇంకా వేలాదిమంది ఇజ్రాయిల్ జైళ్లల్లో మగ్గుతున్నారు. బుధవారం కాల్పుల విరమణ గడువు మరికొద్ది నిముషాల్లో ముగిసిపోతుందనగా ఒక రోజు పొడిగింపునకు ఇరు పక్షాలు అంగీకరించాయి. భవన శిథిలాల కింద కూరుకుపోయిన శవాలు కుళ్లిపోయి ఆ చుట్టుపక్కల ప్రాంతాలన్నీ దుర్గంధం వెదజల్లుతున్నట్లు అల్‌జజీరా వార్తా సంస్థ తెలిపింది.

**కాల్పుల విరమణ కొనసాగించండి : బ్లింకెన్**

గాజాలో ఇజ్రాయిల్ సృష్టిస్తున్న మారణ హోమాన్ని ఆపాలని కోరుతూ అమెరికా, ఇతర పశ్చిమ దేశాలతో సహా యావత్ అంతర్జాతీయ సమాజం నుంచి ఒత్తిడి పెరుగుతున్న నేపథ్యంలో కాల్పుల విరమణను మరి కొంత కాలం కొనసాగించాలని అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ పేర్కొన్నారు. ప్రస్తుతం టెల్ అవీవ్‌లో పర్యటిస్తున్న ఆయన నెతన్యాహుతో సమావేశమయ్యారు. ఇజ్రాయిల్ తదుపరి కార్యాచరణకు సంబంధించి మార్గ నిర్దేశం చేసినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

**మరింత సాయం అందేలా చూడండి**
**-ఐరాసకు జోర్డాన్ రాజు అబ్దుల్లా విజ్ఞప్తి**

కాల్పుల విరమణ సమయంలో గాజాకు మానవతా సాయం మరింత అందేలా చూడాలని జోర్డాన్ రాజు అబ్దుల్లా ఐక్యరాజ్య సమితి సహాయక కార్యకలాపాల నిర్వహణ అధికారులను, అంతర్జాతీయ ఎన్‌జిఓలను కోరారు. ఈ మేరకు ఇజ్రాయిల్‌పై ఒత్తిడి పెంచాలన్నారు. ఐక్యరాజ్య సమితి అధికారులు, పశ్చిమ దేశాలకు చెందిన స్వచ్ఛంద సంస్థల అధినేతలు, అరబ్ దాతల ప్రతినిధులతో అత్యవసరంగా జరిపిన సమావేశంలో అబ్దుల్లా మాట్లాడారు.

తగినంత మొత్తంలో ఆహార సరఫరాలు అందకుండా ఇజ్రాయిల్ తొక్కిపడుతోందని, ఇది ఎంత మాత్రమూ ఆమోదయోగ్యం కాదని అన్నారు. ఇరు పక్షాల మధ్య కాల్పుల విరమణ కోసం తీవ్రంగా కృషి చేస్తున్న ఖతార్ అమీర్‌కు బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డసిల్వా కృతజ్ఞతలు తెలియజేశారు.

# విముక్త పాలస్తీనా కావాలి

- పాలస్తీనియన్లకు బాసటగా నిలిచిన ప్రపంచ ప్రజలు
- అంతర్జాతీయ సంఘీభావం దినోత్సవం సందర్భంగా నిరసనలు, ర్యాలీలు



ఇజ్రాయిల్ దాడులను ఆపాలని డిమాండ్ చేస్తూ ఇటలీలో ఆందోళన చేస్తున్న ప్రజలు

**శావో పాలో :** అంతర్జాతీయ పాలస్తీనియన్ల సంఘీభావ దినోత్సవం సందర్భంగా పాలస్తీనాకు పూర్తి విముక్తి కల్పించాలని ప్రపంచ దేశాలు బుధవారం డిమాండ్ చేశాయి. ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న ప్రజా ఉద్యమాలన్నీ పాలస్తీనా ప్రజలకు బాసటగా నిలబడుతున్నాయి. ఇప్పటివరకు గాజాలో సాగుతున్న నరమేథంలో 15వేల మందికి పైగా పాలస్తీనియన్లు మరణించారు. కాల్పుల విరమణకు తాత్కాలికంగా విరామం ఇచ్చినప్పటికీ ఇజ్రాయిలీ బలగాలు పాలస్తీనియన్లను చంపుతునే వున్నాయి. బుధవారం రాత్రి జరిగిన దాడిలో జెనిన్ శరణార్ధి శిబిరాన్ని లక్ష్యంగా చేసుకుని ఇద్దరు చిన్నారులను చంపేశారు. అరబ్, మాగెరబ్ ప్రాంతంవ్యాప్తంగా నిరసనలు, ప్రదర్శనలు జరుగుతున్నాయి. ఇజ్రాయిల్‌తో సాధారణ సంబంధాల ప్రక్రియకు ముగింపు పలకాలని తమ ప్రభుత్వాలను ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

మొరాకోలో 17 నగరాల్లో నిరసన కార్యాచరణకు మొరాకన్ ఫ్రంట్ అగైనెస్ట్ నార్మలైజేషన్ అండ్ ఇన్ సపోర్ట్ ఆఫ్ పాలస్తీనా పిలుపిచ్చింది. విముక్త పాలస్తీనా కావాలంటూ రబత్ నగరంలో జరిగిన నిరసన కార్యాచరణలో ప్రజలు పిలుపిచ్చారు.

పాలస్తీనాకు సంఘీభావంగా ట్యునిస్‌లో నవంబరు 29న వర్కర్స్ పార్టీ ఆఫ్ ట్యునీషియా పెద్దఎత్తున ప్రజా సమీకరణను చేపట్టింది. మాతృభూమిని దోచుకుంటున్న, ప్రజల గౌరవానికి భంగం కలిగిస్తున్న, సామ్రాజ్యవాదం నిస్సిగ్గుగా అందించే మద్దతుతో ఆటవిక యుద్ధాన్ని చేస్తూ ప్రపంచ ప్రజల వివేకాన్ని సవాలు చేస్తున్న యూదు వలసవాదాన్ని పార్టీ తీవ్రంగా ఖండిస్తూ ట్యునీషియా వర్కర్స్ పార్టీ ఒక ప్రకటన జారీ చేసింది. అణచివేతకు గురవుతున్న ప్రజల తరపున, అరబ్బుల తరపున పోరాడుతున్న పాలస్తీనా ప్రజలు విజయం సాధించాలని కోరుతూ అన్ని నగరాలు, గ్రామాల్లో ప్రదర్శనలు నిర్వహించాల్సిందిగా ప్రజలకు పిలుపునిచ్చింది.

సెంట్రల్ వెస్ట్ బ్యాంక్ నగరమైన రమల్లాలో కూడా పెద్ద సంఖ్యలో జాతీయ, ఇస్లామిక్ బలగాలు, కార్మిక సంఘాలు, పౌర సంస్థలు, ప్రజా కమిటీలు ర్యాలీలు నిర్వహించాయి. పాలస్తీనా ప్రజలకు సంఘీభావం ప్రకటించాయి.

ఇటలీవ్యాప్తంగా విశ్వవిద్యాలయాల్లో విద్యార్థులు సమ్మెలు నిర్వహించారు. ఇజ్రాయిల్ విద్యా సంస్థలతో సంబంధాలు తెగతెంపులు చేసుకోవాలని డిమాండ్ చేశారు. పాలస్తీనా ప్రజలకు సంఘీభావాన్ని ప్రకటించారు.

## కాపాడిన కార్మిక ధీరులు

రెస్క్యూ ఆపరేషన్‌లో పాల్గొన్న 12 మందితో కూడిన ర్యాట్ మైనర్ల బృందం


మున్నా ఖురేషి


మోను కుమార్


ఫిరోజ్ ఖురేషి


నాసిర్ ఖాన్


జతిన్


దేవేంద్రకుమార్


వకిల్ హస్సన్


ఇర్షాద్ అన్సారీ


రషీద్ అన్సారీ


నసిమ్ మాలిక్


సౌరభ్


అంకుర్

# నిర్మాణ కార్మికుల భద్రతే ముఖ్యం

- ఉత్తరాఖండ్ టన్నెల్ ప్రమాదంపై విచారణ జరపాలి
- బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి
- ప్రధాని, సిఎంలకు సిడబ్ల్యూఎఫ్ఐ లేఖ

**న్యూఢిల్లీ :** ఉత్తరాఖండ్‌లోని ఉత్తరకాశీ జిల్లాలో టన్నెల్ కూలిపోయిన ప్రమాదం నుంచి 41 మంది కార్మికులు సురక్షితంగా బయటపడటంపై సిఐటియు, కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (సిడబ్ల్యూఎఫ్ఐ) హర్షం వ్యక్తం చేశాయి. ప్రమాద ఘటనలో భద్రతా ఉల్లంఘనలను ప్రస్తావిస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి, ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి ధామికి సిడబ్ల్యూఎఫ్ఐ లేఖ రాసింది. ఈ ప్రమాదంపై సమగ్ర న్యాయ విచారణ జరిపించాలని, ప్రమాదానికి బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేసింది. అవసరమైన భద్రతా చర్యలు తీసుకోకుండా ఎలాంటి నిర్మాణ పనులను అనుమతించవద్దని పేర్కొంది. తమ డిమాండ్లపై డిసెంబర్, జనవరిల్లో దేశవ్యాప్తంగా విస్తృత ప్రచారం నిర్వహించాలని సిడబ్ల్యూఎఫ్ఐ నిర్ణయించింది. ఈ ప్రచారంలో భాగంగా సిడబ్ల్యూఎఫ్ఐ అన్ని అనుబంధ సంఘాలు కూడా శుక్రవారం ప్రధాని, ముఖ్యమంత్రికి లేఖలు పంపనున్నాయి. కార్మికులను రక్షించడంలో ర్యాట్ మైనర్ల చిత్తశుద్ధిని సిఐటియు, సిడబ్ల్యూఎఫ్ఐ అభినందించాయి. టన్నెల్ ప్రమాద ఘటన కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, అధికారులు సరైన రక్షిత చర్యలు తీసుకోవడంలో వైఫల్యంపై అనేక ప్రశ్నలను లేవనెత్తుతుందని పేర్కొన్నాయి. అధికారుల, నిర్మాణ సంస్థల నిర్లక్ష్యం కారణంగా జరుగుతున్న ప్రమాదాల జాబితాలో ఈ టన్నెల్ కూలిపోయిన ప్రమాదం ఒకటని తెలిపాయి. ప్రభుత్వ మౌలిక సదుపాయాల నిర్వహణను ప్రైవేట్ కార్పొరేట్ కాంట్రాక్టర్లకు అప్పగించడం వల్ల కలిగే వినాశకరమైన పరిణామాలను ఈ ప్రమాదం మరోసారి బహిర్గతం చేసిందని పేర్కొన్నాయి. నవయుగ ఇంజనీరింగ్ కంపెనీ నిర్మిస్తున్న కొన్ని ప్రాజెక్టుల్లో ఇటీవల ప్రమాదాలు చోటుచేసుకోవడంతో ఆ సంస్థపై ఎఫ్ఐఆర్ నమోదు చేసినా, ఇప్పటి వరకూ ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించాయి. దీనిని బట్టి అదానీ గ్రూప్ మాదిరిగానే నవయుగ కూడా మోడీ ప్రభుత్వానికి అభిమాన సంస్థగా మారిందని అర్థమవుతోందని తెలిపింది. ఈ మేరకు సిఐటియు ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.

## జెఇఇ మెయిన్స్ దరఖాస్తులకు గడువు పొడిగింపు

**న్యూఢిల్లీ:** ప్రఖ్యాత విద్యా సంస్థల్లో ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే జెఇఇ మెయిన్-2024 ఆన్‌లైన్ దరఖాస్తులకు ఎన్‌టిఏ గడువు పొడిగించింది. జనవరిలో జరిగే జెఇఇ మెయిన్ తొలి విడత పరీక్షకు దరఖాస్తుల తుది గడువు నవంబర్ 30 ముగియడంతో.. ఆ గడువును డిసెంబర్ 4 రాత్రి 9గంటల వరకు పొడిగించింది. ఈ మేరకు ప్రకటన విడుదల చేసింది. అలాగే, అదే రోజు రాత్రి 11.50గంటల వరకు ఫీజు చెల్లించవచ్చని తెలిపింది. దరఖాస్తుల్లో ఏవైనా సవరణలు చేయాల్సి వస్తే డిసెంబర్ 6 నుంచి 8వరకు అవకాశం కల్పించింది. పూర్తి అప్‌డేట్స్ కోసం అభ్యర్థులు https://jeemain.nta.nic.in వెబ్‌సైట్‌లో చెక్ చేసుకోవాలని సూచించింది. జెఇఇ మెయిన్ సెషన్-1 పరీక్షలు జనవరి 24 నుంచి ఫిబ్రవరి 1 మధ్య తేదీల్లో జరుగుతాయని ఇది వరకే ఎన్‌టిఏ ప్రకటించిన విషయం తెలిసిందే.

# ఎటువంటి చర్యలూ తీసుకోబోం

- కేంద్రం హామీ
- అటవీ సంరక్షణ చట్టానికి సవరణలపై సుప్రీం స్టే నిరాకరణ

**ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో**

అటవీ నిర్వచనం నుండి మినహాయింపు కోసం మార్గదర్శకాలు రూపొందించే వరకు 'ఎటువంటి చర్యలు' తీసుకోబోమని కేంద్ర ప్రభుత్వం హామీ ఇవ్వడంతో డిసెంబర్ 1 నుండి అమలులోకి వచ్చే అటవీ సంరక్షణ చట్టానికి సవరణలపై స్టే ఇవ్వడానికి సుప్రీంకోర్టు గురువారం నిరాకరించింది. దేశంలోని అడవులకు 'మృత్యువు' అని పేర్కొంటూ సవరణల రాజ్యాంగ చెల్లుబాటును సవాలు చేస్తూ 13 మంది రిటైర్డ్ పబ్లిక్ సర్వెంట్లు దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని (పిఐఎల్) సుప్రీంకోర్టు విచారణ జరిపింది. 1996 డిసెంబరులో టిఎన్ గోదావర్మన్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులో అడవుల విస్తారమైన పరిధిని తాజా చట్టం పరిమితం చేస్తుందని పిటిషనర్లు పేర్కొన్నారు. పిటిషనర్ల ఆందోళనలు నిజమా? కాదా? అని అదనపు సొలిసిటర్ జనరల్ బల్బీర్ సింగ్‌ను న్యాయమూర్తులు జస్టిస్ బిఆర్ గవాయ్, జస్టిస్ పిఎస్ నరసింహలతో కూడిన ధర్మాసనం ప్రశ్నించింది. అటవీ పరిరక్షణ చట్టంలోని సెక్షన్ 2 కింద అటవీ భూమిని నిర్వచించిన 1996 తీర్పు ప్రకారం అటవిగా నోటిఫై చేయబడిన భూమిని, ప్రభుత్వ రికార్డుల్లో అడవులుగా నమోదు చేయబడిన భూమిని, అటవీకి విస్తారమైన అర్థాన్ని, చట్టపరమైన రక్షణను అందించిన అటవీ పదానికి అర్థాన్ని పేర్కొంది. 1996 తీర్పులో పేర్కొన్న అడవుల నిర్వచనాన్ని పలచన చేయడానికి సవరణలు కోరడం లేదని బల్బీర్ సింగ్ తెలిపారు. 'ప్రైవేట్ భూములను చేర్చకపోవడం విషయం కాదు. ఆ అవగాహన సరికాదు' అని అన్నారు. సవరించిన చట్టం ప్రకారం అటవీ విస్తీర్ణం నిర్వచనం నుండి మినహాయింపు రూపొందించబడిన మార్గదర్శకాల ప్రకారం ఉంటుందని కోర్టుకు తెలిపింది. '1996 తీర్పు ప్రకారం అటవీ నిర్వచనాన్ని పలుచన చేయడం లేదని మీరు చెబితే, మేము మీ స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేస్తాము. ఇది తీవ్రమైన చిక్కులను కలిగి ఉన్నందున మేము ఈ పిటిషన్‌ను ఆరు వారాల తరువాత విచారిస్తాం' అని ధర్మాసనం పేర్కొంది. పిటిషనర్ల ఆందోళనలను పరిష్కరించడానికి, గోదావర్మన్ తీర్పులో అర్థం చేసుకున్న అడవుల నిర్వచనం పరంగా ఎటువంటి 'అవక్షేపణ చర్యలు' తీసుకోబోమని బల్బీర్ సింగ్ ప్రకటన చేస్తారని ధర్మాసనం పేర్కొంది. నాలుగు వారాల్లో ప్రతిస్పందనను దాఖలు చేయడానికి ప్రభుత్వానికి అనుమతినిచ్చింది. పిటిషనర్ల తరపున సీనియర్ న్యాయవాది ప్రశాంతో చంద్రసేన్ వాదిస్తూ, 1996 తీర్పు ప్రకారం అటవీ విస్తీర్ణాన్ని గుర్తించి, పరిరక్షించేందుకు రాష్ట్ర నిపుణుల కమిటీలను (ఎస్ఇసి) ఏర్పాటు చేయాలని రాష్ట్రాలను ఆదేశించింది. 'అటువంటి ఎస్ఇసిలు ప్రతి రాష్ట్రంలో ఉన్నాయో లేదో అస్పష్టంగా ఉంది. ఎస్ఇసిల నివేదికలు పబ్లిక్ డొమైన్‌లో అందుబాటులో లేవు. సమాచార హక్కు చట్టం కింద వాటిని యాక్సెస్ చేయలేదు. సవరణలు నోటిఫై చేయబడిన తరువాత, రాష్ట్రాలు తమకు నచ్చినవి చేయగలవు' అని పేర్కొన్నారు. అడవులను దారి మళ్లించి నాశనం చేస్తే కోలుకోలేని నష్టం వాటిల్లుతుందని, అటవీ నాణ్యతను పూర్తిగా పునరుద్ధరించలేనందున అడవుల పెంపకం, తోటల పెంపకంతో పూడ్చలేమని తెలిపారు. '2023 సవరణ చట్టం భారతీయ పర్యావరణ చట్టంలోని అనేక సూత్రాలను స్పష్టంగా ఉల్లంఘిస్తోంది' అని పిటిషనర్లు పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఎలాంటి సీలింగ్‌ను నిర్దేశించకుండానే ప్రతి భూమిని మళ్లించడం వల్ల అటవీ నిర్మూలన శక్తులు అడవులను గుర్తించి వాటిని ముక్కలు చేసి, అపారమైన పర్యావరణ నష్టం కలిగిస్తారని వాదించారు. భద్రతకు సంబంధించిన మౌలిక సదుపాయాల కల్పనను ప్రతిపాదిస్తే, 10 హెక్టార్ల వరకు అటవీ భూమిని పరిశీలించకుండా తీసుకునే సవరణలకు ఆగస్టులో పార్లమెంట్ ఆమోదం తెలిపింది. ఇందులో ఏమేమి ఉండాలనే దానిపై స్పష్టత రాలేదు.



## మహిళా క్యాడెట్లకు రాష్ట్రపతి ప్రశంస

**పూణే:** మహారాష్ట్రలోని పూణే పట్టణం ఖడక్‌వాస్లాలో నేషనల్ డిఫెన్స్ అకాడమీ (ఎన్‌డిఎ) 145వ కోర్సు పాసింగ్ అవుట్ పరేడ్‌ను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గురువారం స్వీకరించారు. ఈ పరేడ్‌లో మహిళా క్యాడెట్ల తొలి బ్యాచ్ పాల్గొనడంపై సంతోషం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఈ మహిళా క్యాడెట్లు ఎన్‌డిఎను, దేశాన్ని కొత్త శిఖరాలకు తీసుకెళ్తారని విశ్వసిస్తున్నట్లు తెలిపారు. అమ్మాయిలు తమకు నచ్చిన వృత్తిని ఎంచుకోవడానికి కష్టపడుతున్నారని అన్నారు. భవిష్యత్ సవాళ్లను ఎదుర్కొనేందుకు కొత్త టెక్నాలజీలను నేర్చుకుని, ముందుకు సాగాలని క్యాడెట్లను రాష్ట్రపతి కోరారు. గురువారం పాసింగ్ అవుట్ పరేడ్‌లో పురుషుల బృందాలతో పాటు 15 మంది మహిళా క్యాడెట్ల బృందం పాల్గొంది. వీరంతా గత ఏడాది ఎన్‌డిఎలో శిక్షణకు చేరారు. ప్రస్తుతం రెండో ఏడాది చదువుతున్నారు. పాసింగ్ అవుట్ పరేడ్‌లో ద్వితీయ, తృతీయ ఏడాదిలకు చెందిన క్యాడెట్లు కూడా పాల్గొంటారని అధికారులు తెలిపారు. గురువారం కోర్సు పూర్తి చేసిన క్యాడెట్లందరినీ రాష్ట్రపతి ముర్ము అభినందించారు. ఈ కార్యక్రమంలో మహారాష్ట్ర గవర్నర్ రమేష్ బాయిస్, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్ కూడా పాల్గొన్నారు.

## శ్రీనగర్ నిట్‌లో నిరసనల హోరు

- సెలవులు ప్రకటించిన అధికారులు

**శ్రీనగర్ :** జమ్ముకాశ్మీర్‌లోని శ్రీనగర్‌లో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్)లో విద్యార్థులు పెద్దఎత్తున ఆందోళన చేయడంతో గురువారం నుంచి శీతాకాలం సెలవులను అధికారులు ప్రకటించారు. తక్షణమే వసతి గృహాలను ఖాళీ చేయాలని విద్యార్థులను ఆదేశించారు. కొన్ని రోజుల క్రితం నిట్‌కు చెందిన ఒక విద్యార్థి 'ఒక మతాన్ని కించపరుస్తూ సోషల్ మీడియాలో అభ్యంతరకరమైన వీడియోను పోస్ట్ చేయగా, అతనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ విద్యార్థికి అనుకూలంగా, వ్యతిరేకంగా నిరసనలు జరుగుతున్నాయి. ఈ నిరసనలు నిట్‌తో పాటు శ్రీనగర్‌లోని అమర్ సింగ్ కాలేజ్, ఇస్లామియా కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ కామర్స్‌తో సహా ఇతర క్యాంపస్‌లకూ వ్యాపించాయి. నిట్‌లో దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన సుమారు మూడు వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. మరోవైపు విద్యార్థులు సంయమనం పాటించాలని, మత సామరస్యాన్ని కాపాడాలని జమ్ముకాశ్మీర్ డిజిపి ఆర్ఆర్ స్వైన్ విజ్ఞప్తి చేశారు.

## రూ.250 కోట్ల మనీలాండరింగ్ కేసులో ఇడి సోదాలు

**శ్రీనగర్ :** జమ్ముకాశ్మీర్‌లోని ఆరు ప్రాంతాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) గురువారం సోదాలు చేపట్టింది. రూ.250 కోట్ల అక్రమ నగదు లావాదేవీల కుంభకోణం కేసులో జెకె స్టేట్ కార్పొరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ మాజీ చైర్మన్ సహా పలువురు నివాసాల్లో సోదాలు జరుపుతున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కేసు జెకె బ్యాంకుకు సంబంధించినదని, రివర్ జీలం కోఆపరేటివ్ హౌసింగ్ బిల్డింగ్ సొసైటీ పేరుతో ఈ కుంభకోణం జరిగిందని అధికారులు తెలిపారు. పిఎంఎల్ఎ చట్టం కింద ఫెడరల్ ప్రోబ్ ఏజన్సీ (ఎఫ్‌పిఎ) ఆదేశాలతో శ్రీనగర్‌లోని ఇడి అధికారులు ఈ సోదాలు చేపట్టారు. ఈ కేసులో నకిలీ హౌసింగ్ సొసైటీ చైర్మన్ హిలాల్ ఎ మిర్, అప్పటి జెకె అండ్ స్టేట్ కోఆపరేటివ్ లిమిటెడ్ చైర్మన్ మొహమ్మద్ షఫీ దార్, ఇతరులపై ఎసిబి ఇప్పటికే చార్జిషీటు దాఖలు చేసిన సంగతి తెలిసిందే.

# విద్వేష ప్రసంగాల కట్టడికి యంత్రాంగం

సుప్రీం యోచన

**న్యూఢిల్లీ :** దేశంలో కొందరు వ్యక్తులు చేస్తున్న విద్వేషపూరిత ప్రసంగాలను పరిశీలించేందుకు పాలనాపరమైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని యోచిస్తున్నట్లు సుప్రీంకోర్టు తెలిపింది. ఒక్కో కేసును వ్యక్తిగతంగా పరిశీలించడం సాధ్యం కాదని, దీనివల్ల కేసుల ప్రవాహం పెరుగుతుందని వ్యాఖ్యానించింది. విద్వేష ప్రసంగాలను న్యాయస్థానం నిర్వచిస్తోందని అంటూ, దీనిని ఎలా అమలు చేయాలి, ఎలా వర్తింపజేయాలి అనేదే ప్రశ్న అని జస్టిస్ సంజీవ్ ఖన్నా, ఎస్‌విఎన్ భట్టితో కూడిన బెంచ్ పేర్కొంది.

'ఒక్కో కేసును వ్యక్తిగతంగా పరిష్కరించలేము. ఒకవేళ అలా చేయడం మొదలుపెడితే కేసుల సంఖ్య పెరుగుతుంది. దానికి బదులు మౌలిక సదుపాయాన్ని లేదా పాలనాపరమైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని భావిస్తున్నాం. ఒకవేళ అక్కడ ఏదైనా ఉల్లంఘన జరిగితే మీరు సంబంధిత హైకోర్టును ఆశ్రయించవచ్చు' అని సుప్రీం బెంచ్ వివరించింది. పాన్ ఇండియా కేసులు చేపట్టడం సాధ్యం కాదని, వాటిని పరిష్కరించడం అసంభవమని తెలిపింది. 'భారత్ వంటి పెద్ద దేశంలో సమస్యలు ఉంటాయి. అవసరమైనప్పుడు చర్య తీసుకునే పాలనా యంత్రాంగం మన వద్ద ఉన్నదా? అనేదే ఇక్కడ ప్రశ్న. విద్వేష ప్రసంగం చేస్తే ప్రభుత్వం చర్య తీసుకుంటుందన్న విషయం సమాజానికి తెలియాలి' అని వ్యాఖ్యానించింది. నోడల్ అధికారులను నియమించని తమిళనాడు, కేరళ, నాగాలాండ్, గుజరాత్ ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది.

# 4 నుంచి పార్లమెంట్
## 18 బిల్లులు ప్రవేశపెట్టనున్న ప్రభుత్వం

**న్యూఢిల్లీ :** పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ఈ నెల 4 నుంచి ప్రారంభమై.. 22వ తేదీ వరకూ కొనసాగుతాయి. ఈ సమావేశాలలో మోడీ ప్రభుత్వం 18 బిల్లులను ప్రవేశపెడుతుంది. మహిళా రిజర్వేషన్ చట్టంలోని నిబంధనలను జమ్ముకాశ్మీర్, పాండిచ్చేరికి కూడా వర్తింపజేసేందుకు ఉద్దేశించిన రెండు బిల్లులు, క్రిమినల్ చట్టాల స్థానంలో తీసుకొస్తున్న మూడు బిల్లులు కూడా వీటిలో ఉన్నాయి. ఈ మేరకు లోక్‌సభ సచివాలయం ఓ బులెటిన్ విడుదల చేసింది. జమ్ముకాశ్మీర్ శాసనసభ స్థానాల సంఖ్యను 107 నుంచి 114కు పెంచేందుకు ఉద్దేశించిన బిల్లును కూడా ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెడుతుంది. కాశ్మీర్ వలసవాదులు, పాక్ ఆక్రమిత జమ్ముకాశ్మీర్ నుండి వచ్చిన వారు, షెడ్యూల్డ్ తెగల వారికి ప్రాతినిధ్యం కల్పించేందుకు ఈ బిల్లును తీసుకొస్తున్నామని ప్రభుత్వం చెబుతోంది. ఈ బిల్లులతోపాటు 2023-24 సంవత్సరపు గ్రాంట్లకు సంబంధించి తొలి విడత అనుబంధ డిమాండ్లను కూడా సభ ముందు ఉంచుతారు. ఈ డిమాండ్లపై శీతాకాల సమావేశాలలోనే చర్చించి ఆమోదిస్తారు.

మహిళా రిజర్వేషన్ బిల్లును వర్షాకాల సమావేశాలలోనే ఆమోదించారు. ఈ బిల్లును జమ్ముకాశ్మీర్, పాండిచ్చేరికి వర్తింపజేయలేదు. ఆయా కేంద్రపాలిత ప్రాంతాల పాలనా వ్యవహారాలకు సంబంధించిన ఆర్టికల్ 239ఎ, 239ని అందులో చేర్చకపోవడంతో ఆయా ప్రాంతాలకు మహిళా రిజర్వేషన్ బిల్లును వర్తింపజేయలేదు. ఐపిసి (1860), ఇండియన్ ఎవిడెన్స్ చట్టం (1872), సిఆర్‌పిసి (1898) స్థానంలో భారతీయ న్యాయ సంహిత, భారతీయ సాక్ష్య, భారతీయ నాగరిక్ సురక్షా సంహిత బిల్లులను ప్రవేశపెడతారు. ఇటీవల బిజెపి ఎంపీ బ్రిజ్‌లాల్ నేతృత్వంలోని పార్లమెంటరీ కమిటీ ఈ బిల్లులకు 50కి పైగా సవరణలు సూచించిన విషయం తెలిసిందే.


సూరత్ కెమికల్ ఫ్యాక్టరీలో ఎగసిపడుతున్న మంటలు

# సూరత్ కెమికల్ ఫ్యాక్టరీలో అగ్ని ప్రమాదం

- ఏడుగురు కార్మికుల సజీవ దహనం
- 24 మందికి గాయాలు

అహ్మదాబాద్ : గుజరాత్ సూరత్ పట్టణంలోని ఒక కెమికల్ ఫ్యాక్టరీలో జరిగిన అగ్ని ప్రమాదంలో ఏడుగురు కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. మరో 24 మంది గాయపడ్డారు. నగరంలోని సచిన్ ఇండస్ట్రియల్ ప్రాంతంలోని ఏథర్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ కెమికల్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్‌లో బుధవారం ఈ ప్రమాదం సంభవించగా, గురువారం తెల్లవారుజామున మృతదేహాలను గుర్తించినట్లు సూరత్ జిల్లా కలెక్టర్ ఆయూష్ ఓక్ తెలిపారు. మృతుల్లో ఒకరు సంస్థ ఉద్యోగి కాగా, మిగిలిన ఆరుగురు కాంట్రాక్టు కార్మికులు. ఫ్యాక్టరీ ప్రాంగణంలో నిర్వహించిన తనిఖీల్లో మృతదేహాలను కనుగొన్నారు. మృతులను దివ్యేష్ పటేల్ (కంపెనీ ఉద్యోగి), సంతోష్ విశ్వకర్మ, సనత్ కుమార్ మిశ్రా, ధర్మేంద్ర కుమార్, గణేష్ ప్రసాద్, సునీల్ కుమార్, అభిషేక్ సింగ్‌లుగా అధికారులు గుర్తించారు. ప్రమాదంలో గాయపడిన 24 మంది ప్రస్తుతం వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారని కలెక్టర్ తెలిపారు. బుధవారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో కెమికల్ ప్లాంట్‌లో ఒక భారీ ట్యాంక్‌లో నిల్వ ఉంచిన మండే రసాయనాలు లీకేజీ కావడంతో పేలుడు సంభవించిందని, వెంటనే మంటలు చెలరేగాయని అధికారులు తెలిపారు. 15 ఫైరింజన్లు తొమ్మిది గంటలపాటు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చాయి.

పోటీ పరీక్షల్లో అక్రమాలకు పాల్పడితే

# జీవిత ఖైదు, రూ. 10 కోట్ల వరకూ జరిమానా

- బిల్లుకు జార్ఖండ్ గవర్నర్ ఆమోదం


**రాంచీ :** జార్ఖండ్ పోటీ పరీక్షలు (రిక్రూట్‌మెంట్‌లో అక్రమాల నియంత్రణ, నివారణ) బిల్లు 2023కు ఆ రాష్ట్ర గవర్నర్ సిపి రాధాకృష్ణన్ గురువారం ఆమోదం తెలిపారు. ఈ బిల్లు ప్రకారం పోటీ పరీక్షల్లో ప్రకారం పోటీ పరీక్షల్లో మోసాలకు పాల్పడితే జీవిత ఖైదు, రూ. 10 కోట్ల వరకూ జరిమానా విధిస్తారు. ఆగస్టు3న రాష్ట్ర అసెంబ్లీ వర్షకాల సమావేశాల్లో ఈ బిల్లును ఆమోదించారు. ఈ బిల్లులోని నిబంధన ప్రకారం, పరీక్షల్లో ఒక అభ్యర్థి మొదటిసారి పట్టుబడితే రూ. 5 లక్షల జరిమానా, ఒక సంవత్సరం జైలు శిక్ష విధిస్తారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా మరో తొమ్మిది నెలల జైలు శిక్ష విధిస్తారు. రెండోసారి పట్టుబడితే రూ.10 లక్షల జరిమానా, మూడు సంవత్సరాల జైలు శిక్ష విధిస్తారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా మరో 30 నెలల జైలు శిక్ష విధిస్తారు. నేరం రుజువైతే అభ్యర్థిని 10 సంవత్సరాల పాటు ఏ పోటీ పరీక్ష రాయడానికి అనుమతించరు. ఈ బిల్లు ప్రకారం ప్రింటింగ్ ప్రెస్ గానీ లేదా పోటీ పరీక్ష నిర్వహించే మేనేజ్‌మెంట్ సిస్టమ్, పేపర్లు రవాణా చేసే వ్యక్తి లేదా కోచింగ్ ఇన్‌స్టిట్యూట్‌లు అక్రమాలకు పాల్పడితే, అప్పుడు 10 సంవత్సరాల జైలు శిక్ష నుంచి జీవిత ఖైదు వరకు శిక్ష విధిస్తారు. రూ. 2 కోట్ల నుంచి రూ. 10 కోట్ల వరకు జరిమానా విధిస్తారు. ఒక వేళ జరిమానా చెల్లించకపోతే అదనంగా మూడేళ్ల జైలుశిక్ష విధిస్తారు. అలాగే, పోటీ పరీక్షకు సంబంధించిన ప్రశ్నపత్రం, జవాబు పత్రాలపై అభ్యర్థులు, ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియా ప్రతినిథులు లేవనెత్తే ఫిర్యాదులు, ప్రశ్నలు ఆధారంగా ఎలాంటి ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయకుండా ఈ బిల్లు నిషేధం విధిస్తుంది. పైగా ఫిర్యాదులు చేసే వ్యక్తిని ఎలాంటి అనుమతులు లేకుండానే అరెస్టు చేసే వీలు కల్పిస్తుంది. ఈ బిల్లును ఒక నల్ల చట్టంగా ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి.

# భారత్‌కు మరిన్ని యుద్ధ విమానాలు..

- భారీ ఒప్పందానికి డిఫెన్స్ ప్యానెల్ అంగీకారం

**న్యూఢిల్లీ:** మరిన్ని యుద్ధ విమానాలను భారత్ సమకూర్చుకోనున్నది. దీనికి సంబంధించిన భారీ ఒప్పందానికి డిఫెన్స్ ప్యానెల్ అంగీకారం తెలిపింది. భారత వైమానిక దళం (ఐఎఎఫ్) కోసం 97 తేజస్ లైట్ కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్‌ల కొనుగోలుకు కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ గురువారం ఆమోదం తెలిపింది. మరిన్ని యుద్ధ విమానాలు పొందేందుకు లైన్ క్లియర్ చేసింది. 156 ప్రచండ్ యుద్ధ హెలికాప్టర్ల కొనుగోలుకు కూడా అనుమతించింది. వీటిలో 90 హెలికాప్టర్లు ఆర్మీకి, 66 హెలికాప్టర్లు ఐఎఎఫ్‌కు కేటాయించనున్నారు. ఇండియన్ ఎయిర్ ఫోర్స్ (ఐఎఎఫ్)కు చెందిన ఎస్‌యూ-30 ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్ అప్‌గ్రేడ్ ప్రోగ్రామ్‌కు కూడా డిఫెన్స్ అక్విజిషన్ కౌన్సిల్ ఆమోదం తెలిపింది. దేశీయంగా తయారుచేస్తున్న తేజస్ విమానాలు, ప్రచండ్ హెలికాప్టర్ల డీల్ విలువ రూ.1.1 లక్షల కోట్లు అని రక్షణ మంత్రిత్వ శాఖ వర్గాలు తెలిపాయి. తేజస్ మార్క్-1ఎ ఫైటర్ జెట్ 65 శాతానికి పైగా స్వదేశీ భాగాలతో దేశీయంగా రూపొందించి అభివృద్ధి చేసిన యుద్ధ విమానమని పేర్కొన్నాయి.

# వివాదాస్పదుడు, దౌత్యవేత్త హెన్రీ కిసింజర్ మృతి



**వాషింగ్టన్ :** ప్రచ్ఛన్న యుద్ధ కాలంలో ఘోరమైన నేరాలతో ప్రమేయమున్న అమెరికన్ దౌత్యవేత్త హెన్రీ కిసింజర్ బుధవారం నాడిక్కడి తన నివాసంలో చనిపోయారు. ఆయన వయసు వంద సంవత్సరాలు. గతంలో నిక్సన్, ఫోర్డ్ ప్రభుత్వాలలో జాతీయ భద్రతా సలహాదారుగా, విదేశాంగ శాఖ మంత్రిగా పనిచేసిన కాలంలో మానవాళికి వ్యతిరేకంగా ఘోరమైన నేరాలకు పాల్పడ్డాడు. అమెరికా సామ్రాజ్యవాద ప్రయోజనాల కోసం సేవ చేశాడు. ఫోర్డు ఓడిపోయి జిమ్మీకార్టర్ అధ్యక్షుడయ్యాక ఆ పదవి ఊడిపోయింది.

ఆ తరువాత కూడా ప్రపంచ వ్యవహారాలపై అమెరికన్ అధ్యక్షులకు, అధ్యక్ష అభ్యర్థులకు, ఉన్నత దౌత్యాధికారులకు, ప్రైవేట్ ఏజెన్సీలకు ఆయన సలహాలిచ్చేవాడు. వియత్నాం యుద్ధ సమయంలోనే కంబోడియాపై హంతక బాంబు దాడులు సాగించాడు. వందల వేల మంది ప్రాణాలను తీశాడు. వియత్నాం యుద్ధంలో తటస్థంగా ఉన్నామని కంబోడియా పాలకులు ప్రకటించిన తరువాత కూడా ఆ దేశంపై కార్పెట్ బాంబింగ్ జరిపించాడు. 1973లో చిలీలో అలెండీ నేతృత్వంలోని తొలి కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని ఫాసిస్టు తిరుగుబాటు ద్వారా కూల్చివేయడంలో ఇతని పాత్ర ఉంది. 1973 అక్టోబరులో జరిగిన ఇజ్రాయిల్, అరబ్ దేశాల మధ్య కుప్పూర్ వార్ (నాల్గవ అరబ్ యుద్ధం)లో ఈయన పాత్ర ఉంది. అమెరికన్ ఫెడరల్ బ్యూరో ఇన్వెస్టిగేటివ్ సంస్థ రహస్య ఏజెంట్‌గా కూడా పనిచేశాడు. అధికారిక [illegible] సమాంతరంగా శాంతియుత పరిష్కారం పేరుతో చర్చలు సాగిస్తూ అమెరికా ప్రపంచాధిపత్యాన్ని కొనసాగించేలా చూడడంలో దిట్ట. చైనాతో అమెరికాకు దౌత్య సంబంధాలను నెలకొల్పడంలో కిసింజర్ చొరవ చూపారు. వియత్నాం యుద్ధం ముగిసిన తరువాత ఉత్తర వియత్నాం నేత లేడక్ థోతో కలసి కిసింజర్‌ను నోబెల్ కమిటీ శాంతి బహుమతికి ఎంపిక చేసింది. థో ఆ బహుమతిని స్వీకరించడానికి నిరాకరించగా, కిసింజర్ దానిని తీసుకునేందుకు అంగీకరించాడు. చనిపోయిన తరువాత అతణ్ణి చాలా మంది దౌత్య మేధావి అని పొగుడుతున్నారు. కంబోడియా, వియత్నాం, చిలీ, పశ్చిమాసియాలో సాగించిన యుద్ధాలు మిలియన్ల మంది జీవితాలను నాశనం చేశాయి. చరిత్రలో అతని స్థానాన్ని దీనిని బట్టే నిర్ణయించవచ్చు.

## గొప్ప గుణం



అనగనగా ఔరంగాబాద్ అనే గ్రామం ఉండేది. ఆ గ్రామంలో దశరదయ్య అనే రైతు ఉన్నాడు. అతనికి రామ్, లక్ష్మణ్ అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. లక్ష్మణ్ నలుపు రంగులో ఉంటాడు. రామ్ తెలుపు రంగులో ఉంటాడు. గ్రామంలోని అందరూ లక్ష్మణ్ నలుపుగా ఉండడం చూసి హేళన చేసేవారు.

గ్రామస్తులు, దోస్తులు అందరూ దూరంగా ఉంటున్నారని లక్ష్మణ్ తన తల్లికి చెప్పి బాధపడ్డాడు. అప్పుడే వచ్చిన రామ్, తమ్ముడ్ని ఓదార్చాడు. ఇద్దరూ పెరిగి పెద్దవారయ్యారు. పట్నంలో చదువుకున్నారు.

ఒకరోజు గ్రామ సర్పంచ్ కోటయ్య అడవిలో వెళుతుంటే దుండగులు అడ్డుపడి దాడి చేస్తారు. కోటయ్యకు బాగా గాయాలవుతాయి. పట్నంలోని ఆసుపత్రిలో చేర్పిస్తారు. గాయం బాగా అవడంతో అర్జెంటుగా రక్తం అవసరమౌతుంది. అప్పుడు, అక్కడే డాక్టరుగా పనిచేస్తున్న లక్ష్మణ్ రక్తం ఇచ్చి కాపాడాడు.

తనకు ప్రాణభిక్ష పెట్టిన డాక్టరును ఒకసారి చూడాలని లక్ష్మణ్ దగ్గరికి వెళ్లాడు కోటయ్య. అక్కడ ఉన్న లక్ష్మణ్‌ని చూసి సిగ్గుతో తల దించుకున్నాడు. అప్పుడు కోటయ్యను దగ్గరకు తీసుకుని 'మామ మీరేమి ఇంతలా బాధపడవద్దు. ఆరోగ్యం జాగ్రత్త' అని చెప్పాడు లక్షణ్. గ్రామానికి తిరిగి వెళ్లిన కోటయ్య, 'చిన్నప్పుడు నల్లగా ఉన్నాడని ఎంతగా అవమానించానో.. అతడే ఇప్పుడు నా ప్రాణాలు కాపాడాడ'ని గ్రామస్తులకు ఎంతో గొప్పగా చెప్పాడు.

మనిషి గుణాగుణాలను ఎంచేవి, అతని నడక, ప్రవర్తనే కాని, శరీర రంగు కాదని గ్రామస్తులు తెలుసుకుంటారు. సెలవుల్లో ఊరికి వచ్చిన రామ్, లక్ష్మణ్‌లను ఈసారి గ్రామస్తులు ఆప్యాయంగా పలకరించారు.



**- సంగేపు కీర్తన,**
**7వ తరగతి,**
**93962 49007.**

## గజిబిజి

పిల్లలూ, ఇక్కడ ఉన్న ఆంగ్ల అక్షరాలు పక్కనే ఉన్న బాక్సులో గజిబిజిగా ఉన్నాయి. అవి ఎక్కడున్నాయో కనిపెట్టండి చూద్దాం.

moon
boat
crab
deer
cloud
chair

| | | | | | |
|---|---|---|---|---|---|
| j | o | w | t | r | a |
| m | c | d | q | c | r |
| o | r | e | b | l | i |
| o | a | e | o | o | a |
| n | b | r | a | u | h |
| s | v | o | t | d | c |

## నేను గీసిన బొమ్మ



**లంకె యశశ్రీ,**
**2వ తరగతి,**
**విజయ పబ్లిక్ స్కూల్,**
**చల్లపల్లి.**



**పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com**



**భారతదేశంలో హెచ్ఐవి/ఎయిడ్స్ వ్యాధి రాకముందే అగ్రదేశాలైన అమెరికా, బ్రిటన్ దేశాల్లో ఆ వ్యాధి సోకిన రెండేళ్లకే పిట్టల్లా రాలిపోతుండేవారు. దీనికి విశాఖపట్టణానికి చెందిన అంతర్జాతీయ ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ కూటికుప్పల సూర్యారావు- ఎంబిబిఎస్, ఎండి, పిహెచ్‌డి, ఎఫ్ఆర్‌సిపి, ఎఫ్ఎఎంఎస్, డిఎస్‌సి ఎంతో చలించిపోయారు. అక్కడి పిల్లలు, మహిళలు, వ్యాధిగ్రస్తుల పట్ల చూపిస్తున్న వివక్షపై తీవ్ర ఆందోళన చెందారు. మనదేశంలో అలాంటి పరిస్థితులు ఉండకూడదని భావించి పరిశోధనలు సాగించారు. నేడు ఒక్క ఇంజక్షన్ ద్వారా ఎయిడ్స్ తగ్గిపోయే మందులు వచ్చాయనీ, వ్యాధిగ్రస్తులు కూడా మామూలు వారి మాదిరిగా 80 ఏళ్లు వరకూ జీవించొచ్చునని చికిత్సల ద్వారా రుజువు చేస్తున్నారు. సొంతూరు శ్రీకాకుళం జిల్లా పొందూరు మండలం కింతలి గ్రామం. అయితేనేం...ప్రముఖ సాంక్రమిత వ్యాధుల నిపుణుడిగా ఆయన విశాఖపట్టణం నుంచి ప్రపంచస్థాయి గుర్తింపు పొందారు. శుక్రవారంనాడు ప్రపంచ ఎయిడ్స్ నివారణా దినం సందర్భంగా ఆయన ప్రజాశక్తికి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. వివరాలు ఆయన మాటల్లోనే...**

# ఎయిడ్స్ అంతం కోసం ...

**1981**లో లాస్ ఏంజెల్స్‌లోనూ, న్యూయార్క్‌లోనూ పాతికేళ్లలోపు యువకులు ఆయాసం, విరోచనాలు, జ్వరంతో రెండేళ్లలోపే మరణించేవారు. ఇదే తంతు ఆఫ్రికాలోనూ కొనసాగింది. 1986లో మొట్టమొదటి పది హెచ్ఐవి కేసులు చెన్నైలో బయటపడే సరికే నేను ఈ మహమ్మారికి కారణాలు కనుగొనడంపై పరిశోధనలు చేస్తున్నాను. ఎయిడ్స్ వ్యాధిలాగే వ్యాపించే హెపటైటిస్ బి వ్యాధి రక్తం పాజిటివ్ వారితో లైంగిక సంపర్కం, కలుషిత సూదులు, పచ్చబొట్లు వేసుకునే సమయంలోనూ, ఆపరేషన్ల పనిముట్లు సరిగా స్టెరిలైజ్ చేయనప్పుడు వ్యాపిస్తుంది. పాజిటివ్ తల్లి నుంచి బిడ్డకు సోకుతుంది. ఆంధ్ర వైద్య కళాశాల కింగ్ జార్జి ఆసుపత్రి (విశాఖపట్టణం)లోని మైక్రో బయాలజీ విభాగం సహాయంతో నాటి వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ధనరాజ్, కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వీరభద్రయ్యల నుంచి అధికారికంగా అనుమతి తీసుకుని హెపిటైటిస్ బి వ్యాధిపైనా పరిశోధనలు సాగించాను. వివిధ విభాగాల లేబరేటరీల్లో పనిచేస్తున్న టెక్నీషియన్లు రక్తం, మూత్ర శాంపిళ్ల సేకరణకు సహకరించారు. ఆ పరిశోధనా పత్రాన్ని బ్రిటన్‌లోని మాంచెస్టర్ విశ్వవిద్యాలయంలో అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌లో సమర్పించాను. అప్పటికే లండన్‌లో వేలాదిమంది యువకులు హెచ్ఐవికి గురైపోయి, దానితో ఒంటరి పోరాటం చేస్తున్న వారిని చూశాను. మాంచెస్టర్ ఆసుపత్రిలో హెచ్ఐవి వార్డు చూపించమని నేను అడిగితే అక్కడి స్టాఫ్ నర్సులు ఎంతో భయాందోళన ప్రదర్శిస్తూ చాలా దూరం నుంచే చూపించారు. వారి ప్రవర్తన నాకు చాలా వింతగా తోచింది. ఆ మరుసటి రోజే నేను ఆ యూనివర్శిటీ అతిథి గృహంలో ఓ పత్రిక చదువుతుంటే అందులో ఓ ఆర్టికల్ నన్ను ఆకర్షించింది. పాఠశాలలో ఏడేళ్ల విద్యార్థినిని తోటి విద్యార్థులు రాళ్లతో కొడుతున్నారు. ఎందుకనే ఆసక్తితో మొత్తం ఆర్టికల్ చదివాను. ఆ అమ్మాయి తల్లి పాజిటివ్ అయినందున తోటి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాఠశాల యాజమాన్యంపై ఒత్తిడి తెచ్చి ఆ విద్యార్థిని టిసి ఇచ్చేయాలని ఆందోళన చేశారు. తల్లికి సమస్య అయితే ఏ పాపం ఎరుగని ఆ అమ్మాయిని కొట్టడం నా మనసును బాగా కదిలించివేసింది. బ్రిటన్ లాంటి అభివృద్ధి చెందిన దేశంలోనే హెచ్ఐవి/ఎయిడ్స్ అంటే ఇంత వివక్షతో అంటరానిరోగుల్లా చూడటం తీవ్రంగా బాధేసింది. ఈ వ్యాధి భారత దేశానికి వస్తే బ్రిటన్‌తో పోల్చుకుంటే ఇక్కడ అక్షరాసత్య తక్కువ. మూఢ నమ్మకాలు ఎక్కువ. భారతదేశానికి రాగానే న్యూఢిల్లీలోని ప్రెస్‌క్లబ్‌లో హెచ్ఐవి/ఎయిడ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించేలా సందేశం ఇచ్చాను. దేశవ్యాప్తంగా కళాశాలలు, లయన్స్, రోటరీ లాంటి జాతీయ, అంతర్జాతీయ సంస్థల సహకారంతో అవగాహనా కార్యక్రమాల విస్తృతిని పెంచాను. నగరాల్లోని మురికివాడలు, గ్రామీణ ప్రాంతాల నుంచి గిరిజన తండాల వరకూ వందలు, వేలాదిగా



ఎయిడ్స్‌పై అవగాహనా కార్యక్రమాలు ఏర్పాటు చేస్తూ ప్రజలకు వ్యాధి వ్యాప్తి తీరు–నివారణా పద్ధతులుపై సవివరంగా వివరిస్తున్నాను.

**అద్భుత ఫార్ములాలతో వైద్యం**

1980వ దశకంలో ఎయిడ్స్ వ్యాధి మరణానికి మారుపేరు. 2023లో కూడా దీర్ఘకాలిక వ్యాధి మాత్రమే. ఎయిడ్స్ అని 72 గంటల్లో తేలితే పోస్టు ఎక్స్‌పోజర్ ప్రొఫలాక్సిస్ (పెప్) మందులు 28 రోజులు వాడితే పూర్తిగా నెగెటివ్ చేసుకునే అద్భుత ఫార్ములాలు నేడు మనకు అందుబాటులోకి ఉన్నాయి. అలసత్వం, ఉదాసీనత లేకుండా షుగర్, బీపీ రోగులు వేసుకునే మాత్రలు మాదిరిగానే ఈ మందులు కూడా వేసుకోవాలి. రూ.30 ఖరీదు



చేసే ఒక్క మాత్ర రోజూ క్రమం తప్పకుండా వేసుకుంటే ఎయిడ్స్ రోగులు కూడా 80 ఏళ్లపాటు ఆరోగ్యంగా, ఆనందంగా, ఉల్లాసంగా జీవించొచ్చు. కాబోయే భాగస్వాములకు, పుట్టబోయే బిడ్డలకు 99.9 శాతం వరకూ హెచ్ఐవి వ్యాపించకుండా నిరోధించే అధునాతన హార్ట్, కాక్టైల్, సాల్వేజ్ థెరపీ లాంటి ఎన్నో మందులు అందుబాటులోకి వచ్చాయి. రెండు, మూడు నెలలకు లేదా రెండు సంవత్సరాలకు ఒకసారి కెబోటిగ్రావిర్ లాంగ్ ఎక్టింగ్ ఇంజక్షన్లు, రెండేళ్లు పైబడి పనిచేసే ఎఆర్‌టి ఇంప్లాంట్స్ ఆవిష్కరించటం ఓ గొప్ప శుభవార్త.

**కిక్ అండ్ కిల్‌తో అంతం**

2022 జూన్‌లో టైప్–బి తెల్లకణాల్ని జన్యుపరంగా మార్పులు చేసి ఇంజక్షన్ రూపంలో ఒకే ఒక్కసారి ఇవ్వటం వల్ల ఎయిడ్స్ వ్యాధికి శాశ్వత చికిత్స ఆవిష్కరణైంది. వీటితోపాటు రాక్ఫెల్లర్ ఫౌండేషన్ యాంటీబాడీ ఇంజక్షన్ల ఉపయోగం, కిక్ అండ్ కిల్ విధానం లాంటి అత్యాధునిక వైద్యం త్వరలోనే అందుబాటులోకి రానుంది.

**చికిత్స-పరిశోధనలకు పద్మశ్రీ పురస్కారం**

ఎయిడ్స్ రంగంలో విశ్వవ్యాప్తంగా శాస్త్రీయ అవగాహన పెంపొందించటం, వ్యాధిగ్రస్తులకు సంఘీభావం తెలపటానికిగాను ప్రపంచంలోనే అతిపెద్ద రెడ్‌రిబ్బన్‌ను ప్రదర్శించాను. ఇప్పటివరకూ దక్షిణాఫ్రికా ఉప ప్రధానమంత్రి పేరునున్న రికార్డును బద్దలు కొట్టి గిన్నిస్‌బుక్ వరల్డ్ రికార్డు సాధించాను. ఈ రెడ్ రిబ్బన్‌ను లండన్‌లోని అనీఫీల్డ్ ఫుట్‌బాల్ స్టేడియంలో ఎయిడ్స్‌పై అవగాహన నిమిత్తం రెండేళ్లపాటు ప్రదర్శించారు. సుమారు 4000 మంది సెక్స్ వర్కర్ల పిల్లలు, బడుగు, బలహీన వర్గాల పిల్లల అభ్యున్నతి కోసం, ఉచిత వసతి, భోజనం, విద్య, వైద్యం వంటి సదుపాయాలు కల్పించాను. చాలామంది నేడు ఢిల్లీ, ముంబై, లండన్, జర్మనీ, అమెరికా లాంటి దేశాల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. వైద్యరంగంలో చికిత్స–పరిశోధనా రంగాల్లో చేస్తున్న కృషికి గుర్తింపుగా 2008లో అప్పటి రాష్ట్రపతి ప్రతిభాపాటిల్ గారు దేశంలోనే మూడో అత్యున్నత పద్మశ్రీ పురస్కారాన్ని ఇచ్చి గౌరవించారు. బ్రిటన్‌లోని ఎగువ సభ (హౌస్ ఆఫ్ లార్డ్స్) మహాత్మా సన్మాన్ పేరుతో పురస్కారాన్ని అందజేసింది.

**ఇంటర్వ్యూ : యడవల్లి శ్రీనివాసరావు**



### ప్రపంచ గుర్తింపు పొందిన డాక్టర్

హార్వర్డ్ యూనివర్శిటీ (యుఎస్ఎ), కేన్బరా యూనివర్శిటీ (ఆస్ట్రేలియా), కేలగరీ యూనివర్శిటీ (కెనడా) ఫెలోగా సుమారు 56 దేశాల్లో ఆయన ఎయిడ్స్ రంగంలో పరిశోధనా పత్రాలు సమర్పించారు. అమెరికా తెలుగు అసోయేషన్ (ఆటా) వారు చికాగోలో విశిష్ట పురస్కారంతో సత్కరించారు. బ్రిటీష్ మెడికల్ జర్నల్, డబ్ల్యుహెచ్ఒ, న్యూయార్క్ టైమ్స్, యాంటీ సెప్టిక్ (యుకె) వంటి ప్రఖ్యాత జర్నల్స్‌లో 120కి పైగా పరిశోధనా పత్రాలు ప్రచురితమయ్యాయి. ఎనిమిది టెక్స్ట్‌బుక్స్‌లో హెపటైటిస్, రేబిస్, ఎయిడ్స్, డయాబెటీస్ వంటి వివిధ అంశాలపై ఆంగ్లంలో అనేక పుస్తకాల్లో చాప్టర్లు రాశారు. ఐఎంఎ కాలేజ్ (చెన్నై) జాతీయ ప్రొఫెసర్‌గానూ, ఆంధ్రా యూనివర్శిటీ హ్యూమన్ జెనెటిక్స్ విభాగానికి గౌరవ ప్రొఫసర్‌గానూ, ఇన్ఫెక్టిస్ డిసీజెస్ సొసైటీ ఆఫ్ అమెరికా సభ్యుడిగా ఉన్నాను. కింగ్ జార్జి ఆసుపత్రి, ఆంధ్రా మెడికల్ కళాశాలకు సంస్థాగత ఎథిక్స్ కమిటీ ఛైర్మన్‌గానూ పనిచేశాను. ఆంధ్రా యూనివర్శిటీ పాలకవర్గ సభ్యుడిగానూ, ఎపి ప్రభుత్వ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యుడిగా గతంలో పనిచేశాను.



## క్యాప్షన్ చెప్పండి.. ఫ్రీగా సినిమా చూసేయండి...

ప్రభాస్ హీరోగా నటించిన తాజా యాక్షన్ థ్రిల్లర్ చిత్రం 'సలార్' నుండి డిసెంబర్ 1న (ఈరోజు) ట్రైలర్ రిలీజ్ కాబోతుంది. ట్రైలర్‌పై హైప్ తీసుకొచ్చేందుకు చిత్రబృందం ఓ ఫొటోని షేర్ చేసింది. షూటింగ్ స్పాట్‌లో ప్రభాస్, ప్రశాంత్ నీల్ ఉన్న ఆ ఫొటోకి పర్ఫెక్ట్ క్యాప్షన్ చెప్పిన ఓ ఐదుగురికి ఫస్ట్ డే ఫస్ట్ షో టికెట్స్ ఇస్తామని కూడా చెప్పింది. అంతేకాక తాజాగా మొదలుపెట్టిన సలార్ మెర్సండైజ్‌ని కూడా గిఫ్ట్‌గా అందిస్తామని తెలిపింది.

## నిర్మాణానంతర కార్యక్రమాల్లో 'నా సామిరంగ'





అక్కినేని నాగార్జున ప్రస్తుతం నూతన దర్శకుడు విజయ్ బిన్ని దర్శకత్వంలో 'నా సామి రంగ' చిత్రీకరణలో పాల్గొంటున్నారు. ఈ చిత్ర షూటింగ్ డిసెంబర్ 7, 2023 నాటికి పూర్తి చేయడానికి చిత్రబృందం ప్రయత్నిస్తోంది. 2024 సంక్రాంతి సీజన్‌లో సినిమాను విడుదల చేయాలన్న లక్ష్యంతో నిర్మాణానంతర కార్యక్రమాలను కూడా వేగవంతం చేస్తోంది. శ్రీనివాస చిట్టూరి తన బ్యానర్ 'శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్'పై ఈ సినిమాని నిర్మిస్తున్నారు. ప్రసన్న కుమార్ కథ, సంభాషణలను అందించారు. ఎంఎం కీరవాణి సంగీతం అందించారు.

## కుటుంబ సమేతంగా చూడదగ్గ చిత్రం : తిరుమలరావు



'ఈ మధ్యకాలంలో చిన్నారుల నుంచి ఇంటికి పెద్ద దిక్కు వరకు..అన్ని వయస్సుల వారు కుటుంబ సమేతంగా చూడదగ్గ చిత్రం 'పల్లెగూటికి పండగొచ్చింది'. శ్రీకాకుళం జిల్లా ప్రాముఖ్యతను చాటిచెబుతుంది. ఆ జిల్లాలోని అందమైన ప్రదేశాల్లో ఈ సినిమా చిత్రీకరణ జరిగింది. సత్యవరం అనే గ్రామంలో బాధ్యతారాహిత్యంగా తిరిగే యువత...ఆ తర్వాత బాధ్యతను తెలుసుకుని ఆ గ్రామాన్ని స్మార్ట్ విలేజ్‌గా ఎలా మార్చారు' అనే కథాంశంతో ఈ సినిమాను తీశాం' అని దర్శకులు తిరుమలరావు కంచరాన పేర్కొన్నారు. .ప్రవీణ్ సమర్పణలో ఈశ్వర్ మెమోరియల్ లక్ష్మి ఫిల్మ్ ప్రొడక్షన్ బ్యానర్‌పై కంచరాన రాజ్యలక్ష్మి నిర్మించిన చిత్రం ఇది. శుక్రవారం ఈ సినిమా విడుదల కానున్న సందర్భంగా దర్శకుడు తిరుమలరావు సినిమా వివరాలు వెల్లడించారు. ప్రతి ఒక్కరూ కుటుంబ సమేతంగా చూడదగిన చిత్రంగా పేర్కొన్నారు.

## ఓటీటీలో తెలుగు 'ధూమం'



ఫాహద్ ఫాజిల్ నటించిన 'ధూమం' చిత్రం ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతోంది. కన్నడం, మలయాళంతో పాటు తెలుగు, తమిళ భాషల్లో ఓటీటీ రిలీజ్ చేశారు. పవన్ కుమార్ దర్శకత్వం వహించారు. హోంబలే ఫిల్మ్స్ సంస్థ నిర్మించింది. పాన్ ఇండియన్ లెవెల్‌లో అన్ని దక్షిణాది భాషల్లో ధూమం సినిమాను రిలీజ్ చేయాలని మేకర్స్ మొదట అనుకున్నారు. కానీ తెలుగు వెర్షన్ డబ్బింగ్ పనులు ఆలస్యం కావడం వల్ల థియేటర్లలో రిలీజ్ కాలేకపోయింది. తాజాగా డైరెక్ట్‌గా ఓటీటీలో తెలుగు వెర్షన్‌ను రిలీజ్ చేశారు. ఈ సినిమాలో ఫాహద్ ఫాజిల్‌తో పాటు అపర్ణ బాలమురళి, రోషన్ మాథ్యూ ప్రధాన పాత్రలను పోషించారు. సిగరెట్ తాగడం వల్ల తలెత్తే అనర్థాల్ని యాక్షన్ థ్రిల్లర్ కథతో ఈ సినిమాలో చూపించారు.





## వైజాగ్ అంటే నాకెంతో ఇష్టం : నాని

'నేను ఇక్కడి అమ్మాయిని పెళ్లి చేసుకున్నానని కాదుగానీ మీకు (విశాఖపట్నం వాసులు), నాకు మధ్య ప్రత్యేక బంధం ఉంది. నా యాక్షన్ చిత్రాలు మిగిలిన ప్రాంతాలతో పోలిస్తే సీడెడ్‌లో పెద్ద హిట్ అయ్యాయి. ఎంటర్‌టైనింగ్ సినిమాలు యూఎస్, హైదరాబాద్‌లాంటి ప్రాంతాల్లో ఎక్కువ విజయాన్ని పొందాయి. నేపథ్యం ఏదైనా అన్ని సినిమాలు బ్రహ్మాండంగా ఆడిన ప్రాంతం వైజాగ్. ప్రతి ఒక్కరికీ కృతజ్ఞుడిని. జనవరిలానే డిసెంబరు కూడా సినిమాల పండగ నెలగా మారింది' అని హీరో నాని అన్నారు. నాని హీరోగా నూతన దర్శకుడు శౌర్యువ్ తెరకెక్కించిన చిత్రం 'హాయ్ నాన్న. మృణాల్ ఠాకూర్ కథానాయిక. బేబీ కియారా, శ్రుతిహాసన్, ప్రియదర్శి తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈనెల ఏడోతేదీన సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్ర బందం విశాఖపట్నంలో నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో హీరో నాని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నటులు ప్రియదర్శి, విరాజ్ అశ్విన్, బేబీ కియారా తదితరులు పాల్గొన్నారు.

## హృతిక్, ఎన్టీఆర్‌ల 'వార్ 2'

హృతిక్‌రోషన్, ఎన్టీఆర్‌లు కలిసి నటిస్తున్న చిత్రం వార్ 2. అయాన్ ముఖర్జీ తెరకెక్కిస్తున్నారు. కియారా అద్వాణీ కథానాయిక. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ జరుగుతోంది. 2025 ఆగస్టు 14న ఈ సినిమా విడుదల చేయబోతున్నామని చిత్రబృందం ప్రకటించింది. యశ్‌రాజ్ ఫిల్మ్స్ ద్వారా ఆదిత్య చోప్రా నిర్మిస్తున్నారు. ఎన్టీఆర్ ప్రతినాయక ఛాయలున్న పాత్రలో కనిపించనున్నారు. 'దేవర' చిత్రీకరణతో బిజీగా ఉన్న ఆయన 'వార్ 2' కోసం సంక్రాంతి తర్వాత సెట్లోకి అడుగు పెట్టనున్నట్టు సమాచారం.

### మూడు ఫార్మాట్లకు

## ముగ్గురు సారథులు

### దక్షిణాఫ్రికా పర్యటనకు జట్లను ప్రకటించిన బిసిసిఐ



టి20 : సూర్యకుమార్ | వన్డేలు : కెఎల్ రాహుల్ | టెస్టులు : రోహిత్ శర్మ

**ముంబయి:** ఆస్ట్రేలియా టి20 సిరీస్ ముగిసిన వెంటనే భారతజట్టు 10నుంచి దక్షిణాఫ్రికా పర్యటనకు బయల్దేరి వెళ్లనుంది. ఆ పర్యటనలో భాగంగా దక్షిణాఫ్రికాతో టి20, వన్డే, టెస్టుల్లో భారత్ తలపడనుంది. ఈ క్రమంలో మూడు ఫార్మాట్‌లకు ముగ్గురు కెప్టెన్లను ప్రకటించిన బిసిసిఐ అందరికీ ఒక్కసారిగా షాక్ ఇచ్చింది. రోహిత్ శర్మకు వన్డే, టి20లకు విశ్రాంతి తీసుకొని, టెస్టుల్లో సారథ్యం వహించనున్నాడు. అలాగే విరాట్ కోహ్లీకి బిసిసిఐ విశ్రాంతి ఇచ్చింది. టెస్టు సిరీస్‌కు రోహిత్.. వన్డే సిరీస్‌కు కేఎల్ రాహుల్.. టి20లకు సూర్యకుమార్ యాదవ్ నాయకత్వ బాధ్యతలను అప్పగించింది. ఓ విదేశీ టూర్‌కు మూడు ఫార్మాట్లకు ముగ్గురిని కెప్టెన్లుగా బిసిసిఐ నియమించడం ఇదే తొలిసారి.

**టి20 జట్టు:** సూర్యకుమార్(కెప్టెన్), జైస్వాల్, శుభ్‌మన్, గైక్వాడ్, ఇషాన్ కిషన్(వికెట్ కీపర్), తిలక్ వర్మ, రింకు సింగ్, శ్రేయస్, జితేశ్ శర్మ(వికెట్ కీపర్), జడేజా (వైస్ కెప్టెన్), సుందర్, బిష్ణోయ్, అర్ష్‌దీప్, సిరాజ్, ముకేశ్, దీపక్ చాహర్, కుల్దీప్.

**వన్డే జట్టు:** కెఎల్ రాహల్ (కెప్టెన్/వికెట్ కీపర్), గైక్వాడ్, సాయి సుదర్శన్, తిలక్ వర్మ, పటీదార్, రింకు సింగ్, శ్రేయస్, సంజూ శాంసన్, అక్షర్ పటేల్, సుందర్, కుల్దీప్, చాహల్, ముకేశ్ కుమార్, అవేశ్ ఖాన్, అర్ష్‌దీప్, చాహర్.

**టెస్టు జట్టు:** రోహిత్ శర్మ(కెప్టెన్), శుభ్‌మన్, జైస్వాల్,కోహ్లీ, శ్రేయస్, గైక్వాడ్, ఇషాన్ కిషన్, కెఎల్ రాహుల్(వికెట్ కీపర్లు), అశ్విన్, జడేజా, శార్దూల్, సిరాజ్, షమీ, బుమ్రా(వైస్ కెప్టెన్), ప్రసిధ్ కృష్ణ

**దక్షిణాఫ్రికాతో సిరీస్...**

**డిసెంబర్ 10 : తొలి టి20**
**డిసెంబర్ 12 : రెండో టి20**
**డిసెంబర్ 14 : మూడో టి20**
**డిసెంబర్ 17 : తొలి వన్డే**
**డిసెంబర్ 19 : రెండో వన్డే**
**డిసెంబర్ 21 : మూడో వన్డే**
**డిసెంబర్ 26-30 : తొలి టెస్టు**
**జనవరి 3-7 : రెండో టెస్టు**

### ఇక్కడే ముగించాలి

**ఆస్ట్రేలియాతో నాల్గో టి20 నేడు రాత్రి 7.00గంలకు**

**రాయ్‌పూర్:** తొలి రెండు టి20ల్లో నెగ్గిన టీమిండియా.. మూడో టి20లో భారీ స్కోర్ చేసినా చేజేతులా పరాజయాన్ని చవిచూసింది. ఈ క్రమంలో ఆసీస్‌తో శుక్రవారం జరిగే నాల్గో టి20లో గెలిచి సిరీస్‌ను ఇక్కడే ముగించాలని భారత్ భావిస్తోంది. బ్యాటర్స్ అద్భుత ఫామ్‌లో ఉన్నా.. బౌలర్లు ఆసీస్ బ్యాటర్లను కట్టడి చేయలేకపోతున్నారు. ముఖ్యంగా మూడో టి20లో 222పరుగుల భారీ స్కోర్‌ను ఆసీస్ జట్టు ఛేదించకుండా భారత బౌలర్లు నిరోధించలేకపోయారు. చివరి 12 బంతుల్లో ఆసీస్ జట్టు 43పరుగులు రాబట్టి గెలిచిన తీరు వర్ణణాతీతం. మరోవైపు ఆస్ట్రేలియాకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. మూడో టి20 ముగిసాయ ఆసీస్ స్టార్ ఆటగాళ్లు స్టీవ్ స్మిత్, ఆడం జంపా, మ్యాక్స్‌వెల్, స్టొయినీస్, ఇంగ్లిస్, అబట్ స్వదేశానికి బయల్దేరారు. గౌహతి వేదికగా జరిగిన మూడో టి20లో ఆసీస్‌ను గెలిపించిన మ్యాక్స్‌వెల్ జట్టుకు దూరం కావడం ఆసీస్ జట్టుకు గట్టి ఎదురుదెబ్బ తగిలినట్లే.

## నజ్ముల్ సెంచరీ

### భారీ ఆధిక్యత దిశగా బంగ్లాదేశ్.. న్యూజిలాండ్‌తో తొలిటెస్ట్



**చిట్టోగ్రామ్(బంగ్లాదేశ్):** న్యూజిలాండ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో బంగ్లాదేశ్ భారీ ఆధిక్యత దిశగా దూసుకెళ్తోంది. తొలి ఇన్నింగ్స్‌లో న్యూజిలాండ్ జట్టు 317పరుగులకు ఆలౌట్ కావడంతో ఆ జట్టుకు 7పరుగుల స్వల్ప ఆధిక్యత లభించింది. గురువారం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన బంగ్లా జట్టు మూడోరోజు ఆట ముగిసే సమయానికి 68 ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 212 పరుగులు చేసింది. మహ్మదల్ హసన్ జాయ్(8) వికెట్‌ను ఆదిలోనే కోల్పోయింది. మరో ఓపెనర్ జకీర్ హసన్(17) అజాజ్ పటేల్ వేసిన 14వ ఓవర్లో ఎల్బీగా నిష్క్రమించాడు. 26 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయిన బంగ్లాను శాంతో, మోమినుల్ హక్(40) ఆదుకున్నారు. వీరిద్దరూ మూడో వికెట్‌కు 90 పరుగులు జోడించారు. ఈ క్రమంలో మోమినుల్.. రనౌట్ కావడంతో ఆ జట్టు మూడో వికెట్ కోల్పోయింది. మోమినుల్ నిష్క్రమించినా.. ముష్ఫికర్ రహీమ్‌తో కలిసి శాంతో బంగ్లా ఇన్నింగ్స్‌ను నడిపిస్తున్నాడు. వీరిద్దరూ నాల్గో వికెట్‌కు అజేయంగా 96 పరుగులు జోడించారు. దీంతో ఆ జట్టుకు ఇప్పటికే 205 పరుగుల ఆధిక్యత లభించింది. కెప్టెన్ నజ్ముల్ హొసైన్ శాంతో(104నాటౌట్, 10 ఫోర్లు) శతకంతో మెరిసాడు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోర్ 8వికెట్ల నష్టానికి 266 పరుగులతో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన న్యూజిలాండ్ జట్టు జెమీసన్ (23)తో పాటు కెప్టెన్ టిమ్ సౌథీ(35) రాణించడంతో ఆధిక్యతను సంపాదించింది.



## చరిత్ర సృష్టించిన ఉగాండా..

### టి20 ప్రపంచ కప్‌కు తొలిసారి అర్హత

**దుబాయ్:** జింబాబ్వే, కెన్యా వంటి బలమైన జట్లను వెనక్కి నెట్టి 2024 టి20 ప్రపంచకప్‌కు ఉగాండా జట్టు అర్హత సాధించింది. వచ్చే ఏడాది అమెరికా, వెస్టిండీస్ వేదికగా టి20 ప్రపంచ కప్ జరగనుంది. ఆఫ్రికా రీజియన్ క్వాలిఫయర్–2023 పోటీల్లో భాగంగా ఉగండా జట్టు గురువారం చివరి లీగ్ మ్యాచ్‌లో రువాండాపై 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. దీంతో పాయింట్ల పట్టికలోఉగండా జట్టు 10పాయింట్లతో రెండోస్థానం నిలిచింఇ. ఏడు దేశాల మధ్య జరిగిన టోర్నీలో నమీబియా ఆడిన ఐదు మ్యాచుల్లో ఐదింటిని గెలిచి పది పాయింట్లతో ఇప్పటికే అర్హత సాధించింది. తాజాగా ఉగాండా జట్టు ఆరు మ్యాచ్‌లలో ఐదు గెలిచి పది పాయింట్లతో రెండో స్థానలో ఉంది. నమీబియా, ఉగాండాలు క్వాలిఫై అవడంతో జింబాబ్వే, కెన్యా, నైజీరియా, టాంజానియా, రువాండా లీగ్ దశలోనే నిష్క్రమించాయి.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68